ప్రజాశక్తి

సిటీ

ప్రతి అక్షరం ప్రజల పక్షం

fb/prajasakti Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 228 విజయవాడ, శుక్రవారం 18 ఆగస్టు 2017 12 + 12 పేజీలు వెల : 4.00



బీహార్‌లో 1000 కోట్ల కుంభకోణం

సిఎం, డిప్యూటీ సిఎంల ప్రత్యక్ష ప్రమేయం: విపక్షం ఆరోపణ

పాట్నా: బీహార్‌లో వెలుగు చూసిన రు.వెయ్యి కోట్ల 'శ్రీజన్' అవినీతి కుంభకోణం అక్కడి నితీష్ సర్కారును కుదిపేస్తోంది. ఈ కుంభకోణంలో ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉపముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోడీ ప్రత్యక్ష ప్రమేయం వుందంటూ ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు ప్రభుత్వంలో తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. భాగల్పూర్ జిల్లాలోని శ్రీజన్ మహిళా సహయోగ్ సమితి అనేస్వచ్ఛంద సంస్థకు రు.1000 కోట్ల ప్రభుత్వ నిధుల బదిలీకి సంబంధించిన ఈ కుంభకోణంలో ఆ సంస్థ తనకు వచ్చిన ప్రభుత్వ నిధులను అత్యధిక వడ్డీరేటుకు రుణాల రూపంలో మిగతా 9లో



క్రీడా మంత్రి గోయెల్ భూ క్రీడ

నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపులు

న్యూఢిల్లీ: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయమంత్రి విజయ్ గోయెల్‌కు సంబంధించిన టాయ్ బ్యాంక్ ఏర్పాటు కోసం ఢిల్లీ నగరాభివృద్ధి సంస్థ (డిడిఎ) తన నిబంధనలను సైతం మార్పు చేసిన కుంభకోణం వెలుగులోకి వచ్చింది. మంత్రికి చెందిన వైష్ అగర్వాల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (విఎఇఎస్) ప్రతిపాదించిన టాయ్ బ్యాంక్ ఏర్పాటు కోసం డిడిఎ తన లేఅవుట్ నిబంధనలను మార్చి ప్లాట్‌ను కేటాయించినట్లు ఒక పత్రికలో ప్రచురితమైన వార్తా కథనం వెల్లడించింది. వాస్తవానికి ఒక పోస్టాఫీస్ ఏర్పాటు కోసం కేటాయించిన ఈ ప్లాట్‌ను డిడిఎ తన నియమ నిబంధనలను పక్కన పెట్టి 2016 సెప్టెంబర్‌లో మంత్రికి చెందిన విఎఇఎస్ సంస్థకు కేటాయించినట్లు మిగతా 9లో

హామీలు ఫుల్ - నిధులు డల్

• వాగ్దానాల విలువ 26,696 కోట్లు • బడ్జెట్ కేటాయింపు 6484 కోట్లే

- ఇంకా కావాల్సింది 20 వేల కోట్లు
- అయోమయంలో ఆర్థికశాఖాధికారులు
- అమలు అనుమానమే



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం తలలు పట్టుకుంటోంది. నిధుల లేమితో హామీల అమలు అయోమయ పరిస్థితికి చేరుకుంటోంది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఏమూలకూ చాలక పోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంటోంది. హామీల అమలు, వాటికి కావాల్సిన నిధుల మధ్య భారీ తేడా ఉండడంతో ఆర్థిక శాఖ అధికారులు కూడా అయోమయంలో పడుతున్నారు. అవసరమైన భారీ నిధుల సముపార్జన ఎలాగనేది అర్థం కావడం లేదని వారంటున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చంద్రబాబు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిల్లో రైతులకు రుణమాఫీ, స్వయం సహాయ బృందాలకు మ్యాచింగ్ గ్రాంట్లు, పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు, డ్వాక్రా బృందాలకు వడ్డీ లేని రుణాలు, విద్యుత్ బిల్లులు వీటిలో కీలకంగా ఉన్నాయి. ఈ మొత్తం ఐదు అంశాలకు బడ్జెట్‌లో రూ. 6484 కోట్లు కేటాయించారు. వాస్తవంగా వీటికి మిగతా 9లో

ఐదు కీలకాంశాలకు కావాల్సిన నిధుల వివరాలు (రూ.కోట్లలో)

అంశం	బడ్జెట్‌లో కేటాయింపులు	కావాల్సిన మొత్తం	అదనంగా కావాల్సిన నిధులు
రుణ మాఫీ	3600	13,176	9,576
ఎస్‌హెచ్‌జిలకు	1,600	3,316	1,716
పరిశ్రమలకు	600	4,200	3,600
వడ్డీలేని రుణాలు	110	3,430	3,320
విద్యుత్ బిల్లు	574	2,574	2,000
మొత్తం	**6,484**	**26,696**	**20,212**

పదహారేళ్ల అమ్మాయికి 65 ఏళ్ల అరబ్ షేక్‌తో పెళ్లి

పోలీసులకు యువతి తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదహారేళ్ల అమ్మాయికి 65 ఏళ్ల అరబ్ షేక్‌తో పెళ్లి జరిపించి ఒమన్ దేశానికి పంపిన ఘటన హైదరాబాద్ పాతబస్తీలో చోటు చేసుకుంది. ఇది జరిగి మూడు నెలలు కావస్తున్నా, యువతి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. పదహారేళ్ల తన కుమార్తెను మస్కట్ దేశానికి చెందిన 65 ఏళ్ల వద్ధుడికి ఇచ్చి వివాహం చేసి అరబ్ దేశానికి పంపించారని హైదరాబాద్ నగరంలోని నవాబ్ సాహెబ్ కుంట ప్రాంతానికి చెందిన బాలిక తల్లి సయీదా ఉన్నిసా బేగం ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త సికిందర్, అతని సోదరి గౌసియాలు కలిసి పాతబస్తీకి చెందిన ఓ ఖాజీ సాయంతో బార్కాస్ హొటల్‌లో పెళ్లి చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త, అతని సోదరి అరబ్ షేక్ నుంచి రూ.5లక్షలు తీసుకొని ఈ పెళ్లి జరిపించారని ఆమె ఆరోపించారు. పెళ్లయ్యాక తన కూతురుకి టూరిస్టు పాస్‌పోర్టు ఇప్పించి ఒమన్ దేశానికి పంపించారని ఆమె చెప్పారు. తన కూతురు మిగతా 9లో



రోడ్డుషోలో డబ్బులు పంచుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ



టిడిపి కార్యకర్తపై చెయ్యి చేసుకుంటున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

బాలయ్యా ఇదేం పనయ్యా!

బావకు తిప్పలు తెచ్చిన మరిది ప్రచారం

ప్రజాశక్తి - నంద్యాల

ముఖ్యమంత్రి చంద్రబాబుకు బావమరిది, వియ్యంకుడు కూడా అయిన ప్రముఖ సినీ హీరో, హిందూపురం ఎంఎల్ఏ బాలకృష్ణ నంద్యాల నియోజకవర్గంలో చేసిన ఎన్నికల ప్రచారం తెలుగుదేశం పార్టీకి కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. తెలుగుదేశం పార్టీ తరపున స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న బాలయ్య ప్రచారంపై ఆ పార్టీ శ్రేణులు చాలా ఆశలు పెట్టుకున్నాయి. దీనికి తగ్గట్టుగానే ఆయన టూర్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. బుధవారమంతా ఆయన ప్రచారం జోరుగానే సాగింది. తనదైన పంచ్‌మార్కు డైలాగులతో బాలయ్య కార్యకర్తల్లో హుషారు నింపడంతో పాటు, ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నమూ చేశారు. అయితే, ఇదంతా నాణానికి ఒక వైపు మాత్రమే! 'చూడు.. ఒకవైపే చూడు... రెండోవైపు చూడొద్దు..' అంటూ ఏదో సినిమాలో బాలయ్య ప్రఖ్యాత డైలాగు మాదిరిగానే మరోవైపు దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రచార పర్వం ముగిసిన తరువాత రాత్రి నంద్యాలలోని లాడ్జికి బస చేయడానికి వచ్చిన బాలయ్య తనకు పూలమాల వేసి, ఫోటో దిగడానికి ప్రయత్నించిన ఒక అభిమానిపై విరుచుకుపడ్డాడు. చెంప చెళ్లుమనిపించాడు. అనూహ్యంగా జరిగిన ఈ పరిణామంతో అక్కడ ఉన్న నాయకులు, అభిమానులు నివ్వెరపోయారు. ఈ సంఘటన జరిగినప్పుడు అక్కడ మీడియా ప్రతినిధులు ఎవ్వరూ లేరు. బాలయ్య చర్యతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆయన అభిమానులు, టిడిపి కార్యకర్తలే బాలకృష్ణ తీరును సెల్‌ఫోన్లో చిత్రీకరించి, ఆన్‌లైన్‌లో పెట్టారు. ఈ విషయం చర్చనీయాంశమవుతుండగానే మిగతా 9లో



విజయవాడలో హార్టీకల్చర్ ఎగ్జిబిషన్‌లో ఉంచిన సేంద్రియ కూరగాయలను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

ఉద్యాన పంటలతో అధిక లాభాలు

- సేంద్రియ, నర్సరీ ఎక్స్‌పోలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యాన పంటలతో రైతులు అధిక లాభాలనార్జించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం విజయవాడ సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ' సేంద్రీయ మరియు నర్సరీ ఎక్స్‌పో 'ను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో రాష్ట్రం ఉద్యానరంగ కేంద్రంగా మారుతుందన్నారు. సేంద్రీయ పంటలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపులేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, దీనికి సర్టిఫికెట్ చేయాల్సిన అవసరముందన్నారు. అలా చేయడం వల్ల సేంద్రీయ రైతులు లాభాలు పొందచ్చొన్నారు. శ్రమకోర్చి సేంద్రీయ పద్ధతిలో పంటలు పండించినా సరైన గుర్తింపు లేకపోవడంతో సాధారణ ఉత్పత్తుల మాదిరిగా ధర వస్తోందని, ఇక ముందు రైతులు నష్టపోకుండా మంచి ధర వచ్చే విధంగా సర్టిఫికెట్లు ఇప్పిస్తామని హామీనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దీనికి తగిన ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. దేశంలోనే మొట్టమొదటి సేంద్రీయ, నర్సరీ మేళా 2017లో సేంద్రీయ ఉత్పత్తులు, సర్టిఫికేషన్‌పై రైతులకు అవగాహన కల్పించామని ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి తెలిపారు. నాణ్యమైన మొక్కలను రైతులకు అందించేందుకు, విదేశాలకు ఎగుమతి చేసేందుకు నర్సరీ యాజమాన్యం సరైన ప్రమాణ పద్ధతులు పాటించే అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా సిఎం తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఉత్తమ నర్సరీ, సేంద్రీయ ఉత్పత్తుల స్టాళ్లకు ముఖ్యమంత్రి బహుమతులు అందజేశారు. అంతకు ముందు మిగతా 9లో

సిఎం డ్యాష్ బోర్డుకు తెలిసేలా ఉద్యమం

- మున్సిపల్ స్కూళ్లలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి
- డిఎంఎ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో మహాధర్నా



గుంటూరు ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం, వేదికపై కత్తి నర్సింహారెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డాష్ బోర్డు ఏర్పాటు చేసుకొని రాష్ట్రంలో ఏం జరిగినా చిటికెలో తెలుసుకుంటారని, మున్సిపల్ ఉపాధ్యాయులు పడుతున్న కష్టాలు సిఎం డ్యాష్ బోర్డుకు తెలిసేలా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని శాసనమండలి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ గుంటూరులోని మున్సిపల్ డైరెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాసనమండలిలో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. విద్య కార్పొరేటీకరణను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని దశలవారీగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి అత్యంత పాశవికంగా పూనుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో కేవలం ఇంగ్లీషు మీడియంనే నిర్వహించడం వల్ల డ్రాపవుట్స్ పెరిగాయని గుర్తుచేశారు. ప్రభుత్వం కొత్త విధానాలు తీసుకునే సమయంలో మేధావులను, విద్యావేత్తలను, సంఘాలను సంప్రదించాలనే ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చిందని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి చాలా నిరంకుశంగా మిగతా 9లో

ప్రజ్ఞ

1. కుత్రిమ కీలు తయారీకి వినియోగించే పదార్థాలేవి?
2. వైద్యసేవల అందుబాటులో భారత స్థానం ఎంత?
3. విశాఖలో ఏ యుద్ధ విమానంలో మ్యూజియం ఏర్పాటు చేస్తున్నారు?
4. జమ్ము కాశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించిన ఆర్టికల్ ఏది?
5. భారత క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ ఎవరు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వాతావరణం

48 గంటల్లో అల్పపీడనం

బంగాళాఖాతంలో ఆవర్తనం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ఉత్తర బంగాళాఖాతంలో 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం నైరుతి దిశగా కదులుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. 48 గంటల్లో ఇది అల్పపీడనంగా మారే అవకాశాలున్నట్లు తెలిపింది. ఒడిశా నుంచి కోస్తాంధ్ర మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నట్లు పేర్కొంది. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో హిమాలయాల్లో చిక్కుకున్న నైరుతి రుతుపవనాల ద్రోణి కిందకు దిగినట్లు వాతావరణ శాఖ పేర్కొంది. 48 గంటల్లో ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలోని నైరుతి పవనాలు పునరాగమనం చేస్తాయని తెలిపింది. వీటి ప్రభావంతో కోస్తాలో నాలుగు రోజుల పాటు పలు చోట్ల చెదురుమదురు నుంచి ఓ మోస్తరు జల్లులు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. రాయలసీమలో అక్కడక్కడా జల్లులు పడతాయని తెలిపింది. గురువారం ఉదయానికి వింజమూరులో 6.6, రణస్థలంలో 3.8, పలాస 3.6, చీపురుపల్లిలో 3.2, ఇచ్ఛాపురంలో 3.0, కొమరాడ 2.8, విజయనగరంలో 2.6, నగరిలో 5.9, చిత్తూరు 4.9, కానేకల్ 4.4, రాయచోటి 3.6, కళ్యాణదుర్గం 3.6 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

అభివృద్ధికి శాంతి భద్రతలే కీలకం

కేంద్ర మంత్రి రిజిజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏ దేశమైనా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే శాంతి భద్రతల పరిరక్షణ కీలకమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్‌ల ఆధ్వర్యంలో గురువారం ఇక్కడ ఐఐసిటి,ఆడిటోరియంలో జాతీయ భద్రతపై యువ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి రిజిజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిజు మాట్లాడుతూ, భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలిపోకూడదని, దేశం పురోగమించడానికి ఇది సరైన సమయమని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ళ వయస్సులోపు వారేనని, సవాళ్లను స్వీకరించి దేశాన్ని ముందుకు నడపడానికి యువత సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి చెప్పారు. సీమాంతర ఉగ్రవాదం, మత్తు మందుల అక్రమ రవాణా, దొంగ నోట్లు వంటి వివిధ రకాల సవాళ్ళను ఎదుర్కోవడానికి పటిష్టమైన భద్రత వ్యవస్థ ఉండి తీరాలని చెప్పారు. ఉగ్రవాద ముప్పును సమర్థంగా ఎదుర్కోవడానికి దేశాలు రహస్య సమాచారాన్ని పంచుకోవలసిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం చెబుతూ వస్తోందని గుర్తు చేశారు. అర్థవంతమైన ఉపాధిని అన్వేషించడంలో సఫలం కావాలని, దేశ అభివద్ధిలో పాలుపంచుకోవాలని యువతకు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులడిగిన కొన్ని ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు.

ఏకలవ్య గురుకులాలు ఎక్కడ..?

- ఆదివాసీలపై సర్కారు ఉదాసీనత
- పేరుకే 14 పాఠశాలలు
- ఉన్నవల్లా గతంలోని నాలుగే..!



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ 14 పాఠశాలల ద్వారా ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వం పేర్కొంటున్నట్లు ఆ పాఠశాలలన్నీ ఇంతవరకు ప్రారంభమే కాలేదు. గతంలో నడుస్తున్న నాలుగు పాఠశాలలే నేటికీ కొనసాగుతున్నాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదనంగా ఒక్క పాఠశాలా ప్రారంభం కాకపోవడం గమనార్హం. ఆదిమ గిరిజన తెగలకు (ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్స్) చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన కోసం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల పథకాన్ని గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఈ పథకం అమలుకు నూరు శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. అయిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు మెరుగైన విద్యను అందించడమే ఈ పాఠశాలల లక్ష్యం. 5-10 తరగతుల వరకు 60 మంది విద్యార్థుల చొప్పున ప్రతి తరగతిలో రెండేసి సెక్షన్లు, ఇంటర్‌లో తరగతికి 60 మంది చొప్పున మూడు (సైన్సు, మ్యాథ్స్, ఆర్ట్స్) గ్రూపుల్లోను విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ పథకంలో భాగంగా నెల్లూరు జిల్లా కొడవలూరు, ప్రకాశం జిల్లా దోర్నాల, తూర్పుగోదావరి జిల్లా వై.రామవరం, విశాఖపట్నం జిల్లా జికె వీధిలోను మొత్తం రాష్ట్రంలో నాలుగు పాఠశాలలు ఇదివరకే ఏర్పాటయ్యాయి. వీటిలో కొడవలూరు, వై రామవరంలోని పాఠశాలలు 2005లోను, దోర్నాల, జికె వీధిలోని పాఠశాలలు 2010లోనూ ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రానికి మరో 12 పాఠశాలలను 2015లోనే కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఒకటి బాలురకు, మిగిలినవన్నీ బాలికల కోసం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి, పాత పనుకువలస, విజయనగరం జిల్లా అనాసభద్ర (బాలురు), కొమరాడ, కోటికపెంట, విశాఖపట్నం జిల్లా దుమ్రిగూడ, మంచింగ్‌పుట్, తూర్పు గోదావరి జిల్లా మారేడుమిల్లి, నెల్లూరు జిల్లా ఓజిలి, చిత్తూరు జిల్లా బిఎన్ కండ్రిగలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ పాఠశాలల నిర్మాణానికి కూడా కేంద్రం ఒక్కో పాఠశాలకు రూ.12 కోట్ల చొప్పున నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో పాఠశాల భవనం, విద్యార్థులకు వసతి గృహం, మరుగు దొడ్లు, స్నానాల గదులు, ప్రిన్సిపల్, బోధన, బోధనేతర సిబ్బందికి నివాస గృహాలు నిర్మించాల్సి ఉంది. కాని ఇంతవరకు అటువంటి చర్యలేవీ చేపట్టలేదు. వీటిల్లో ఓజిలి, బిఎన్ కండ్రిగ పాఠశాలలకు శంకుస్థాపనలు చేసి వదిలేశారు. మిగిలినవి వాటికీ ఇంతవరకు శంకుస్థాపనకలూ లేవు. రెండేళ్లుగా వాటికి స్థల సేకరణ దశే కొనసాగుతుండటం గిరిజనాభివృద్ధి పట్ల ప్రభుత్వం చూపిస్తున్న అశ్రద్ధకు అద్దం పడుతోంది. పాఠశాలల నిర్మాణానికి గతంలోనే టెండర్లు ఖరారు చేశామని, అయితే టెండర్లపై కాంట్రాక్టర్లు కోర్టుల్లో కేసులు వేయడం వల్ల నిర్మాణాలు చేపట్టించలేక పోయామని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం 12 ఏకలవ్య పాఠశాలలతో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు ప్రచారం చేసుకోవడం కొసమెరుపని గిరిజన సంఘాల నేతలు ఆక్షేపిస్తున్నారు. వ్యాజ్యాలుంటే పరిష్కరింపజేయాలని, స్థలాలు లేకుంటే వెంటనే సేకరించాలని, ఆయా పాఠశాలలన్నింటినీ వెంటనే నిర్మించి ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ముస్లింలకే మండలి ఛైర్మన్ పదవి

- విజయవాడ, కడపలో హజ్ హౌస్‌లు
- హజ్ యాత్రను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ పదవి ముస్లింలకే కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ముస్లింల ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సచివాలయం నుంచి ముస్లిం సోదరుల హజ్ యాత్ర బస్సులను ఆయన జెండా ఊపి గురువారం ప్రారంభించారు. హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ, కడపలో హజ్ హౌస్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు రూ.12 కోట్లు కేటాయించామన్నారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. 20వేల మంది ముస్లిం ఆడబిడ్డల వివాహాల కోసం రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.2,844 కోట్లు కేటాయించామన్నారు. హజ్ యాత్ర సందర్భంగా రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రార్థనలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,810 మందికి హజ్ యాత్రకు ఎపి నుంచి అవకాశాన్ని కల్పించామన్నారు. గతంలో మక్కా వెళ్ళాలంటే నేరుగా విమానం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేదన్నారు. ఈ సందర్భంగా హజ్ గైడ్ పుస్తకాన్ని సిఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం.ఎ షరీఫ్, ఏపి హజ్ కమిటీ ఛైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్, సభ్యులు మస్తాన్ షరీఫ్, హాజీ హసన్, భాషా, మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కె.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు


- చిన్నారి చంద్రశేఖర్‌కు రూ.2 లక్షల ఆర్థిక సాయం
- సిఎం చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న బోరుబావుల్ని పూడ్చకుండా చిన్నారుల ప్రాణాలతో చలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. భవిష్యత్తులో ఉమ్మిడివరం వంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. పూడ్చకుండా వదిలేసిన బోరు బావుల ఫొటోలు తీసి ప్రభుత్వానికి పంపాలని ప్రజలకు సిఎం విజ్ఞప్తి చేశారు. ఇటువంటి వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. బోరుబావిలో పడి ప్రాణాలతో బయటపడిన వినుకొండ మండలం ఉమ్మిడివరానికి చెందిన చిన్నారి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు సిఎంను సచివాలయంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఉమ్మిడివరం ఘటనను కేస్ స్టడీగా తీసుకుని డాక్యుమెంట్ రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇటువంటి విపత్తులు ఎదురైనప్పుడు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో సమయాను కూల వ్యూహాల్ని అనుసరిస్తే సానుకూల ఫలితాలొస్తాయనడానికి ఉమ్మిడివరం ఘటనే నిదర్శనమన్నారు. చిన్నారి చంద్రశేఖర్‌కు రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి 20 ఏళ్ళకు రూ.20 లక్షలయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కామినేని శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అమ్మాయికి కర్నూలు బాలిక గుండె..!

- 50 నిమిషాల్లోనే హైదరాబాద్‌కు గుండె తరలింపు
- విజయవంతంగా ఆపరేషన్ చేసిన కాంటినెంటల్ వైద్యులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుండె సంబంధ సమస్యతో బాధపడుతున్న ఓ పన్నెండళ్ల బాలికకు హైదరాబాద్ కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు. ఆదిలాబాద్‌కు చెందిన బాలికకు కర్నూలు జిల్లాకు చెందిన మరో బాలిక గుండెను విజయవంతంగా అమర్చారు. ఈ మేరకు ఆస్పత్రి సీఈఓ హరీష్ మన్యన్, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ సునీల్ స్వయిన్ చికిత్సకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. అదిలాబాద్ జిల్లాకు చెందిన దినసరి కూలీలు వికాస్, సంధ్యా మండల్‌ల కుమార్తె త్రిషమండల్(12) గత రెండేళ్ల నుంచి తీవ్రమైన హృద్రోగ సంబంధిత సమస్యతో బాధపడుతోంది. వైద్యుల సూచన మేరకు గుండె దాత కోసం జీవన్‌దాన్‌లో త్రిష పేరు నమోదు చేయించారు.

పెద్ద మనసుతో ముందుకొచ్చిన కర్నూలు అమ్మాయి తల్లిదండ్రులు

అవేర్‌గ్లోబల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కర్నూలు జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలిక బ్రెయిన్‌డెడ్ స్థితికి చేరుకున్నట్లు జులై 18 సాయంత్రం జీవన్‌దాన్‌కు సమాచారం అందింది. బాలిక అవయవాలను దానం చేసేందుకు బంధువులు అంగీకరించడంతో త్రిష బంధువులకు, సంబంధిత వైద్యులకు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు గుండె మార్పిడి నిపుణుడు డాక్టర్ సందీప్ అవతార్, డాక్టర్ సునీల్ స్వయిన్, డాక్టర్ సమీర్, డాక్టర్ ప్రశాంత్‌పాటిల్, డాక్టర్ అంజూ దయాల్, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డిలతో కూడిన వైద్య బందం రెండు టీంలుగా విడిపోయి గుండె తరలింపు, ఆపరేషన్ నిర్వహించారు.

50 నిమిషాల్లో 64 కిలోమీటర్లు

వెంటనే ఓ వైద్య బందం దాత చికిత్స పొందుతున్న అవేర్ గ్లోబల్‌కు చేరుకుని దాత నుంచి బుధవారం రాత్రి 11 గంటలకు గుండెను సేకరించారు. ప్రత్యేక గ్రీన్‌ఛానల్ సహాయంతో 64.3 కిలోమీటర్ల దూరంలో గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి 50 నిమిషాల్లో గుండెను తరలించారు. సుమారు 15 మందితో కూడిన వైద్య బందం సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించి త్రిషకు విజయవంతంగా చికిత్స చేశారు. లక్ష మంది పిల్లల్లో ఎవరో ఒకరికి మాత్రమే ఇలాంటి సమస్య ఉత్పన్నమవుతుందని, ప్రస్తుతం పాప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, మరో రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేసే అవకాశం ఉందని డాక్టర్ డాక్టర్ సునీల్ స్వయిన్ చెప్పారు. తన బిడ్డకు పునర్జన్మ ప్రసాదించిన వైద్యులకు, గుండె దాత తల్లిదండ్రులకు త్రిష తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నరహంతకుడికి ఉరిశిక్ష.!

నెల్లూరు కోర్టు సంచలన తీర్పు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

నరహంతకుడు కుక్కలగుంట వెంకటేశ్వర్లు (30)కు నెల్లూరు జిల్లా నాలుగవ జిల్లా సెషన్స్ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ సంచలనాత్మక తీర్పు నిచ్చింది. గురువారం సాయంత్రం 4 గంటలకు జడ్జి డి. శ్రీనివాసరావు ఈ తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. నెల్లూరు నగరంలోని చిల్డ్రన్ పార్కు సమీపంలో 2016 జులై 9వ తేదిన ఇంట్లో ఉన్న రామరాజు ప్రభావతి (55) అతి దారుణంగా హత్యకు గురైంది. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రభావతి మాధురితోపాటు సోదరుడు అనంతకృష్ణ కూడా ఇంట్లోనే ఉన్నారు.

అదే సమయంలో వెంకటేశ్వర్లు ఇంటికొచ్చాడు. డిష్ రిపేర్ చేసేందుకు వచ్చానని ప్రభావతి ఇంటికి వచ్చాడు. ఆమె ఒంటిపై ఉన్న నగలు దోచుకోడానికి ముందుగానే ప్రణాళిక వేసుకున్న ఆయన సుత్తితో ఆమె తలపై బలంగా కొట్టాడు. ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అడ్డొచ్చిన మాధురి, అనంతకృష్ణలపై కూడా దాడి చేశాడు. బంగారు, నగదుతో పారిపోతుండగా భర్త నాగేశ్వరరావు హంతకుడిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. ఈలోగా చుట్టుపక్కల వారు వచ్చి వెంకటేశ్వర్లును పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితుడికి మరో మూడు హత్య కేసులతో సంబంధముంది. ఇప్పటికే ఓ కేసులో అతను జీవితఖైదు అనుభవిస్తున్నాడు.



జగన్‌కు ఓటమి భయం

మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నిక విషయంలో ప్రతిపక్షనేత జగన్మోహనరెడ్డికి ఓటమి భయం పట్టుకుందని రవాణా, బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. సచివాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికను వాయిదా వేసేందుకు ఆ పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ఓటమి భయంతో అసాంఘిక కార్యకలాపాలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తున్నారన్నారు. ఇంటిలిజెన్స్ అధికారుల నుంచి తమకు ఈ సమాచారం అందించదన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే రాష్ట్ర ప్రజలు జగన్‌ను క్షమించరన్నారు.

ఆ..159 మందిపై ఎపిపిఎస్‌సి పూర్తి స్థాయి విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల్లో చోటు చేసుకున్న గందరగోళంపై ఎపిపిఎస్‌పి దృష్టి పెట్టింది. విశాఖలోని గీతం యూనివర్సిటీ పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరిగిందనే నేపథ్యంలో విచారణ చేపట్టింది. పరీక్షా కేంద్రంలో ఆ రోజు జరిగిన ఘటనలకు సంబంధించి సీసీటీవీ ఫూటేజీలను ఉన్నత స్థాయి కమిటీ పరిశీలించింది. పరీక్షా కేంద్రంలో మొత్తం 226 మంది పరీక్ష రాయగా, వారి రెస్పాన్స్ షీట్‌లను రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన ఎపిపిఎస్‌పి 226 మందిలో 67 మంది అభ్యర్థులను పరిగణలోకి తీసుకుంటున్నట్లు గురువారం ప్రకటించింది. మిగిలిన 159 మంది అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌లను రిజర్వ్ చేసింది. పరీక్షకు హాజరైన వారిలో 67 మంది పరీక్షా హాల్‌లోనే ఉన్నట్లు సీసీటీవీ ఫూటేజీల ద్వారా కమిటీ నిర్ధారించింది. వారు మాల్ ప్రాక్టీస్‌కు గానీ, పరీక్షా హాల్‌లో ఆందోళనలు చేసినట్లు గానీ ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వారి ఫలితాలను ప్రకటించారు. మిగిలిన 159 మంది పరీక్షా హాల్ నుంచి బయటకు వెళ్లారని, వారిలో కొంత మంది పరీక్షా హాల్ తిరిగి రాగా, మరికొంత మంది రాలేదని అధికారులు గుర్తించారు. పరీక్ష హాల్ నుంచి బయటకు వెళ్లిన 159 మంది అభ్యర్థులు ఏ కారణం చేత బయటకు వెళ్లారనేది నిరూపించుకోవాలని అధికారులు తెలిపారు.

గ్రూప్ -1 మెయిన్స్ తొలిరోజు ప్రశాంతం

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి తొలిరోజు (జనరల్ ఇంగ్లీష్) జరిగిన పరీక్ష ప్రశాతంగా ముగిసింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలతో పాటు అనంతపురంలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు జరిగిన జనరల్ ఇంగ్లీష్ పేపర్‌కు 2,597 (66.58 శాతం) మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 3,900 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.

శ్రీకాకుళంలో స్వల్ప భూ ప్రకంపనలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల, లావేరు (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల, లావేరు మండలాల్లో గురువారం ఉదయం స్వల్ప భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఉదయం 6.10 గంటల సమయంలో మూడు సెకెన్ల పాటు భూమి కంపించింది. కొద్దిపాటి శబ్దంతో భూమి కంపించడంతో భయకంపితులైన ప్రజలు ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. ఇళ్లల్లో కొన్ని వస్తువులు కింద పడినట్లు ఆయా గ్రామస్తులు తెలిపారు. ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం, ఫరీదుపేట, దోమాం, ఎస్ఎంపురం, కేశవరావుపేట, ఎచ్చెర్ల, లావేరు మండలంలోని మురపాక, చిన్నమురపాక గ్రామాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఈ మండలాల్లో ఎప్పటికప్పుడు భూ ప్రకంపనలు వస్తుండడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. భూ కంపాల జోన్ పరిధిలోని ఎచ్చెర్ల నియోజకవర్గం కొవ్వాడలో అణుపార్కు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం ఈ సందర్భంగా చర్చనీయాంశమైంది.

భవానీ ద్వీపం అభివృద్ధికి సౌర శక్తియుత మాస్టర్ ప్లాన్

పర్యాటక శాఖ కార్యదర్శి మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా నదిలోని భవానీ ద్వీపాన్ని వినోద, విహార కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా తెలిపారు. పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో వెలగపూడి సచివాలయంలో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వాస్తవికత, సహజత్వం దెబ్బ తినకుండా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసి, అక్కడి అవసరాలకు వినియోగిస్తామన్నారు. బెస్టన్‌కు చెందిన సిబిటి సంస్థ ప్రతినిధులు తాము రూపొందించిన అభివృద్ధికి ప్రణాళికను మీనాకు వివరించారు. ప్రజలను అలసట నుంచి దూరం చేసేలా నూతన ప్రణాళిక ఉంటుదని మీనా వివరించారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భవానీ ద్వీపంలో కళా గ్రామాలు, హస్తకళల కేంద్రాలు, బొటానికల్ గార్డెన్ రూపుదిద్దుకుంటాయన్నారు. పక్షుల సందర్శన కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లా, సిబిటి అర్బన్ డిజైన్ డైరెక్టర్ కిశోర్ వారణాసి, స్టూడియో పాడ్ అర్బన్ ప్లానర్ బినీత్ తదితరులు పాల్గొన్నారు.



'కాకినాడ' ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

తుది తీర్పుకు లోబడే ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు హైకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఎన్నికలను నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఎన్నికల ఫలితాలు తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉండాలని న్యాయమూర్తి తన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డివిజన్ల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు, మేయర్ అభ్యర్థి రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన మూడు వేర్వేరు వ్యాజ్యాలను న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ప్రతివాదులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లను దాఖలు చేయాలని గురువారం హైకోర్టు న్యాయమూర్తి పి.నవీన్‌రావు ఆదేశించారు. ఎన్నికలు ఆపాలంటూ రెండు, మేయర్ రిజర్వేషన్‌పై స్పష్టత ఇవ్వాలంటూ దాఖలైన మరో వ్యాజ్యంపై హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. తొమ్మిది గ్రామాలను విలీనం చేసి అక్కడి జనాభా, ఓటర్లను పరిగణనలోకి తీసుకొని 50 వార్డులుగా విభజించి రిజర్వేషన్లు ఖరారు చేశారని, ఆ తర్వాత హైకోర్టు మూడు గ్రామాల విలీనాన్ని నిలిపివేయడంతో 48 డివిజన్లకే ఎన్నికలు నిర్వహిస్తున్నారని, దీని ప్రభావం రిజర్వేషన్లపై ఉంటుందంటూ పిటిషనర్ చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. మేయర్ రిజర్వేషన్‌కు సంబంధించిన వ్యాజ్యాన్ని ఈనెల 30వ తేదీన, వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు అంశాలపై వచ్చే సెప్టెంబరులో విచారణ చేపడతామని న్యాయమూర్తి ప్రకటించారు.

త్వరలో జనసేన విద్యార్థి, మహిళా విభాగాలు

జనవరి నాటికి పూర్తిగా పార్టీ నిర్మాణం

జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనసేన పార్టీకి త్వరలో రెండు అనుబంధ విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆపార్టీ నేత పవన్ కల్యాన్ వెల్లడించారు. వచ్చే జనవరి నాటికి పార్టీ నిర్మాణం పూర్తి చేస్తామని కూడా ఆయన గురువారం మీడియాకు తెలిపారు. ముందుగా విద్యార్థి సంఘాన్ని, ఆ తర్వాత మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ రెండు అనుబంధ విభాగాలు అక్టోబర్ నాటికి ఏర్పాటడవుతాయన్నారు. మిగిలిన విభాగాలను కూడా వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. పార్టీ అనుబంధ విభాగాల ఏర్పాటుకు విధి విధానాలు, కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ప్రస్తుతానికి జనసేన సేవాదళ్ కార్యక్రమాలు మాత్రమే కొనసాగుతున్నాయని తెలిపారు. ఇదిలావుండగా పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వెళ్లేందుకు పాదయాత్ర కూడా చేస్తారని, అది కూడా అక్టోబర్‌లోనే ప్రారంభించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. పూర్తి స్థాయిలో పార్టీ నిర్మాణం లేనందునే నంద్యాల ఉప ఎన్నికలు, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో తటస్థంగా ఉండాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో ఎపిటిఎ రక్తదాన శిబిరాలు

ఛైర్మన్ వెంకట్ రత్నకుమార్ వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమెరికన్ ప్రొగ్రసివ్ తెలుగు అసోసియేషన్(ఎపిటిఎ) ఆధ్వర్యంలో అమెరికాలోని 22 రాష్ట్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ వెంకట్ రత్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికన్ రెడ్‌క్రాస్, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది కూడా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని చిరంజీవి అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు. రవణం స్వామి నాయుడు భారతదేశంలో ఇప్పటి వరకు 400 రక్తదాన శిబిరాలు నిర్వహించారని, అమెరికాలోనూ శిబిరాలు నిర్వహించేందుకు ఆయన ముందుకొచ్చారన్నారు. అమెరికాలోని తెలుగు సంస్థల సహకారంతో ఇప్పటికే రక్తదాన శిబిరాలు నిర్వహించామని, మరో 20 శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాల్లో సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్ ద్వారా ఆపదలో ఉన్న వారికి, కేన్సర్ రోగులకు అందజేస్తామన్నారు.

వైకాపా వ్యూహాలను తిప్పికొట్టండి

టిడిపి సమన్వయ భేటీలో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ప్రజలను అప్రమత్తం చేస్తూ వైసిపి వ్యూహాలను తిప్పికొట్టాలని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ పార్టీ నాయకులకు సూచించారు. గురువారం ఇక్కడ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో నంద్యాల ఉప ఎన్నికల అంశంపైనే ప్రధానంగా చర్చ సాగింది. వైసిపి ఎన్నికలను వాయిదా వేయించాలనే కుట్రను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి పలువురు నేతలు చంద్రబాబుకు తమ అభిప్రాయాలను తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల బాధ్యతలను మంత్రులు నారా లోకేశ్‌కు, అచ్చెన్నాయుడుకు అప్పగించారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు అప్పగించారు. వైసిపి ఎంత రెచ్చగొట్టినా తెదేపా శ్రేణులు సంయమనం పాటించాలని సిఎం తమ నేతలకు సూచించారు. కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే యత్నం జరుగుతోందని, పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండి, ఈ ఉప ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, తెదేపా సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాయమవుతున్న భూగర్భ జలాలు

- బడా పరిశ్రమల అడ్డగోలు వ్యవహారం
- గ్రామాలకు తాగునీరు కరువు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రోజురోజుకు భూగర్భ జలాలు మాయమవుతున్నాయి. పరిశ్రమల నిర్వహణ కోసం ఎక్కడబడితే అక్కడ బోర్లు వేసి యాజమాన్యాలు ప్రతిరోజూ లక్షలాది లీటర్ల నీటిని తోడేస్తున్నాయి. ఫలితంగా సముద్రతీర ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీటి కటకట ఏర్పడింది. భూగర్భజలాలు అడుగంటి పోతుండటంతో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సి దుస్థితి నెలకొంది. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఒకవైపు కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం, మరోవైపు ఆయిల్ కంపెనీలు ఇంకోవైపు థర్మల్ ప్రాజెక్టులు ప్రజలకు అందాల్సిన నీటిని అందినకాడికి తోడేయడంతో నీటికోసం తీర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నెల్లూరు జిల్లాలో ఏడు ఆయిల్ పరిశ్రమలున్నాయి. జెమిని, ఎఫ్ఎఫ్ఎఫ్, హిమామీ, లూయిస్, సౌత్ ఇండియా, జై సంతోషీమాత కృష్ణపట్నం ఆయిల్ కంపెనీలున్నాయి. ప్రతి పరిశ్రమకూ ఒక ఆర్ఓ ప్లాంట్ ఉంది. విదేశాల నుంచి ఇక్కడకు వచ్చే క్రూడాయిల్‌ను పరిశ్రమల్లో శుద్ధి చేస్తారు. ఇందుకు గంటకు 40 వేల లీటర్ల నీరు అవసరం అవుతుంది. బాయిలర్స్ వేడిని తగ్గించడానికి ఈ నీటిని వాడుతారు. ఈ క్రమంలో ముత్తుకూరు, వెంకటాచలం మండలాల పరిధిలోని పంటపాళెం, నారికెళ్లపల్లి తదితర ప్రాంతాల్లో బోర్లు, దొరువులు(ఊట చెరువులు) ద్వారా లక్షల లీటర్ల నీటిని పరిశ్రమలకు తరలిపోతున్నాయి. ఆయా కంపెనీలు ఎలాంటి అనుమతులూ లేకుండా బోర్లు వేస్తున్నాయి. ఈ ప్రాంత ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఏ చర్యా తీసుకోలేదు. ఒక్కో కంపెనీ ప్రతిరోజూ 100 ట్యాంకర్ల ద్వారా నీటిని పరిశ్రమలకు తరలిస్తున్నాయి.

కృష్ణపట్నం పోర్టు, పామాయిల్ పరిశ్రమలు, థర్మల్ ప్రాజెక్టులు తీరంలోని మంచి నీటిని అధికంగా తోడేస్తున్నాయి. సముద్రం దగ్గరగా ఉండడంతో మంచినీటిని తోడేసిన కారణంగా ఉప్పునీరు ఆ స్థానాన్ని భర్తీ చేస్తోంది. దీంతో ప్రతి కుటుంబమూ ఇతర ప్రాంతాల నుంచి మినరల్ వాటర్ కోసం అదనంగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముత్తుకూరు మండలంలో సుమారు 55 వేల మంది జనాభా, టిపి గూడూరులో 52 వేలు, వెంకటాచలంలో 63, ఇందుకూరు పేట ప్రాంతంలో 65 వేల మంది జనాభా ఉన్నారు. తీర ప్రాంతం కావడంతో ఇక్కడ ఉప్పునీటి ప్రభావం ఉంటుంది. గతంలో ఆక్వా పరిశ్రమల కోసం నీటిని తోడేయ్యగా. ఇప్పుడున్న పరిశ్రమలు తాగు, సాగునీరు లేకుండా తోడేస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఒకప్పుడు 50 అడుగుల దూరంలో భూగర్భ జలాలుండేవి. ఇప్పుడవి 100 నుంచి 150 అడుగులకు పడిపోయాయి. థర్మల్ ప్రాజెక్టుల అవసరాలు, ఆయిల్ పరిశ్రమల ట్యాంకర్ల ద్వారా నీటిని తోడేయడంతో ఈ ప్రాంతంలో మంచినీరు మాయమవుతోంది. దీంతో ప్రజలు సాగు, తాగునీటి కోసం ఆ కంపెనీల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది.

కొన్ని ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి అంతా తామే చేశామని కంపెనీలు చెప్పుకుంటున్నాయి. గ్రామాల్లో ఉన్న నీటిని అక్రమంగా లాగేసుకుని ప్రజల కోసం ఏదో చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నాయి. ప్రభుత్వం వేస్తున్న బోర్లుకు నీరు రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే తీర ప్రాంత ప్రజలు నీటి కోసం సుదూరప్రాంతాలకు వెళ్లక తప్పేలా లేదు.



ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్న కంపెనీ యజమానులు

మొక్క మొలవదు.. ఫలం దక్కదు!

- థర్మల్ కాలుష్యంతో పంటలు విధ్వంసం
- భూగర్భజలాలు కలుషితం
- అప్పులపాలవుతున్న రైతన్నలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. థర్మల్ ప్రాజెక్టుల ఫలితంగా ఈ ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. తీరం వెంట రైతులు వేసిన మొక్క మొలవడం లేదూ...ఫలం దక్కనూలేదు... ప్రాజెక్టు నుంచి వెలువడుతోన్న బూడిద, ఇతర రసాయనాల వల్లన వేసిన పంట చేతికి అందడం లేదు. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. కల్లుగీత కార్మికుల జీవనాధారం అయిన కల్లు కూడా కలుషితమవుతోంది. అప్పులుచేసి పంటలు సాగు చేస్తున్నా ఫల సాయం మాత్రం అందడం లేదని రైతులు వాపోతున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా ప్రాజెక్టుల యాజమాన్యానికి దాసోహం అంటున్నారు.

తీర ప్రాంతంలోని రైతులు మామిడి,పుచ్చకాయ, సపోట, అరటి వంటి పంటలను సాగుచేస్తున్నారు.

ముత్తుకూరు మండలం ముసునూరువారి పాళెం గ్రామంలో సుమారు 50 ఎకరాల్లో మామిడితోట ఉంది. గతంలో మంచి దిగుబడి వచ్చేది. ఇప్పుడు థర్మల్ ప్రాజెక్టు నుంచి వెలువడుతోన్న బూడిద, ఇతర రసాయనాల వలన చెట్లు ఎండిపోవడం, మామిడి కాయమీద చుక్క రావడం, బొబ్బులు రావడంతో మామిడి ధర ఘోరంగా పడిపోయింది. నేలటూరు, ఫెనాపురం, అనంతపురం, మండపం, వరకవిపూడి గ్రామాల్లో ఇప్పుడు వేస్తున్న మొక్కలు కూడా మాడిపోతున్నాయి. అప్పులుచేసి పంటలు సాగుచేసినా కొద్దిరోజులకే నాశనమైపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్లుగీత పరిశ్రమకు తీవ్ర నష్టం

కల్లుగీత ఆధారంగా జీవనం సాగిస్తున్న కుటుంబాల జీవనభృతి ప్రశ్నార్థకమైంది. వెంకటాచలం, ముత్తుకూరు, టిపి గూడూరు, ఇందుకూరు పేట, చిల్లకూరు మండలాల్లో తాటిచెట్లు అధికంగా ఉన్నాయి. రాత్రి కల్లు కుండ చెట్టుకు కడితే ఉదయం వెళ్లే సరికి కల్లు మొత్తం బూడిదతో నిండిపోతుంది. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో థర్మల్ ప్రాజెక్టులు రైతుల జీవనభృతిని దెబ్బతీస్తున్నాయి.



ఎండిపోతున్న మామిడి చెట్లను చూపుతున్న కావలి యానదమ్మ

రూ.2 లక్షలు నష్టపోయాను

రూ .2 లక్షలు అప్పుచేసి మామిడి, సపోట, టెంకాయి చెట్లు నాటాను. నాటిన కొద్ది రోజులకే మొత్తం ఎండిపోయాయి. కింది నుంచి కలుషితనీరు, పైనుంచి థర్మల్ రసాయనాల వలన చెట్లు పూర్తిగా నాశనమైపోయాయి.

- కావలి యానదమ్మ



'ఉపాధి'పై తప్పుడు లెక్కలు

- రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంతో నిధులను ఆపేసిన కేంద్రం
- పేరుకుపోయిన రూ.600 కోట్ల బకాయిలు
- ఆకలి మంటల్లో వేతనకూలీలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనుల్లో అక్రమాలు పెరిగిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ లెక్కలను సక్రమంగా చూపకపోవడంతో ఈ ఏడాది మే నుంచి కేంద్ర ప్రభుత్వం నిధుల చెల్లింపులను ఆపేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.600 కోట్ల వేతన బకాయిలు పేరుకుపోయాయి. ఒక్క అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా రూ.78 కోట్ల బకాయిలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల వేతనాలందక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధి కూలీలు ఆకలి మంటలతో అలమటిస్తున్నారు. రాష్ట్రంలో 661 మండలాలు, 12,944 పంచాయతీల్లో 84,98,588 ఉపాధి జాబ్ కార్డులున్నాయి. 53,78,646 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 14,80,79,303 పని దినాల ఉపాధి దొరికింది. ఉపాధి వేతనదారులకు గతంలో రాష్ట్ర ప్రభుత్వమే కూలి చెల్లించేది. 2016 డిసెంబర్ నుంచి కేంద్ర ప్రభుత్వమే కూలి చెల్లిస్తోంది. అయితే ఉపాధి పనుల్లో అక్రమాలు, నిధుల దుర్వినియోగం, దారి మళ్లింపు తదిరత కారణాలతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చూపించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల వేతనాలందక లక్షలాది మంది ఉపాధి కూలీలు లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీ అధికారులు త్వరలోనే చెల్లింపులు జరుగుతాయని చెబుతున్నారు. విజయనగరం జిల్లాలోని 34 మండలాల్లో 5,38,133 మంది కూలీలకు రూ.45 కోట్ల బకాయి పేరుకుపోయింది.

బ్యాంకుల ద్వారా చెల్లింపులతో ఇబ్బందులు

ఉపాధి కూలీలకు బ్యాంకుల ద్వారా కూలి డబ్బులను చెల్లిస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం జరగక జిల్లాలో లక్ష మందికిపైగా ఉపాధి కూలీలకు చెల్లింపులు జరగడం లేదు. మరోవైపు అందుబాటులో బ్యాంకులు లేక వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తోంది. జిల్లాలోని 768 పంచాయతీలకు చెందిన వేతనదారులకు బ్యాంకుల ద్వారా, ఐటిడిఎ పరిధిలోని 116 పంచాయతీలకు చెందిన వేతనదారులకు పోస్టాఫీసుల ద్వారా వేతనాలు అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 270 బ్యాంకులు మాత్రమే ఉన్నాయి. దూర ప్రాంతాల్లోని బ్యాంకులకు వెళ్లడం కూలీలకు ఇబ్బందిగా మారింది. పెద్దనోట్ల రద్దు తరువాత బ్యాంకుల ఆంక్షలతో కూలీల కష్టాలు రెట్టింపయ్యాయి. తాజాగా కేంద్రం వేతనాలు ఆపేయడంతో కూలీలు మరిన్ని ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

రాష్ట్రంలో ఉపాధి వేతనాల బకాయిలు జిల్లాల వారీ

జిల్లా పేరు	వేతన బకాయిలు(రూపాయల్లో)
అనంతపురం	78,36,72,814
ప్రకాశం	68,34,60,735
తూర్పుగోదావరి	49,88,73,252
చిత్తూరు	49,31,12,533
విశాఖపట్నం	47,53,96,989
విజయనగరం	45,20,48,260
నెల్లూరు	42,75,99,714
కర్నూలు	39,01,91,403
శ్రీకాకుళం	36,99,18,122
పశ్చిమగోదావరి	35,37,47,993
కడప	34,52,76,470
గుంటూరు	26,28,77,388
కృష్ణా	14,52,90,179

భూసేకరణ ప్రిసిడింగ్ అధికారిగా రిటైర్డు జిల్లా జడ్జి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

విజయవాడలోని స్టేట్ గెస్టుహౌస్‌లో భూసేకరణ పునరావాస సంస్థ రీజనల్ కార్యాలయ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి సంస్థ కార్యకలాపాలు నిర్వహించనుంది. రీజియన్ కార్యాలయ ప్రిసిడింగ్ అధికారిగా రిటైర్డు జిల్లా జడ్జి జగన్నాధంను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రీజియన్ పరిధిలో కృష్ణా, తూర్పు, పశ్చిమ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలున్నాయి. 2013 భూ సేకరణ చట్టం సెక్షన్ 52ను అనుసరించి రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో భూ సేకరణ పునరావాస సంస్థ రీజనల్ కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. విజయవాడతోపాటు విశాఖపట్నం, తిరుపతిల్లోనూ రీజనల్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. భూసేకరణ సమయంలో పునరావాసానికి సంబంధించి ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయం తగు సూచనలు చేయనుంది.

వంద కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-దేవరపల్లి

కారులో అక్రమంగా తరలిస్తున్న వంద కిలోల గంజాయిని పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి వద్ద పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో సుమారు వంద కిలోల గంజాయిని ఇద్దరు వ్యక్తులు తరలిస్తున్నారు. ఆ కారు దేవరపల్లి వద్దకు వచ్చేసరికి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ తనిఖీల్లో కారులో వంద కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి, కారు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువను అధికారులు లెక్కిస్తున్నారు.

తెంపల్లిలో విషాదఛాయలు

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా)

కృష్ణాజిల్లా గన్నవరం మండలం తెంపల్లిలో గురువారం విషాదఛాయలు అలుముకున్నాయి. పాత కక్షల నేపథ్యంలో తల్లి నాగలక్ష్మి, ఆకాష్ బుధవారం హత్యకు గురైన విషయం తెలిసిందే. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తరువాత మృతదేహాలను బంధువులకు అప్పగించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. దాడిలో గాయపడ్డ మరో కుమారుడు అవినాష్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. రెండు రోజులు గడిస్తే గానీ పరిస్థితి చెప్పలేమని వైద్యులు చెప్పినట్లుగా తెలిసింది. ఇదిలా ఉండగా తల్లీ, కొడుకులను హత్య చేసిన కేసులో నిందితుడైన బసవేశ్వరరావు పరారీలో ఉన్నాడు. ఇతని కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ప్రత్యేక బృందాలు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. గ్రామంలో పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు పికెట్‌ను ఏర్పాటు చేశారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-నిడదవోలు

కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు మండలం మద్దూరు వద్ద పశ్చిమ డెల్టా గోదావరి ప్రధాన కాలువలోకి దూసుకెళ్లింది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన శివ సుబ్రహ్మణ్యం తన వ్యక్తిగత పనుల నిమిత్తం గురువారం రాజమహేంద్రవరం నుంచి నిడదవోలుకు కారులో బయలుదేరారు. ఆ కారు నిడదవోలు మండలం మద్దూరు వద్దకు వచ్చేసరికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో కారు ఒక్కసారిగా అదుపుతప్పి మద్దూరు వంతెన సమీపంలోని కాలువలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కారులో ఉన్న శివసుబ్రమణ్యం కారులోంచి బయటకు వచ్చి ఈతకొట్టుకుంటూ బయటపడ్డాడు. సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన శివ సుబ్రహ్మణ్యం ఈ సంఘటనపై ఎస్ఐ కె.నరేంద్రకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, స్థానికులు కారును కాల్వలోంచి బయటకు తీశారు.



కాలువ నుంచి బయటికి తీసిన కారు

వైద్య రంగంలో వినూత్న మార్పులు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని

ప్రజాశక్తి-నర్సీపట్నం

వైద్యరంగంలో వినూత్న మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు చెప్పారు. విశాఖ జిల్లా నర్సీపట్నంలోని 150 పడకల ఏరియా ఆసుపత్రిని ఆయన గురువారం ప్రారంభించి, మాట్లాడారు. 2014లో ఎక్కువగా మాతాశిశు మరణాలు జరిగాయని తెలిపారు. 2015 - 2016 సంవత్సరంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తల్లీబిడ్డల మరణాలను తగ్గించడంలో అవార్డు వచ్చిందన్నారు. రాష్ట్రంలో 37 శాతం ఒపిలు, డెలివరీలు పెరిగాయన్నారు. ఆసుపత్రిలో సిసి కెమెరాలు పెట్టాలని, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.10 లక్షల వరకు బడ్జెట్ పెంచుతామన్నారు. రోడ్లు భవనాలశాఖ మంత్రి అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఈ ఆసుపత్రి మరపురానిదన్నారు. ఎన్టీఆర్ హయాంలో 100 పడకల ఆసుపత్రిని రూ.4.50కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేశారన్నారు. వసతులు చాలనందున 150 పడకలు కావాలని మంత్రి కామినేని కోరడంతో రూ.13 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు సిఎం గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కారుణ్య నియామకాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనికి సంబంధించిన విద్యార్హతల ఫైలుపై జెఎసి సూచనల మేరకు మార్పులు చేశారని జెఎసి ఛైర్మన్ అశోక్‌బాబు, సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ ఎన్.చంద్రశేఖరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కారుణ్య నియామకాల విషయంలో గతంలో అటెండర్ పోస్టును మినహాయిస్తే మిగిలిన పోస్టులకు కనీస విద్యార్హత ఇంటర్మీడియట్‌గా నిర్ణయించి, ఐదేళ్లలో డిగ్రీ పూర్తి చేసే విధంగా నిబంధన ఉండేది. అనంతరం కారుణ్య నియామకాలకు కనీస విద్యార్హత డిగ్రీగా మార్చారు. దీనివల్ల చాలా మంది నష్టపోతారని, అర్హతలను మార్చాలని జెఎసి తరపున అనేకసార్లు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విన్నవించారు. దీనికి స్పందించిన సిఎం కారుణ్య నియామకాల విద్యార్హతను ఇంటర్మీడియట్‌గా మార్చి, ఐదేళ్లలో డిగ్రీ పూర్తి చేయాలని నిబంధనలు పెట్టారన్నారు. దీనిపై జెఎసి తరపున హర్షం వ్యక్తం చేశారు.

మినీ బస్టాండ్‌కు మంత్రి పుల్లారావు శంకుస్థాపన

పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు
అంగన్వాడీ సరుకులపై అసంతృప్తి

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

గుంటూరు బస్టాండ్ ప్రాంగణంలో రూ.1.75 కోట్లతో మినీ బస్టాండ్ నిర్మాణానికి పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ నాటికి మినీ బస్టాండ్ ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నట్లు ప్రకటించారు. ఇక్కడి నుండి విజయవాడ-తిరుపతి మార్గంలో రాకపోకలు సాగిస్తూ అన్ని జిల్లా కేంద్రాలకు వెళ్లే బస్సులు, సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. నగరంలో ప్రయివేటు సిటీ బస్సులను నియంత్రించి ఆర్‌టిసి సర్వీసులను విస్తృతంగా నడిపేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రయివేటు ఆపరేటర్ల వద్ద కార్మికుల ఉపాధికి ఇబ్బంది లేకుండా కార్మిక సంఘాలతో చర్చిస్తామన్నారు. అనంతరం నగరంలోని రైతుబజార్, పెట్రోల్ బంకు, అంగన్వాడీ కేంద్రంలో మంత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. తూకం, పరిమాణం, నాణ్యత అంశాలను పరిశీలించారు. నాణ్యమైన వస్తువులను నిర్దేశిత ధరలకు విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. కారం, పప్పు దినుసులు, నిత్యావసరాల కల్తీలపై ఫిర్యాదులు వస్తున్నాయని, త్వరలో దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇదిలా ఉండగా అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న కందిపప్పు, బియ్యం నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బంగారం దుకాణాల్లో తూకాలపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.



పెట్రోల్ బంకులో కొలతలను పరిశీలిస్తున్న మంత్రి పుల్లారావు

నేడు పోలవరంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

ప్రజాశక్తి-ఏలూరు

వాటర్ రిసోర్సెస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ నెల 18న పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నట్లు ఏలూరు ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) చెప్పారు. కమిటీ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు విజయవాడ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని సందర్శిస్తుందని తెలిపారు. ఒంటి గంటకు పోలవరం ప్రాజెక్టుకు ఈ కమిటీ చేరుకుని, 1.30 గంటల వరకు ప్రాజెక్టు నమూనాను పరిశీలిస్తుందని చెప్పారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని కమిటీ సభ్యులు పరిశీలిస్తారని వివరించారు. అనంతరం విజయవాడ బయల్దేరి వెళ్తారని తెలిపారు. కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న లోక్‌సభ సభ్యులు హుకుంసింగ్‌తోపాటు లోక్‌సభ సభ్యులు వి.సత్యభామ, అపురూపపద్దార్, మాగంటి మురళీమోహన్, రాజ్యసభ సభ్యులు సర్దార్ బలివిందర్ ఎస్.బుహందర్, హర్షవర్ధన్ సింగ్ దుంగరపు, ఆనంద్ భాస్కర్ రాపోలు, ప్రదీప్ టమ్టా, ఎబి స్వామి, డాక్టర్ సిద్ధాంత్ మహాపాత్రలతోపాటు లోక్‌సభ సెక్రటేరియట్‌కు చెందిన నలుగురు ఉన్నతాధికారులు, వాటర్ రిసోర్స్‌కు సంబంధించిన మరో ఐదుగురు ఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొంటారని చెప్పారు.

మెడికల్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

'నా చావుకు ఎవరూ కారణం కాదు.. తల్లిదండ్రులు మంచిగా ప్రోత్సహించారు. అయినా నేను అనుకున్నంతగా రాణించలేకపోతున్నాను.' అంటూ అనంతపురం మెడికల్ కళాశాలలో మెడిసిన్ మొదటి సంవత్సరం చదువుతున్న యశ్వంత్ (22) గురువారం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సంఘటన స్థలంలో సుసైడ్ నోట్ లభించిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.



టెక్కలి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బాధితులు

అగ్రిగోల్డ్ బాధితులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం/తాడేపల్లి

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై మూడేళ్లుగా ఉద్యమిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర రెండో రోజు గురువారం శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాన్ని మోసగించేందుకు అగ్రిగోల్డ్ యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పోలీసుల లాఠీఛార్జికి, కేసులకు భయపడబోమని, తామే ముందుండి పోరాడుతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి నాగలక్ష్మి, జిల్లా అధ్యక్షులు మొజ్జాడ జయసింహ, పలువురు ఏజెంట్లు, బాధితులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధిత కుటుంబానికి సిపిఐ నేత రామకృష్ణ పరామర్శ

అగ్రిగోల్డ్ బాధితుడు మనస్థాపంతో మృతిచెందిన నేపథ్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మృతుడు వేముల రాజశేఖర్ కుటుంబాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. బాధితుల డబ్బు వచ్చే విధంగా చూడటంతోపాటు రాజశేఖర్‌కు రావాల్సిన సొమ్మునూ తెప్పించడానికి కృషి చేస్తామని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలనే అంశంపై ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకూ సిపిఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. అగ్రిగోల్డ్ నిర్వాకంతో రాష్ట్రవ్యాప్తంగా 142 మంది చనిపోయారని, సంస్థ ఆస్తులమ్మి బాధితులకు న్యాయం చేయాలని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. వేముల రాజశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతని పిల్లల చదువులకూ ప్రభుత్వం సాయం చేయాలని కోరారు.

సంపాదకీయం

దోషులను రక్షించే దర్యాప్తు

'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అనే సామెతను నిజం చేసింది హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ (హెచ్‌సియు) విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యపై కేంద్రం నియమించిన రూపన్‌వాల్ ఏకసభ్య కమిషన్. ఆరోపణలెదుర్కొంటున్న కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, బండారు దత్తాత్రేయ, వర్శిటీ వైస్ చాన్సలర్ (విసి) అప్పారావులను నేరం నుండి తప్పించే లక్ష్యంతోనే కమిషన్ విచారణ సాగింది తప్ప రోహిత్ మరణానికి దారి తీసిన కారణాలను వెలికి తీసే ఉద్దేశం కమిషన్‌కు లేదని అది వెల్లడించిన 51 పేజీల నివేదిక చెపుతోంది. పైగా తన పరిధిలో లేని అధికారాన్ని చేతుల్లోకి తీసుకొని రోహిత్ అసలు దళితుడే కాదంటూ వక్కాణించి 'ప్రభు' భక్తిని ప్రదర్శించింది. నిరుడు జనవరిలో హెచ్‌సియు విద్యార్థి రోహిత్ అనుమానాస్పదస్థితిలో హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశ వ్యాప్తంగా దుమారం లేపింది. వర్శిటీ యాజమాన్యం దళిత విద్యార్థులపై చూపిస్తున్న దారుణాతి దారుణమైన వివక్షకు రోహిత్ బలయ్యాడంటూ విద్యార్థులు ఆందోళనలు చేశారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, విసి, బిజెపి ఎమ్మెల్సీ, ఎబివిపి నాయకులపై ఆరోపణలు రావడంతో ఇరుకునపడ్డ మోడీ ప్రభుత్వం గతేడాది మేలో అలహాబాద్ కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎకె రూపన్‌వాల్ కమిషన్‌ను నియమించింది. వాస్తవానికి కమిషన్ ఆ ఏడాది ఆగస్టుకల్లా విచారణ పూర్తి చేయాలి. కానీ నిరుడు డిసెంబర్ ఆఖరుకు దర్యాప్తు పూర్తి చేసి మానవ వనరుల అభివృద్ధి (హెచ్‌ఆర్‌డి) మంత్రిత్వశాఖకు నివేదిక అందచేసినా దాన్ని సర్కారు అత్యంత గోప్యంగా ఉంచింది. చివరికి మొన్న మంగళవారం హెచ్‌ఆర్‌డి వెబ్‌సైట్‌లో ఉంచింది. తొలుత నిర్దేశించిన గడువులోపు విచారణ పూర్తి కాకపోవడం, నివేదిక ఇచ్చాక కూడా కొన్ని నెలలు బయటికి వెల్లడించకపోవడంతోనే కేంద్ర ప్రభుత్వ 'దిశానిర్దేశా'లకు లోబడి కమిషన్ విచారణ జరిగిందని, ఆ వెలుగులోనే ఆరోపణలెదుర్కొంటున్న రాజకీయ నేతలు, వర్శిటీ అధికారులపై చర్యలు అవసరం లేదని క్లీన్‌చిట్ ఇచ్చినట్లు అర్థమవుతోంది.

హెచ్‌సియులో దళితులపై చూపిస్తున్న వివక్షపై విద్యార్థులు నిర్వహిస్తున్న ఆందోళనలను సహించలేని విసి, బిజెపి అనుకూల విద్యార్థి సంఘ నాయకులు వర్శిటీలో 'అసాంఘిక శక్తుల'పై చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి దత్తాత్రేయకు రెండుసార్లు వినతిపత్రాలివ్వగా వాటిని సదరు మంత్రి హెచ్‌ఆర్‌డికి పంపారు. హెచ్‌ఆర్‌డి మంత్రిత్వశాఖ ఆదేశాలనుసరించి ఐదురుగు ఎస్సీ విద్యార్థులను వర్శిటీ యాజమాన్యం సస్పెండ్ చేయడమే కాకుండా హాస్టల్ నుంచి బహిష్కరించగా, దానిపై విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అధికారుల 'శిక్ష'కు గురైన విద్యార్థుల్లో రోహిత్ కూడా ఉన్నాడు. ఈ పరిణామాలతో కలత చెందే ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రైమాఫేసీ ఉన్నందునే గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో దత్తాత్రేయ, విసి అప్పారావుతో పాటు ఎబివిపికి చెందిన ఇద్దరు నాయకులపై ఎస్సీ ఎట్రాసిటీ కేసు నమోదైంది. వాస్తవం ఇది కాగా విచారణ చేసిన రూపన్‌వాల్ కమిషన్ వీటి జోలికి పోలేదు. తన చుట్టూ జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తితోనే రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడని, సూసైడ్ నోట్‌లో అదే ఉందని, అది వ్యక్తిగతమని చేసిన కమిషన్ నిర్ధారణ ముమ్మాటికీ వివక్షాపూరితం. 'వర్శిటీలోచేరే సమయంలోనే దళిత విద్యార్థులకు ఒక తాడు, ఇంత విషం ఇవ్వండి' అంటూ 2015 డిసెంబర్ 15న విసికి రోహిత్ రాసిన లేఖను తోసిపుచ్చడం అత్యంత దుర్మార్గం. అన్నింటికీ మించి రోహిత్ దళితుడే కాదని 'తీర్పు' చెప్పి కమిషన్ తన అధికార పరిధిని దాటి 'స్వామి' భక్తి పారాయణం చేసింది.

వర్శిటీలలో ఇకపై విధించే శిక్షలు, జరిమానాలపై విద్యార్థులందరికీ అప్పీలు చేసుకునే అకాశం కల్పించాలని, వివక్ష వ్యతిరేక, పర్యవేక్షక కమిటీలు, కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో ఇచ్చిన సూచన ధర్మ సందేశం కాదు. ఆ సిఫారసుతో హెచ్‌సియులో వివక్ష పూరిత శిక్షలు ఉన్నాయని స్పష్టమైపోయింది. కాగా చంద్రబాబు, కెసిఆర్ ప్రభుత్వాలు రోహిత్ ఆత్మహత్య ఉదంతంపై బిజెపి కనుసన్నల్లో పని చేశాయి. వర్శిటీ ఆవరణలో విద్యార్థులు చిన్న ధర్నా చేసినా తమ ప్రాతాపం చూపే కెసిఆర్ పోలీసులు రోహిత్ ఆత్మహత్యపై కనీస విచారణ చేపట్టలేదు. దత్తాత్రేయ, విసి, తదితరులపై కేసులు నమోదు చేయడంతోనే సరిపెట్టారు. ఇప్పటి వరకు ఆ కేసు ఏమైందో తెలీదు. చంద్రబాబు ప్రభుత్వం ఇంకా ఘోరంగా ప్రవర్తించింది. రోహిత్ కులంపై గుంటూరు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ వేసి పరిశోధించి అతను ఎస్సీ కాదని ప్రకటించింది. విసి అప్పారావుకు తిరుపతిలో సైన్స్ కాంగ్రెస్ వేదికపై ప్రధాని మోడీతో అవార్డులిప్పించింది. రోహిత్ ఆత్మహత్య కుల వివక్షకు, బిజెపి, సంఘ్ పరివార్ హిందూ మతోన్మాదానికి నిలువెత్తు నిదర్శనం. వివక్షను అనుభవిస్తున్న వర్గాలు రోహిత్ బలిదానంతోనైనా కలిసొచ్చే ప్రజాతంత్ర, వామపక్ష, అభ్యుదయవాదులను కలుపుకొని పోరాడాలి.

మహనీయుల మాట



చేయగలిగే శక్తి వున్నవాడి కంటే చెయ్యాలనే కోరిక వున్నవాడే ఎక్కువ చేయగలుగుతాడు.


- జి ముర్రే

బిజెపి చెరలో రాజ్యాంగ విలువలు

చర్చ

వివి

కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి రాజ్యాంగ విలువలను ఖాతరు చేయడంలేదు. ఆ పార్టీ నేతలు... పాలకపక్ష హద్దులకూ, రాజకీయ పార్టీ హద్దులకూ మధ్య గీతల్ని అతిక్రమించి వ్యవహరిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు హద్దు మీరిన కాషాయ పరివారపు చర్యలు 'రాజ్యాంగ విలువలను చెరబడుతున్నారా' అనేంతగా శృతిమించాయి. త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం రేడియో, దూరదర్శన్‌లో ప్రసారం కాకుండా అడ్డుకున్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం మాణిక్ సర్కారు లౌకికత్వానికి ఎదురౌతున్న సవాళ్ళు, వాటిని అధిగమించాల్సిన ఆవశ్యకతపై ప్రసంగించారు. వీటిని రేడియో, దూరదర్శన్ ప్రతినిధులే రికార్డు చేశారు. దానిని ప్రసారం చేయాలంటే మార్పులు చేయాలనీ, యథాతథంగా ఇవ్వలేమనీ వర్తమానం పంపించారు. ప్రసార భారతిని సమాచార, ప్రసార మంత్రిత్వ గూటిపక్షిగా మోడీ ప్రభుత్వం మార్చడం వల్లే దాని తీరు ఇలా మారింది. ఇదే సమయంలో ప్రతి యేడాదీ దసరా సందర్భంగా తమ కార్యకర్తలను ఉద్దేశించి భగవత్ చేసే ప్రసంగాన్ని బిజెపి అధికారం చేపట్టిన 2014లో దూరదర్శన్‌లో ప్రసారం చేయించారు. ఇది రాజ్యాంగంపై మతతత్వ శక్తుల ఆధిపత్యానికి నిదర్శనమని, ఈ తరహా చర్యలను ప్రతిఘటించాలని ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ పిలుపునిచ్చారు. సిఎం ప్రసంగంపై ఆంక్షలూ, అధికారేతర సంస్థ ప్రతినిధికి ప్రాధాన్యత ఇవ్వడం బిజెపి పాలనలోనే చూస్తున్నాం. నిజామాబాద్ జిల్లా ఐలాపూర్ ప్రభుత్వ జానియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మహ్మద్ యాకునుద్దీన్ జాతీయ జెండా ఆవిష్కరించడాన్ని ఆక్షేపిస్తూ హిందుత్వవాదులు ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలతో వీరంగం వేశారు. దౌర్జన్యంగా ఆయనను రోడ్డు మీదకు లాక్కెళ్ళారు. విద్యాసంస్థల్లో అధికార ప్రతినిధులో, అధికారులో, ఆ సంస్థ సిబ్బందో జాతీయ జెండా ఎగురేయాలి. అందుకు విరుద్ధంగా మోహన్ భగవత్ కేరళలోని కర్నాకియామ్మాన్ ఎయిడెడ్ పాఠశాలలో జెండా ఎగరేశారు. ఆయన వస్తున్నట్టు తెలుసుకున్న పాలక్కడ్ జిల్లా కలెక్టరు జెండా ఆవిష్కరణకు ఎవరు అర్హులో తెలియజేస్తూ స్కూలు యాజమాన్యానికి లేఖ ద్వారా తెలిపారు. అయినా దాన్ని ధిక్కరించి ఆయన జెండా ఎగురేశారు. అర్హత వున్న వారిని ముస్లిం పేరిట అడ్డుకోవడం, అర్హత లేని వారు దౌర్జన్యంగా ఎగురవేయడం రాజ్యాంగ విలువలను గౌరవించని కమలనాథుల అసలు సిసలు ధోరణిగా తాజాగా రుజువైంది.



రాజ్యాంగ విలువలను చెరబట్టడం, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడ్డంలో మోడీ ప్రభుత్వం ఎంత దూకుడుగా ఉందో దాన్ని ప్రతిఘటించి నిలవడంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అంత బలహీనంగా ఉంది. వామపక్షాలే ఈ పాత్రను నిర్వహిస్తున్నాయి. ప్రజలూ, మేధావులూ ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తున్నారు.

ఆగస్టు 15 ముందు రోజు జార్ఖండ్‌లోని ఒక సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ ఆర్థికవేత్త జాన్ డ్రిజీ ప్రసంగాన్ని సభ్యత వదిలేసిన కాషాయ మూక అడ్డుకుంది. ఆయన వేదిక దిగి వెళ్ళేవరకూ వదల్లేదు. ఈ పని స్వయానా కేంద్ర మంత్రి రాధా మోహన్ సింగ్, రాష్ట్ర మంత్రులు రణధీర్ సింగ్, సిపి సింఘేర్, మరికొందరు కలిసి చేశారు. డ్రిజీ ప్రసంగాన్ని అడ్డుకోవడంతోనే ఆగలేదు. ఆయనను బలవంతంగా వేదికపై నుంచి దించేశారు. క్రిష్టియన్ మిషనరీలు గిరిజనుల మత మార్పిడులను ప్రోత్సహిస్తున్నాయనే వ్యాఖ్యలు గాంధీజీ చేశారన్న అర్థం వచ్చేలా... గాంధీ ఫోటోతో ప్రభుత్వం తరపున వాణిజ్య ప్రకటనను ఇవ్వడాన్ని ఆయన గుర్తుచేశారు. ఇది ప్రజల మధ్య చీలికలు తెచ్చేదిగా ఉందని చెప్పడమే వారి ఆగ్రహానికి కారణమైంది. ఆయన మాట్లాడింది అధికారిక కార్యక్రమంలో కాదు. రాంచీలో ఒక దిన పత్రిక ఆధ్వర్యంలో జరిగిన సభలో అధికార కార్యక్రమాల్లో ప్రోటోకాల్‌కు భిన్నంగా వ్యవహరించే వీరు ప్రయివేటు కార్యక్రమాల్లో అలోచనల స్వేచ్ఛపై దాడికి దిగడం రాజ్యాంగ విలువల్ని లెక్కచేయకపోవడమే అవుతుంది.

రాజ్యాంగాన్ని ఉల్లంఘించేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాజ్యాంగ విలువలను చెరబట్టడం, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడ్డంలో మోడీ ప్రభుత్వం ఎంత దూకుడుగా ఉందో దాన్ని ప్రతిఘటించి నిలవడంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అంత బలహీనంగా ఉంది. వామపక్షాలే ఈ పాత్రను నిర్వహిస్తున్నాయి. ప్రజలూ, మేధావులూ ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తున్నారు. పాఠాలు బోధించే సమయంలో మతపరమైన ప్రార్థనలు చేయాలంటూ నాసిక్‌కు చెందిన పాఠశాలకు మహారాష్ట్ర సర్కారు హుకుం జారీ చేసింది. ఇలాంటి ఆదేశాలను ఆమోదించలేని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రార్థన సమయంలో చేతులు వెనక్కు కట్టుకొని నిల్చున్నారు. ఇది రాజ్యాంగ ధిక్కరణ కిందకు వస్తుందేమోనని అధికారులంటున్నా 'స్కూల్లో బలవంతపు ప్రార్థనలు చేయించడం ఆర్టికల్ 28(3)ను ఉల్లంఘించడం అవుతుంది' అని సమాధానం ఇచ్చారు. 'జాతీయ గీతం ఒక్కటే పాఠశాలల్లో విలువలను పెంచుతుంది' అని చెప్పడం ద్వారా అధికారులు అనుసరించాల్సిన మార్గాన్ని చెప్పకనే చెప్పారు.

నిజామాబాద్ జిల్లాలో ప్రిన్సిపాల్ యాకునుద్దీన్ బూట్లు వేసుకొని జెండా అవిష్కరణ చేస్తున్నందుకు అడ్డుకున్నామని కాషాయ కార్యకర్తలు తమ చర్యను సమర్థించుకోజూశారు. యువత వారిని సోషల్ మీడియాలో తీవ్ర స్వరంతో ఎదుర్కొంది. వివిధ ప్రాంతాల్లో బూట్లు వేసుకొని జెండాలు ఎగరేసిన నేతల ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. యోగా సందర్భంగా ప్రధాని జాతీయ జెండాతో చెమటను తుడుచుకుంటున్న ఫోటోలనూ పోస్టు చేసింది. జాతీయోద్యమంలో బ్రిటీషు వారికి సలాములు కొట్టిన వారికి జాతీయ జెండా ఎగరేయడంపై నీతులు చేప్పే నైతిక హక్కు ఎక్కడుందని ప్రశ్నించింది. ఆర్థికవేత్త జాన్ డ్రిజీని అవమానించడాన్ని నిరసిస్తూ జార్ఖండ్ రాజ్‌భవన్ ఎదుట సామాజిక కార్యకర్తలు ప్రదర్శన చేశారు. డ్రిజీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మితవాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజల్లో నుంచే ప్రత్యామ్నాయం ఏర్పడుతుందని సిపిఎం చెప్పిన మాటలను ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి. అది ఏర్పాటుచేయాలని సంకల్పించిన ప్రతిపక్షాల పోరాట వేదిక ఈ శక్తులకు మరింత బలాన్నిస్తుందని ఆశిద్దాం. ★

మెయిల్ @ ప్రజాశక్తి

ప్రజాశక్తి సంపాదక పేజీలో వ్యాసాలు మాత్రమే కాదు. వివిధ విషయాలపై మీ అభిప్రాయాలకు కూడా అవకాశం. మీరు అనుకునే ఏ సమస్య పైనైనా సరే- మరీ సుదీర్ఘం కాకుండా సూటిగా క్లుప్తంగా రాసి పంపించండి లేదా ఇ మెయిల్ చేయండి. వెంటనే ప్రచురిస్తాం.

ఇ- మెయిల్ అడ్రస్ : editpageps@gmail.com

35ఎ రద్దు ఆరెస్సెస్ ఎజెండాలో భాగమే!

విశ్లేషణ




ఎంవై. తరిగామి

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 35ఎపై ఇటీవల పెద్ద ఎత్తున వాడివేడిగా చర్చ జరుగుతున్నది. ప్రధానంగా జమ్మూ కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక గుర్తింపునకు సంబంధించి ఆరెస్సెస్ ఎజెండాను నెరవేర్చేందుకే ఆర్టికల్ 35ఎను రద్దు చేయాలన్న వాదన తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో ఒకసారి మనం చరిత్రలోకి వెళ్ళి... ఆ నిబంధనను రద్దు చేసే లక్ష్యంతో... ప్రస్తుతం జరుగుతున్న కుట్రను శోధించాల్సి ఉంది.

భారత యూనియన్‌లో జమ్మూ కాశ్మీర్‌ను విలీనం చేయడానికి అప్పటి పాలకుడు మహరాజా హరిసింగ్ అంగీకరించారు. విలీనానికి సంబంధించిన ఒప్పందంపై సంతకం చేశారు. దీనిని అప్పటి గవర్నర్ జనరల్ 1947 అక్టోబరు 27న అంగీకరించారు. విదేశీ వ్యవహారాలు, రక్షణ, సమాచారం తదితర అంశాలకు సంబంధించి మాత్రమే భారత యూని యన్‌కు నిర్ణయాధికారాన్ని అప్పగించేందుకు హరిసింగ్ అంగీకరించారు. విలీన ఒప్పందంలోని సెక్షన్(8) ద్వారా రాష్ట్రంపై తన సార్వభౌమత్వాన్ని కాపాడుకున్నారు. విలీన ఒప్పందంలోని నిబంధనలకు అంగీకారం తెలపడంతో, వాటిని ఆర్టికల్ 370 ద్వారా భారత రాజ్యాంగంలో చేరుస్తూ అప్పటి రాజ్యాంగ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ నేపథ్యానికి భిన్నంగా భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుంచి ఆర్టికల్ 1, ఆర్టికల్ 370లను కేవలం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి సంబంధించినవిగా మాత్రమే పరిగణిస్తున్నారు. అయితే జమ్మూ కాశ్మీర్‌కు రాజ్యాంగంలోని కొన్ని ఇతర నిబంధనలను వర్తింప చేసేందుకు వీలుగా ఆర్టికల్ 370కి 1వ నిబంధనలోని ఉప నిబంధన-డి ద్వారా భారత రాష్ట్రపతి సాధికారత కల్పించారు. 1950లో భారత రాజ్యాంగాన్ని ఆమోదించే నాటికి జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఇంకా రాష్ట్ర రాజ్యాంగాన్ని ఖరారు చేయలేదు. భారత యూనియన్‌కు, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి మధ్య సంబంధాలను నిర్వచించలేదు. భారత యూనియన్‌తో జమ్మూ కాశ్మీర్ బంధాన్ని నిర్వచించేందుకు 1952లో రాష్ట్ర, కేంద్ర ప్రతినిధులు ఒక ఒప్పందానికి వచ్చారు. దీనిని 'ఢిల్లీ ఒప్పందం'గా పిలుస్తారు. ఈ ఒప్పందం మేరకు రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై 1927లో మహారాజ ప్రతాప్ సింగ్, 1932లో ఆయన తదనంతర పాలకుడు హరిసింగ్ చేసిన చట్టాలు కొనసాగుతాయి. దీనిని 1952లో రాష్ట్ర అసెంబ్లీ చర్చించి ఆమోదించింది. రాజ్యసభ కూడా ఆమోదం తెలిపింది. రాష్ట్ర అంశాలకు సంబంధించి చట్టానికి మరింత రక్షణ కల్పించేందుకు, రాజ్యాంగ పరంగా ఎటువంటి హాని కలగకుండా ఉండేందుకు అప్పటి రాష్ట్రపతి 1954 మే 14న ఒక ఉత్తర్వు జారీ చేశారు. ఇతర అంశాలతో పాటు 'ఢిల్లీ ఒప్పందాన్ని' అమలు చేసేందుకు ఆర్టికల్ 35ఎను రాజ్యాంగంలో చేరుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చట్టాలకు రక్షణ కల్పించే 35ఎ

ఆర్టికల్ 35 ఎ ఒక రక్షణ నిబంధన మాత్రమే. జమ్మూ కాశ్మీర్‌లో అమలులో ఉన్న చట్టాలకు అది రక్షణ కల్పిస్తుంది. 'శాశ్వత నివాసితులు' అంటే ఏమిటో నిర్వచించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉద్యోగాలకు సంబంధించి ప్రత్యేక హక్కులు, అధికారాలు కల్పించేందుకు, రాష్ట్రంలో స్థిరాస్తులు పొందేందుకు, రాష్ట్రంలో స్థిర పడేందుకు, ఉపకార వేతనాలు పొందేందుకు, రాష్ట్ర ప్రభుత్వం అందించే ఇతర సహాయాలను పొందేందుకు ఆర్టికల్ 35ఎ సహాయ పడుతుంది. ఆర్టికల్ 35ఎ చట్టబద్ధంగా చెల్లుబాటు కాదన్న అభిప్రాయం పూర్తిగా నిరాధారమైంది. వాస్తవానికి ఇది అసెంబ్లీ, పార్లమెంట్ ఆమోదం పొందింది. అంతేకాక భారత యూనియన్‌కు, జమ్మూ కాశ్మీర్‌కు మధ్య రాజ్యాంగ సంబంధ ఒప్పందం ఫలితంగా ఏర్పడింది. మరో విధంగా చూస్తే ఇది 'ఢిల్లీ ఒప్పందం' స్ఫూర్తితో ఏర్పడింది. ఇప్పటికే సూచించిన విధంగా 'రాష్ట్ర అంశాలకు' సంబంధించిన చట్టం 1932లో ఖరారైంది. రాష్ట్రంలో నివసిస్తున్న వారికే ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని, రాష్ట్రం వెలుపలి వారికి నిరాకరించాలని ప్రత్యేకించి జమ్మూలోని డోగ్రాలు, కాశ్మీర్ పండిట్లు డిమాండ్ చేసిన తరువాత రాష్ట్ర అంశాలకు సంబంధించిన చట్టం ఖరారైంది. పాలనాపరమైన వ్యవహారాలు సజావుగా సాగేందుకు పొరుగున ఉన్న పంజాబ్‌తో పాటు, ఇతర రాష్ట్రాలకు చెందిన కొంతమంది విద్యావంతులకు మహారాజాలు ఉద్యోగ అవకాశాలు కల్పించేవారు. రాష్ట్రంలో విద్యావంతులు పెరగడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తమ ఉద్యోగ హక్కును కాలరాస్తున్నారనే భావం వారిలో పెరిగింది.



రాజ్యాంగం నుండి ఆర్టికల్ 35ఎను తొలగిస్తే కాశ్మీర్ స్వయం ప్రతిపత్తితో పాటు రాష్ట్రానికి కల్పించిన ప్రత్యేక అధికారాలు కూడా సందిగ్ధంలో పడతాయి. భారత యూనియన్‌కు, రాష్ట్రానికి మధ్య ఉన్న సంబంధాలు మొత్తంగా ప్రభావితమవుతాయి. దీనికి తోడు ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం, అనిశ్చితి, పరాయీకరణ భావనలు పెరిగిపోతాయి. పరిస్థితి చేజారి పోతుంది.

రద్దు చేసే కుట్ర

భారత్ విడిపోయిన తరువాత జమ్మూ కాశ్మీర్‌ను భారత యూనియన్‌లో విలీనం చేసే సమయంలో జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను, స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించడాన్ని సంకుచిత భావాలు గల కొంతమంది మతోన్మాదులు జీర్ణించుకోలేకపోయారు. జమ్మూ కాశ్మీర్‌కు స్వతంత్ర హోదాను లేకుండా చేసేందుకు ఆరెస్సెస్, దాని అనుబంధ సంస్థలు జమ్మూ ప్రాంతంలో ఒక పథకం ప్రకారం తీవ్రవాద ఆందోళనను ప్రారంభించాయి. 1950 తొలి నాళ్ళలో 'జమ్మూ ప్రజా పరిషత్' గొడుగు కింద ఆరెస్సెస్, దాని అనుబంధ భారతీయ జన సంఘ్, హిందూ మహా సభలు ఒక నినాదాన్ని తెరపైకి తీసుకొచ్చాయి. 'ఒకే సార్వభౌమత్వం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా' నినాదంతో ఆందోళనను ప్రారంభించాయి. అతివాద హిందూ జాతీయవాది శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆందోళనకు నేతృత్వం వహించారు. అప్పటి నుంచి ఆరెస్సెస్ దాని రాజకీయ అనుబంధ సంస్థలైన జనసంఘ్, ప్రస్తుత బిజెపిలు ఆర్టికల్ 370ని, జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇది వాటి ఎజెండాలో అలాగే కొనసాగుతున్నది. తమ రాజకీయ, ఎన్నికల ప్రయోజనాలకు దీనిని ఉపయోగించుకుంటున్నాయి. అందులో భాగంగానే ఆరెస్సెస్, బిజెపిల తరుపున ఢిల్లీకి చెందిన ఒక ఎన్జీవో 2014లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆర్టికల్ 35ఎను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలలో చట్టపరమైన, రాజ్యాంగపరమైన అంశాల కన్నా రాజకీయ అంశాలే ప్రబలంగా ఉన్నాయి. ఆర్టికల్ 35ఎను రాజ్యాంగంలో చేర్చడానికి సంబంధించి పిటిషన్‌లో లేవనెత్తిన పలు అంశాలు అంతకుముందు సుప్రీం కోర్టు పరిష్కరించినవే.

సవాల్‌కు అతీతం

ఆర్టికల్ 35ఎ సవాల్ చేయడానికి వీలు లేనిదని ప్రముఖ న్యాయ నిపుణుడు, పత్రికా రచయిత ఎజి నూరాని పేర్కొన్నారు. నాగాలాండ్, మిజోరాం, అసోం, మణిపూర్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, గోవా రాష్ట్రాలకు కొన్ని ప్రత్యేక హక్కులను కల్పించడానికి సంబంధించి ఆర్టికల్ 371 ఎ కింద అటువంటి సవరణలు చేశారని చెప్పారు. సాధారణంగా ఇటువంటి సవరణలను తనకున్న అధికారాలను ఉపయోగించి ఆర్టికల్ 368 కింద పార్లమెంట్ అమలు చేయడం వాస్తవమే. అదేవిధంగా ఆర్టికల్ 370కి ఆర్టికల్ 35ఎ ను చేర్చడం కూడా భారత రాజ్యాంగంలో భాగమే. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370లో భాగంగానే ఆర్టికల్ 35ఎ కొనసాగుతోంది. 1956లో అమలులోకి వచ్చిన జమ్మూ కాశ్మీర్ రాజ్యాంగం కూడా 13వ నిబంధన ఆధారంగా సంబంధిత నోటిఫికేషన్‌పై ఆమోద ముద్ర వేసింది. ఆర్టికల్ 1, ఆర్టికల్ 370లు 1954 నుండి జమ్మూ కాశ్మీర్‌కు వర్తిస్తున్న విషయాన్ని, ఆర్టికల్ 35ఎను చేరుస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారన్న విషయాన్ని దానిని సవాలు చేస్తున్న వారు విస్మరిస్తున్నారు. ఇది జరిగిన దశాబ్దాల తరువాత ఆర్టికల్ 35ఎకు రక్షణ కల్పించే అధికారిక ప్రకటనను రద్దు చేసేందుకు మతతత్వ దురహంకార శక్తులు ప్రయత్నిస్తున్నాయి.

రాజ్యాంగం నుండి ఆర్టికల్ 35ఎను తొలగిస్తే కాశ్మీర్ స్వయం ప్రతిపత్తితో పాటు రాష్ట్రానికి కల్పించిన ప్రత్యేక అధికారాలు కూడా సందిగ్ధంలో పడతాయి. భారత యూనియన్‌కు, రాష్ట్రానికి మధ్య ఉన్న సంబంధాలు మొత్తంగా ప్రభావితమవుతాయి. దీనికి తోడు ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం, అనిశ్చితి, పరాయీకరణ భావనలు పెరిగిపోతాయి. పరిస్థితి చేజారి పోతుంది. ఆర్టికల్ 370, ప్రత్యేక హోదాలు జీవం లేనివిగా మారతాయి. ఆస్తుల కొనుగోలు, స్థిరపడటం వంటి అంశాలలో కాశ్మీర్‌కున్న విశేషాధికారాలు రద్దవుతాయి.

ఈ సంకట సమయంలో మేధావులు, విశాల దృక్పథం గలవారు, ప్రజాస్వామిక శక్తులు, రాజకీయ పార్టీలు, మేధావి వర్గం, పౌర సమాజం కలిసి పరిస్థితిని తీవ్రంగా చర్చించాలి. ఈ కుట్రపూరిత చర్యలను అడ్డుకోవడానికి పోరాటాన్ని ప్రారంభించాలి. ఇదే సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం జాతీయ వాదులమని చెప్పుకునే శక్తులు ప్రాంతీయ, మత ప్రాతిపదికగా రాష్ట్ర ప్రజలను విభజించకుండా చూడాలి. ఆర్టికల్ 35ఎను తొలగించడం వల్ల రాష్ట్ర ప్రజా సంక్షేమం ప్రమాదంలో పడుతుందని జమ్మూ, లడఖ్ ప్రాంతాల్లోని ప్రజానీకానికి నచ్చ చెప్పాలి. ఇంతకు ముందెన్నడూ చూడని ప్రమాదాలను ఎదుర్కోవలసి వస్తుందని తెలియచేయాలి. దీనికి సంబంధించి సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు కలిగే సందేహాలను తీర్చాలి. వారి సమస్యలను పరిష్కరించాలి. కాశ్మీర్‌లో నెలకొన్న పరాయీకరణ భావన ఈ ప్రాంతంలో శాంతి ప్రక్రియకు పెను సవాల్ కానున్నదని లౌకిక, ప్రజాస్వామిక శక్తులు గుర్తించి తదనుగుణంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలి.

ఆర్టికల్ 35ఎను తొలగించేందుకు మత, విభజన, ప్రజాస్వామిక వ్యతిరేక వాదులు చేస్తున్న కుట్ర వల్ల రాష్ట్రంలో అనిశ్చితి, అరాచకం, సంక్షోభం నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ కేసును తీవ్రంగా పరిగణించాలి. కేంద్రం చూపే హామీలపై ఆధారపడకూడదు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా పట్ల కేంద్రానికి చిత్త శుద్ధి ఉంటే సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలి. ఆర్టికల్ 35ఎకు సంబంధించి దాఖలైన రిట్ పిటిషన్‌ను వ్యతిరేకించాలి. కాశ్మీర్ సమస్యను పరిష్కరించడంలో సానుకూల వైఖరిని అనుసరించాల్సిన బిజెపి, మొండి వైఖరిని అవలంబిస్తూ యథాతథ స్థితిని కూడా నిరాకరించేందుకు ప్రయత్నిస్తున్నది. ఆ పార్టీ నాయకత్వం తరుచూ ప్రస్తావిస్తున్న 'కాశ్మీర్ సమస్య'కు తుది పరిష్కారం ఇదేనా? ★

తొందరపడకు చంద్రన్నా!

చర్చ

వి. శంకర్



'తొందర పడకోయ్ సుందర వదనా..!' అనేది పాత సినిమాలోని ఓ పాపులర్ డైలాగ్. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును చూస్తే గుర్తొస్తోంది. ఆయన తొందర చివరకు సెక్రటేరియట్ కారిపోవడానికి కారణమయ్యింది. నిర్మాణ సూత్రాలకు భిన్నంగా వెళ్లి సకాలంలో పూర్తి చేశామని చెప్పుకోవడానికి ప్రయత్నించిన చంద్రబాబు ఆశలు చిన్న వర్షానికే నీరుగారిపోయాయి. అంతకు ముందు పట్టిసీమలో కూడా అలాంటి పట్టింపులకే పోయారు. ఆరు నెలల్లో పూర్తిచేసేద్దామన్న ఆదుర్దా కొద్దీ ఆఖరికి జానంపేట దగ్గర అక్విడెక్ట్ కూలిపోవడానికి కారణమయ్యారు. అనేక చోట్ల కాలువలకు గండి పడడానికి అవకాశం ఇచ్చారు. అన్నీ సర్దుకుని, జాగ్రత్తలు పాటించిన తర్వాత ప్రారంభోత్సవాలు చేసుకుంటే అనవసరపు నష్టాలకు అవకాశం వుండేది కాదు. ప్రజాధనం దుర్వినియోగం అయ్యేది కాదు.

అయితే సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో చంద్రబాబుకు తొందర ఎక్కువైంది. ఇక ఇప్పుడు నంద్యాల, కాకినాడ ఎన్నికల తరుణంలో ప్రారంభోత్సవాలతో ప్రజల దృష్టిని ఆకట్టుకునే ప్రయత్నంలో ఉన్నారు. వరుసగా అనేక భవనాలు, ఇతర ప్రారంభోత్సవాలతో తీరిక లేకుండా గడుపుతున్నారు. అమరావతి మాదిరిగా అదే పనిగా శంకుస్థాపనలు చేసుకుంటూ పోయి చివరకు శిలాఫలకం వేయడమంటేనే జనానికి చికాకు కలిగేలా చేసుకుంటున్నారు. శంకుస్థాపనల కోసమే ఆయన సుమారుగా వెయ్యి కోట్లు ఖర్చు చేసిన వైనం గమనిస్తే ఆ నిధులతో రాజధానికి సంబంధించిన పలు భవనాల నిర్మాణం పూర్తయి ఉండేదన్నది కాదనలేని సత్యం.

ఇప్పుడు పురుషోత్తపట్నం లిఫ్ట్‌కి ఆయన ముహూర్తం పెట్టుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలంలో నిర్మిస్తున్న ఈ ఎత్తిపోతల పథకం పోలవరం ప్రాజెక్ట్‌కి దిగువన కడుతున్నారు. ఇప్పటికే అక్కడ పుష్కర, చాగల్నాడు సహా పలు ఎత్తిపోతల పథకాలున్నాయి. పదేళ్ల క్రితమే ప్రారంభోత్సవాలు జరిగినా పూర్తిస్థాయి ప్రయోజనాలు అందించకుండా నిరుపయోగంగా పడున్నాయి. ఉదాహరణకు పుష్కర ఎత్తిపోతల పథకం అంచనాల ప్రకారం 1.80 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం సగం ఆయకట్టుకే ప్రయోజనం దక్కుతోంది. కాలువలు పూర్తిచేయడం సహా అసంపూర్తిగా ఉన్న పలు పనులను పూర్తి చేస్తే పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా తూర్పు గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతానికి అనూహ్యమైన మేలు జరుగుతుంది. అయినా దాని మీద చంద్రబాబు దృష్టి లేదు. ఆయన ప్రారంభించిన పథకాలే ప్రజలకు మేలు చేస్తున్నాయన్న ఆలోచన ప్రజల్లో రావాలని భావిస్తున్నారు. దానికి తగ్గట్టుగానే తాటిపూడి వంటి ఎత్తిపోతల పథకం అసంపూర్తిగా ఉన్నా ఖాతరు చేయకుండా పట్టిసీమకు ప్రాధాన్యతనిచ్చారు. ఇప్పుడు పుష్కర ఎత్తి పోతల పథకం పూర్తి ఫలితాల వైపు దృష్టిపెట్టకుండా పురుషోత్తపట్నం కోసం సుమారు రూ. 2 వేల కోట్లు వ్యయం చేయబోతున్నారు.

అందుకే 'అయ్యవారు వచ్చే వరకూ అమావాస్య ఆగదేమో' గానీ చంద్రబాబు అనుకుంటే ప్రారంభోత్సవ రాయి పడిపోవాల్సిందే అన్నట్టుగా మారిపోతోంది. పురుషోత్తపట్నం లిఫ్ట్ పనులకు జనవరి 5న శంకుస్థాపన చేస్తే పనులు మాత్రం మార్చిలో ప్రారంభమయ్యాయి. నిర్వాసితుల నష్టపరిహార విషయం పూర్తిగా పరిష్కారం కాలేదు. పనుల పరిశీలనకు వచ్చిన చంద్రబాబును స్థానిక రైతులు నిలదీస్తారేమోనని సిపిఎం నాయకులను, కొంతమంది రైతులను ముందస్తుగా అరెస్టులు చేశారు. ఇదిలా వుంటే అరకొరగా చేపట్టిన ఇటువంటి పనులతో ఈ మధ్య కురిసిన చిన్నపాటి వర్షాలకే భూగర్భం నుంచి పైప్ లైన్ పైకి లేచిపోయి స్థానికులను ఆందోళనకు గురిచేసింది. ఇప్పటికీ వాటిని పూర్తిగా సరిచేసిన పరిస్థితి లేదు. ఈలోగానే చంద్రబాబు పురుషోత్తపట్నం ప్రారంభోత్సవానికి తొందరపడుతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. వాస్తవానికి ఈ ప్రారంభం చేసినంత మాత్రాన రాయి పడుతుందేమో గాని, రైతులకు గానీ, ఇతరులకు గానీ చుక్క నీరు అందే అవకాశం లేదు. దానికి కారణం పురుషోత్తపట్నం నుంచి నీటిని తరలించాల్సిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ సిద్ధంగా లేకపోవడమే. ఆ కాలువకు అనేక చోట్ల వంతెనలు, అక్విడెక్టులు నిర్మించాల్సి ఉంది. అంతేగాకుండా పురుషోత్తపట్నం వద్ద గోదావరి నీటిని లిఫ్ట్ చేసి పోలవరం కాలువలో పోసినప్పటికీ ఆ తర్వాత మళ్లీ ఆ నీటిని ఏలేరు జలాశయంలో లిఫ్ట్ చేయడానికి మరో ప్రాజెక్ట్ కూడా అవసరం. పురుషోత్తపట్నం ఫేజ్ కూడా ఇంకా ఓ రూపు దాల్చలేదు. ఈలోగా ఎన్ హెచ్ 16 సహా అనేక రహదారులను మళ్లించి వంతెనలు కట్టాల్సి ఉంది. అవన్నీ రాబోయే ఒకటి రెండు నెలల్లో పూర్తిచేసినా ఈ సీజన్‌లో రైతులకు ఉపయోగం ఉండదు. దానికి కారణం అక్టోబర్ నాటికి మెట్టలో కూడా సాగు సీజన్ ముగిసిపోతుంది. అలాంటి సమయంలో ఇప్పుడు హడావుడిగా ప్రారంభోత్సవ కార్యక్రమం పెట్టుకోవడం వెనుక చంద్రబాబు స్వప్రయోజనాలే తప్ప ప్రజల ప్రయోజనాలు ఏమున్నాయనే సందేహం కలుగుతోంది.

ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. చివరకు పురుషోత్తపట్నానికి రావాల్సిన మోటార్లు కూడా ఇంకా రాలేదు. నిర్మాణ సంస్థ మెగా ఇంజనీరింగ్ మోటార్ల కోసం ఆర్డర్ ఇచ్చింది. అవి చైనా నుంచి రావాల్సి ఉంది. కానీ అవి రాకముందే హడావుడిగా ప్రారంభోత్సవం చేయడం చంద్రబాబు నైజాన్ని చాటుతోంది. ఆయనేదో సాధిస్తున్నారని జనం అనుకోవడానికి తగ్గట్టుగా ఆయన ఈ ఏర్పాట్లు చేసుకుంటున్నారని అర్థమవుతోంది. గతంలో పట్టిసీమ విషయంలోనూ ఇదే తంతు. జాతికి అంకితమంటూ ఒకసారి, ప్రారంభోత్సవం మరోసారి, నీటిని విడుదల చేయడం ఇంకోసారి ఇలా పలు కార్యక్రమాలు నిర్వహించి ప్రచారం చేసుకున్నారు. తద్వారా పట్టిసీమ ప్రచారం ఆయన పార్టీకి ఉపయోగపడిందని బాబు భావిస్తున్నారు. అందుకే అదే తీరుతో పురుషోత్తపట్నంలో ప్రచార మంత్రం జపిస్తున్నారు. యథావిధిగా పట్టిసీమ కథను పురుషోత్తపట్నంలో నడిపిస్తున్నారు. పురుషోత్తపట్నానికి సంబంధించిన మోటార్లు రాకపోయినా ఏకంగా హంద్రీనీవా నుంచి రెండు మోటార్లు తెచ్చుకుని వాటి ద్వారా నీటిని వదలడానికి సిద్ధపడ్డారు. అది కూడా పట్టిసీమ పద్ధతిలోనే కావడం విశేషం. అప్పుడు కూడా అదే జరిగింది. ఇక ఇప్పుడు అరువు తెచ్చిన తాత్కాలిక మోటార్ల ద్వారా తాత్కాలిక ప్రారంభోత్సవం చేయబోతున్నారు. తద్వారా 700 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తామని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత ఆ నీరు ఎక్కడికి వెళుతుందంటే ఎవరూ సమాధానం చెప్పలేని స్థితి. వాటి వల్ల ఏం ప్రయోజనం అని ఆలోచించినా సమాధానం దొరకడం లేదు. నీటిని గోదావరి నుంచి కాలువకు తరలిస్తారు. కానీ కాలువలు సిద్ధంగా లేనప్పుడు నీళ్లు పొలాలకు మళ్లే అవకాశం లేదు. పోనీ ప్రభుత్వం చెబుతున్నట్టు విశాఖ తాగునీటి అవసరాల కోసమే అనుకున్నా అది కూడా ఒట్టి వాగాడంబరమే అవుతుంది. అంటే రైతులకు గానీ ప్రజలకు గానీ ఎటువంటి ప్రయోజనం లేకపోయినప్పటికీ ప్రచారం కోసం ఓ ప్రారంభోత్సవం చేసుకోవడాన్ని బట్టి ప్రజల సొమ్మును ఎంత యధేచ్ఛగా ఎత్తిపోతల పాలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పథకం సంపూర్ణంగా పూర్తిచేసి, ఆ తర్వాత జాతికి అంకితమిచ్చి, ఇతర ప్రారంభోత్సవాలు చేసుకుంటే అంతా హర్షిస్తారు. కానీ అందుకు భిన్నంగా హడావుడిగా ఆయన లక్ష్యాల కోసం జనం సొమ్మును దుర్వినియోగం చేయడం ఏమాత్రం సమంజసం అనిపించుకోదు. ప్రజల సొమ్ముకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వాలు చేయాల్సిన పని ఇది మాత్రం కాదు. ★



రైతులకు గానీ ప్రజలకు గానీ ఎటువంటి ప్రయోజనం లేకపోయినప్పటికీ ప్రచారం కోసం ఓ ప్రారంభోత్సవం చేసుకోవడాన్ని బట్టి ప్రజల సొమ్మును ఎంత యధేచ్ఛగా ఎత్తిపోతల పాలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పథకం సంపూర్ణంగా పూర్తి చేసి, ఆ తర్వాత జాతికి అంకితమిచ్చి, ఇతర ప్రారంభోత్సవాలు చేసుకుంటే జనం హర్షిస్తారు. కానీ ఆయన లక్ష్యాల కోసం జనం సొమ్మును దుర్వినియోగం చేయడం ఏమాత్రం సమంజసం అనిపించుకోదు.

"కొన్ని పనులు కొందరే చేయాలి.. కొందరంటే.. కేవలం అబ్బాయిలే చేయాలి. బరువైన, సాహసోపేతమైన, కఠినమైన పనులకు ఆడవాళ్ళను ఆమడదూరంలో ఉంచాలి.. ఎందుకంటే.. వారు బలహీనులు.." అన్నది సమాజంలో బాగా నాటుకుపోయిన అభిప్రాయం. అందుకే.. కొన్ని కీలకమైన వృత్తి, ఉద్యోగాల్లో మహిళలు అరుదుగా కనిపిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో నిప్పుకు ఎదురెళ్లి.. తొలిసారి ఫైర్‌ఫైటర్‌గా.. అగ్నిమాపకశాఖ ఉద్యోగంలోకి అడుగుపెట్టి.. చరిత్రను తిరగరాశారు హర్షిణీ కన్వేకర్. భయంకరమైన అగ్నిజ్వాలలను సైతం తన చాకచక్యమైన తెలివి, ధైర్యసాహసాలతో చల్లార్చుతూ.. అగ్నిమాపకశాఖ ఉన్నత ఉద్యోగిగా జేజేలు అందుకుంటుందామె. నిజానికి హర్షిణీ సాధించిన విజయం వెనుక ఎన్నో అవమానాలు, హేళనలు, ఈసడింపులూ ఉన్నాయి. వాటన్నింటినీ దాటుకుని అగ్నిసెగై.. నిప్పుకణికై.. మరికొందరు మహిళలకు మార్గదర్శకంగా నిలుస్తున్న తొలి ఫైర్‌ఫైటర్ హర్షిణీ విజయగాథ.. తెలుసుకుందాం పదండి!!



హర్షిణీ.. ఓ నిప్పుకణిక

ఎన్‌ఎఫ్‌ఎస్‌సి టెలిగ్రామ్ ఒకటి అందింది. దానిలో ఆమె రాతపరీక్షలో అర్హత సాధించిందనే సమాచారం అది. అప్పటికి అది చరిత్ర సృష్టించే వార్తని ఆమెకు తెలియదు. ఆ కాలేజ్‌లో ఒక ఆడపిల్ల చదువుకున్న దాఖలాలే లేవనే విషయం అడ్మిషన్ లెటర్ అందుకున్న తర్వాతే తెలిసిందామెకు. ఆ క్యాంపస్‌లో కనీసం చూడటానికైనా ఒక్క మహిళా కనిపించలేదు. అయినా ఆ పరిస్థితులు ఆమెను నిరాశపరచలేదు.



ఆమె దృష్టంతా అక్కడ కనిపించే ఎరుపు రంగు భవనంపైనే పడింది. ఆ భవనంలోనే చదువుకోవాలని నిర్ణయించుకుంది. ఇంతలో ఒక పురుషుడి స్వరం... "మేడమ్! దయచేసి ఆర్మీగానీ లేదంటే ఎయిర్‌ఫోర్స్ కాలేజ్‌లో దరఖాస్తు చేసుకోండి. మహిళా విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు అక్కడే ఉంటాయి. ఇదైతే అంతా పురుషులే ఉండే కాలేజ్.." అని ఆమెకు సలహా ఇచ్చింది. ఆ మాట విన్న హర్షిణీ మరింత బలంగా అక్కడే చేరాలని నిర్ణయించుకున్నారు.

యూనీఫారమ్.. ఓ కల

2002వ సంవత్సరం వరకూ మహిళా ప్రాతినిథ్యమేలేని సంస్థగా ఫైర్ సర్వీస్‌కు గుర్తింపు ఉంది. దాన్ని తిరగరాసింది హర్షిణీ. యూనియన్ పబ్లిక్ సర్వీస్ మాదిరి ప్రవేశ పరీక్షలో 30 మందికి మాత్రమే అవకాశం కలిగే దాంట్లో ఉత్తీర్ణత సాధించారు. తర్వాత రెండో రౌండ్ అయిన మెడికల్ ఎగ్జామ్‌కి వెళ్ళగా "అమ్మా! ఇది చాలా కఠినమైన కోర్సు. ఇది సాధించగలవనే నమ్మకం నీకు ఉందా?" అని అక్కడ ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ అడిగాడు. ఇక ఆమె ఎదుర్కొన్న చివరిదశ ముఖాముఖి ఇంటర్వ్యూలో ప్యానల్ సభ్యులు ఒకరు హర్షిణీని ఉద్దేశించి "ఈమె ఫైర్ సర్వీస్‌లో కిరణ్‌బేడీలా నిలుస్తుంది" అన్నారు. ఆ మాటకు హర్షిణీ చాలా సంతోషించిందిగానీ ఆ పొగడ్తని తలకెత్తుకోలేదు. ఎలాగైతేనేమి అన్ని దశల్లోనూ మంచి గుర్తింపు సాధించిన హర్షిణీ తాను ధరించాలని కలలుగన్న యూనీఫారమ్ వేసుకునేందుకు సమయం వచ్చింది.

ఆమె.. ఒక ప్రయోగం

కాలేజీలో హర్షిణీకి అది మొదటిరోజు... తనను "ఎన్‌ఎఫ్‌ఎస్‌సిలో చేరడానికి శరీరనాళాల్లో సత్తువ కావాలి" అని చెప్పి, భయపెట్టాలనుకున్న వ్యక్తిని కలుసుకుంది. అక్కడ యూనీఫారమ్‌లో ఆమెను చూసిన అతడికి మాటలు తడబడ్డాయి. ఏమనుకున్నారో గానీ "మేడమ్! మా కాలేజీ మీకు సాదరస్వాగతం పలుకుతుంది" అంటూ అభినందించారు. అప్పటి నుంచీ ఆ కాలేజీలో చేరాలనుకునే మహిళలను ప్రోత్సహించాలని అందరూ నిశ్చయించుకున్నారు. కాలేజీలో చేరడం ఒక వంతయితే, అక్కడ తనను తాను నిరూపించుకోవడం మరో సాహసం. సమయాన్ని పక్కాగా పాటించేదామె. వ్యాయామంలో అలసటతో నీరసించిపోకుండా ఉండటానికి చాలా ప్రయత్నించేది. ఎందుకంటే, హర్షిణీ అలస్యంగా ఏ పనిచేసినా 'మహిళలంతా ఇంతే' అంటూ సమాజంలో స్త్రీలందర్నీ ఒకే మూసలో కట్టేసే ప్రయత్నం ఎవరైనా చేస్తారేమోనని ఆమె భయం. అందులోనూ ఫైర్ సర్వీస్‌లో ఇప్పుడు ఆమె ఒక ప్రయోగ వస్తువు. మంచైనా చెడైనా.. భవిష్యత్తులో ఆమె ఒక రోల్‌మోడల్ అన్న విషయం ఆమెకు బాగా తెలుసు.

ఒంటరిగా.. సాధన

అప్పటివరకూ మహిళా కళాశాలల్లో చదువుకున్న హర్షిణీకి పురుషుల కళాశాలల్లో చదవడం వింత అనుభవమే. మూడున్నర సంవత్సరాల ఫైర్ ఇంజినీరింగ్ రెసిడెన్షియల్ కోర్సులో ఒక్క అమ్మాయే ఉండటంతో హర్షిణీకి కాలేజ్ పూర్తయిన తర్వాత రోజూ ఇంటికి వెళ్ళే అవకాశం ఇచ్చారు. ఈ కోర్సు పూర్తయ్యే వరకూ తన ప్రతి కదిలికలో ఎంతో నిబద్ధత చూపించేదామె. ఎన్‌సిసిలో ఉన్నప్పుడు భారత వాయుదళంలో మొదటి మహిళా పైలెట్ శివానీ కులకర్ణి గురించి చదివింది. అప్పటి నుంచీ శివానీయే తనకు ప్రేరణ.



ఎన్‌సిసిలో యూనీఫారమ్ ధరించిన అధికారుల్ని చూసినప్పుడు ఎంత గర్వపడేదో అదే భావన హర్షిణీని యూనీఫారమ్ వేసుకోవాలనే నిశ్చయానికి పురిగొల్పాయి. ఇక్కడ హర్షిణీని వింతమనిషిలా చూసేవారు. ఈ సంస్థలో మొదటి మహిళగా చేరిన ఆమె అనుభవాలను తెలుసుకోవాలనే ఆత్రంతో తోటి విద్యార్థులు ఆమెను ప్రశ్నలతో ముంచెత్తేవారు. అందరి చూపులూ ఆమెపైనే. బరువైన నీటి గొట్టాలను మోయడం, ప్రమాద సమయాల్లో ఎలా వ్యవహరించాలో తెలుసుకునే మాక్ డ్రిల్స్ చేయడం.. అక్కడ అందరికీ చాలా కష్టమైన పనే. ఇలాంటి పరిస్థితుల్లో హర్షిణీ బలహీనంగా ఉండదల్చుకోలేదు. అందుకే స్టోర్ రూమ్‌కి వెళ్ళి ఒంటరిగా ప్రాక్టీస్ చేసేవారు. తనను వెక్కిరించే అవకాశం ఎవ్వరికీ ఇచ్చేదికాదామె.



ప్రతిదీ సవాలే

ఒక ఫైర్ ఫైటర్‌గా నిలబడాలంటే ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. హర్షిణీ వాటన్నింటికీ సిద్ధపడ్డారు. తాను ఉద్యోగంలో చేరిన కొత్తలో దీపావళి రోజున అగ్నిమాపక సేవల కోసం ఆమె ఆరు సంఘటనల్లో సేవలందించాల్సి వచ్చింది. ఢిల్లీ, శాస్త్రీనగర్‌లో పై అంతస్తులో ఉన్న ఒక చెప్పుల షాపులోకి దీపావళి రాకెట్ దూసుకు వెళ్లింది. షూ బాక్సులకు అంటుకున్న మంట అంతటా వ్యాపించి.. చివరికి భవనం మొత్తం పగుళ్లు వచ్చేంత వరకూ కాలుతూనే ఉంది. భయంకరమైన అగ్నితో పాటు, ఊపిరి సలుపలేనంత పొగ తోడవటంతో సహాయకచర్యలు మరింత కఠినతరమయ్యాయి. ఎదురుగా ఉన్న భవనంలో నుంచి మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా అనుకున్నంత ఫలితం కనిపించలేదు. ఇక చేసేదిలేక పక్కనున్న భవనంలో ఒకవైపు గోడను పగలగొట్టి, అక్కడ నుంచి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మధ్యరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ సాగిన ఆరు గంటల సుదీర్ఘ ప్రయత్నం తర్వాత ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకురాగలిగారు. ఇలాంటి క్లిష్టమైన అగ్నిమాపక సహాయకచర్యల్లో హర్షిణీ ఎంతో ధైర్యంగా పాల్గొనేవారు.

అక్కడా మహిళలు లేరు

ఆయిల్ అండ్ నేషనల్ గ్యాస్ కార్పొరేషన్‌కు సాగరతీరం నుంచి ఉత్పత్తి చేసే రెండవ అతిపెద్ద సంస్థగా పేరున్న గుజరాత్‌లోని మెహసానా ఫైర్‌స్టేషన్‌లో చేరింది హర్షిణి. యాభైకు మించిన ఆయిల్ ఇన్‌స్టాలేషన్స్ ఉన్న ఆ ప్రాంతంలో మూడు ఫైర్ స్టేషన్లు ఉంటే, ఎప్పుడూ ఆ మూడింటిలో ఏదో ఒకదానికి హర్షిణీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించేవారు. మెహసానాలోనూ మున్సిపాలిటీ ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో ఓఎన్‌జిసినే ఆ ప్రాంతంలోని అగ్నిమాపక సేవలందించే బాధ్యతా తీసుకుంది. అలా అక్కడ ఎన్నో సేవలందించిన హర్షిణీ 2010లో ముంబయి డ్రిల్లింగ్ సర్వీసెస్‌కు బదిలీ అయ్యారు. హర్షిణీ చేరే వరకూ మైదాన ప్రాంతాల్లో డ్రిల్లింగ్ సర్వీసెస్ బాధ్యతలను మహిళకు ఇచ్చిన దాఖలాలు లేవు. 2013 తర్వాతే ఇందులో మహిళలను ప్రోత్సహిస్తున్నారు. ఏదేమైనా మహిళలు చేయలేనిదంటూ ఏదీ లేదని మరోసారి నిరూపించారు హర్షిణి. తాను మొదటి మహిళా ఫైర్‌ఫైటర్‌గా నిలిచినందుకు చాలా గర్వపడుతున్నారామె.



కేవలం ఫైర్‌ఫైటరే కాదు, హర్షిణీ అనుభవమున్న బైకర్ కూడా. ఇటీవల కార్గిల్ వెళుతూ లేహ్‌లద్దాఖ్‌లోని ప్రపంచంలోనే ఎత్తయిన మోట్రబుల్ రోడ్డు ఖర్దుంగ్లా పాస్‌ను అధిరోహించింది. "ఏ పనిలోనూ లింగ వివక్ష ఉండదు. ఉదాహరణకి బైకింగ్ తీసుకుంటే, బైక్ నడిపేది స్త్రీనో, పురుషుడో దానికి తెలియదు. కాబట్టి పురుషులు చేసే పని, స్త్రీలు చేసే పని అంటూ ఏమీ ఉండదు. ఇష్టమైన ఏ పని చేసైనా ఆత్మస్థయిర్యం మహిళలు పొందాలి" అంటున్న హర్షిణీ జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.

- జీవన డెస్క్

సమన్లు తీసుకోవాలా.. వద్దా?

న్యాయ సలహా

నా పేరు మీద కోర్టు నుంచి సమన్లు వచ్చాయి. నాకు భయం వేసి తీసుకోలేదు. పోస్టుమాను రోజూ వెంటపడుతున్నాడు. ఊళ్లో లేనట్టు రాయమన్నాను. కుదరదంటున్నాడు. నాకు తెలిసి నేనే కేసులో లేను. ఎందుకిలా సమను వచ్చిందో అర్థం కావడం లేదు. నేనేం చెయ్యాలి?

- మాణిక్యాలరావు, రాజమండ్రి

కోర్టు సమన్లకి, లీగల్ నోటీసుకి చాలామంది భయపడి వాటిని తీసుకోరు. అలా చెయ్యడం తప్పు. ఒక్కోసారి దానివల్ల నష్టం జరగొచ్చు. ముందు వాటిని సంతకం చేసి తీసుకోండి. అవసరమనిపిస్తే లాయరుగారికి చూపి సలహా తీసుకోండి. అంతేగానీ, తప్పించుకోవడానికి ప్రయత్నించకండి.


మీకు తెలిసి ఏ కేసులో లేరంటున్నారు గనుక అవి సాక్షిసమన్లు కావొచ్చు. తీసుకుని చదివితే మీకే తెలుస్తుంది. మిమ్మల్ని సాక్షులుగా చూపేవాళ్లు ముందుగా మీ అనుమతి తీసుకోవాలి. మీతో అన్ని వివరాలూ చెప్పాలి. అలా చెయ్యనప్పుడు మీరు "నాకేమీ తెలియదు" అని కోర్టులో చెప్పవచ్చు.

మీరు కోర్టుకి హాజరయ్యేలా చూసే బాధ్యత దావావేసిన వారిదే గనుక వాళ్లే వచ్చి మిమ్మల్ని కలవాలి. లేని పక్షంలో మీరేమీ భయపడనవసరం లేదు. సాక్ష్యానికి వెళ్లకపోయినా ఫర్వాలేదు. కాకపోతే, కోర్టు సమనులో ఏముందో మీరు తెలుసుకోవాలి.


నేను తాపీ పనులు చేస్తుంటాను. మా ఊరు విడిచి పనులకు వేరే ఊళ్లకి వెళ్తుంటాను. నా భార్య గత ఏడాది నన్ను విడిచి వెళ్లిపోయి పుట్టింట్లో ఉంటోంది. రాకపోకలు లేవు నేను మొన్న మా ఊరు వెళ్లినప్పుడు ఫామిలీ కోర్టు నుంచి వచ్చిన సమను మా ఇంట్లో ఉంది. మార్చి 23వ తేదీన కోర్టుకి హాజరు కావాలని, రాని పక్షంలో పరోక్షంలో తీర్మానం చేయబడుతుందనీ అందులో ఉంది. ఇప్పుడేం చెయ్యాలి?

- నర్సింహం, తెనాలి.

సాధారణంగా కోర్టు సమన్లు రిజిష్టరు పోస్టులో కోర్టువారు పంపిస్తారు. మీరు లేకపోయినా, మీ ఇంట్లో వాళ్లు సంతకం చేసి తీసుకుని ఉంటారు. కోర్టు సమను కాబట్టి వాళ్లు వెంటనే మీకు ఫోనులో చెప్పాల్సింది. మార్చిలో మీరు హాజరు కానట్టు, రికార్డులో రాసుకుంటారు. వాయిదాలు కూడా వేసి వుంటారు. ఆ వివరాలు మీరు కోర్టులో బెంచిగుమాస్తానడిగితే చెబుతారు. మీతో బాటు కోర్టు సమను కూడా తీసుకువెళ్లి చూపండి. రికార్డు తీయడం సులభమౌతుంది. బహుశా మీ భార్య పోషణ నిమిత్తం కోర్టులో పిటీషను వేసి ఉంటుంది. ఎమ్‌పి అని అంటారు. దానికి గల నెంబరే మీ కేసు నెంబర్. ఆ కాగితాలు జాగ్రత్తగా ఉంచుకోండి. మీ భార్య కోర్టులో దాఖలు చేసిన పిటిషను కాపీ అడిగితే ఇస్తారు అలా మీకు ఇచ్చినట్టుగా సంతకం తీసుకుంటారు. ఇకపైన మీరు ప్రతివాయిదాకి తప్పనిసరిగా హాజరుకావాలి. లేకపోతే, మీకు వ్యతిరేకంగా కోర్టు నిర్ణయించే ప్రమాదం ఉంది. ఆలస్యం చెయ్యకుండా వెంటనే వెళ్లండి. అవసరాన్ని బట్టి లాయరుని పెట్టుకోండి.



కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం :8330968901
ఇ మెయిల్
katururavindratrivikram@gmail.com



'జీవన'పై మీ స్పందన

'జీవన' పేజీలు మీకెలా అన్పిస్తున్నాయి? ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారు? మీ కుటుంబసభ్యుల, మిత్రుల, బంధువుల స్పందన ఎలా ఉంది? 'ప్రజాశక్తి' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు మాకు తెలియజేయండి.

మా చిరునామా: జీవన, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం : 7-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2, ఇ మెయిల్
jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

మీ ప్రశ్నలకు 12-6 గంటల వరకు ఫోనులో చెప్పవచ్చు. ఆదివారం సెలవు.

మీ కోసం

ప్రతిరోజూ కొన్ని పిస్తా పప్పులు తీసుకుంటే చర్మం మృదువుగా ఉంటుంది.



నారింజ తొక్కతో చక్కని చర్మం

నారింజతో చర్మ సౌందర్యం చాలా మెరుగుపడుతుంది. అయితే మార్కెట్లో కొనే ఆరెంజ్ ఫ్లేవర్లలో రసాయనాలు ఉంటాయి. వీటి వల్ల చర్మం పాడయ్యే అవకాశం ఉంది. అదే సహజమైన పండుతో చర్మానికి ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఆరెంజ్‌లో ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం ఉంటాయి. ఆరెంజ్ జ్యూస్ లో విటమిన్–సి ఉంటుంది. ఇది చర్మాన్ని కాంతివంతంగా చేయగలదు. వీటిలో ఉన్న మేలైన గుణాల వలన వృద్ధాప్యఛాయలు తగ్గుతాయి. హానికల్గించే సూర్య కిరణాల నుంచి రక్షణ పొందవచ్చు. తాజా ఆరెంజ్‌తోనే కాక తొక్కలతోనూ చర్మం ఆరోగ్యంగా తయారవుతుంది. నారింజ తొక్కలతో తయారైన ఫేస్ ప్యాక్స్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆరెంజ్ తొక్కలు చర్మంపై ఉన్న మొటిమలు, మచ్చలు, ముడతలు, నల్లటి వలయాలను తీసివేస్తాయి. అంతేకాదు మీ చర్మంలోని మృత కణాలను తీసివేస్తాయి. కానీ ముందు మాత్రం మీరు తొక్కల్ని ఎండబెట్టి, దానిని మెత్తని పొడిగా చేసుకోవాలి. దానిని గాలి ఆడని కంటైనర్లో నిల్వ చేసుకోవాలి. ఎండిన నారింజ తొక్క పొడికి పెరుగు కలిపి పేస్ట్‌గా చేసుకోవాలి. తర్వాత ఫేస్ ప్యాక్ వేసి, అది ముఖంపై ఆరేంతవరకూ రుద్దాలి. ఎండిపోయాక, కొన్ని నిమిషాల తర్వాత చల్లని నీటితో వాష్ చేసుకోవాలి. ఈ ప్యాక్ ముఖంపై ఏర్పడిన మృత చర్మాన్ని పోగొట్టేలా చేస్తుంది.



నారింజ తొక్క పొడికి ఒక టేబుల్ స్పూన్ తేనె, టేబుల్ స్పూన్ నిమ్మ రసాన్ని కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. దాన్ని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా వేసుకోవాలి. 20 నిముషాల పాటు ఉంచి గోరువెచ్చని నీటితో కడుక్కోవాలి. నిమ్మరసం బదులు టేబుల్ స్పూన్ పసుపు వేసుకున్నా మంచి ప్రభావం కనిపిస్తుంది. నారింజ తొక్క పొడిలో కేవలం తేనె కలుపుకుని ప్యాక్‌గా వేసుకున్నా మంచి ఫలితం ఉంటుంది.

ఆరెంజ్ తొక్కల పొడికి పాలు లేదా రోజ్ వాటర్ కలిపిన మిశ్రమాన్ని మెడ వరకూ ప్యాక్‌గా వేసుకోవాలి. అరగంట ఉంచి కడిగేసుకోవాలి. ఒకవేళ మీది పొడి చర్మం అయితే నీటిని ఎక్కువ పోసుకోవాలి. అదే ఆయిల్ స్కిన్ అయితే రోజ్ వాటర్ మాత్రమే వాడాలి.

నారింజ తొక్క పొడికి నారింజ రసం కలిపి, దీనికి పొడిగా ఉన్న పచ్చ బంక మట్టి చేర్చి, ఆ మిశ్రమాన్ని పేస్ట్‌గా చేసుకోవటానికి అనువుగా పాలను కలపాలి. ఈ పేస్ట్‌ను ప్యాక్‌లా వేసుకుని, ఇరవై నిముషాల తర్వాత వెచ్చని నీటితో కడిగేసుకోవాలి.

జీవన సౌరభం

ఓడిపోయి విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, ఆ ఓటమి నేర్పిన పాఠాన్ని మననం చేసుకో.. గెలుస్తావు.

సెన్సెక్స్ ▲ 25 31,795 | నిఫ్టీ ▲ 07 9,904 | రూపాయి ▼ 02 పైసలు ఒక అమెరికా డాలరుకు రూ. 64.14

ఇండియన్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం



ప్రజాశక్తి-బిజినెస్ బ్యూరో

ఇండియన్ బ్యాంక్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగాబ్యాంకు 111వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసింది. ఇండియన్ బ్యాంక్ హైదరాబాద్ జోన్ వారు లయన్స్ బ్లడ్‌బ్యాంక్ వారి సౌజన్యంతో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులతో పాటు వివిధ శాఖలకు చెందిన సిబ్బంది, ఖాతాదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఖాతాదారులపై బ్యాంకుల చిన్నచూపు

న్యూఢిల్లీ : సగటు ఖాతాదారులపై బ్యాంకులు చిన్న చూపు చూస్తోన్నాయి. వరుసగా ఒక బ్యాంకు వెనుక మరొక్కటి సేవింగ్స్ ఖాతాలపై వడ్డీ రేట్లకు కోత పెడుతున్నాయి. దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మొదలుపెట్టిన ఈ కోతల బాటలో అన్ని బ్యాంకులు వరుస కడుతున్నాయి. ఇప్పటికే యాక్సిస్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, యస్ బ్యాంకులు కూడా తమ సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేట్లను తగ్గించాయి. తాజాగా మరో ప్రయివేటు రంగ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు కూడా ఇదే తరహా నిర్ణయం నిర్ణయం తీసుకుంది. పొదుపు ఖాతాల్లో నగదు నిల్వలపై చెల్లించే వడ్డీని తగ్గించినట్లు గురువారం ప్రకటించింది. రూ.50లక్షల లోపు డిపాజిట్లపై 0.5శాతం వడ్డీని తగ్గిస్తూ 3.5శాతానికి కుదించింది. రూ.50లక్షల పైబడిన డిపాజిట్లపై యథావిధిగా 4శాతం వడ్డీని చెల్లించనున్నట్లు పేర్కొంది. సవరించిన వడ్డీ రేట్లు ఆగస్టు 19 నుంచి అమల్లోకి వస్తాయని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు తెలిపింది. నోట్ల రద్దుతో బ్యాంకుల వద్ద మిగులు నిల్వలు ఉండటం, ద్రవ్యోల్బణం దిగి రావడంతో వడ్డీ రేట్లను బ్యాంకులు తగ్గించేస్తున్నాయశా వర్గాలు పేర్కొంటున్నాయి. నికర వడ్డీ ఆదాయాలను పెంచుకోవడానికి ఇదొక ముఖ్య మార్గమని బ్యాంకులు భావిస్తున్నాయి.

మిస్త్రీతో పూర్తిగా తెగతెంపులు

- టాటా గ్రూపు నిర్ణయం..!
- బోర్డులో దిశా, నిర్దేశం..!



న్యూఢిల్లీ : టాటా గ్రూపులో సైరస్ మిస్త్రీకి ఉన్న వాటాలను తెగతెంపులు చేసుకోవాలని దిగ్గజ కార్పొరేట్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. టాటా గ్రూపు ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఈ సంచలన నిర్ణయానికి వీలుగా బోర్డు సభ్యులకు సూచనలు చేశారని సమాచారం. టాటా సన్స్ బోర్డు, టాటా గ్రూప్‌లోని మేజర్ ఆపరేటింగ్ సంస్థల ప్రమోటర్లు గత నెలలో సమావేశమయ్యాయని, ఈ మీటింగ్‌లో షాపూర్జి పల్లోంజి గ్రూప్‌తో ఉన్న అన్ని వ్యాపార సంబంధాలను తెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఈటి ఒక కథనం వెల్లడించింది. టాటా సన్స్ ఛైర్మన్‌గా వ్యవహరించిన మిస్త్రీకి గతేడాది బోర్డు సభ్యులు అర్థాంతరంగా ఉద్వాసన పలికిన సంగతి తెలిసిందే. ఈ హఠాత్తు పరిణామం అనంతరం నుంచి టాటా సన్స్‌కు, మిస్త్రీకి తీవ్ర వాదోపవాదనలు జరుగు తూనే ఉన్నాయి. అప్పటి నుంచి మిస్త్రీ నుంచి టాటా గ్రూపున కు ఏదో విధంగా తలనొప్పులు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమం లోనే టాటా గ్రూప్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. సైరస్ మిస్త్రీ కుటుంబానికి చెందిన అన్ని సంస్థలతో ఉన్న ఒప్పందాలు, భాగస్వామ్యాలను రద్దు చేసుకోవాలని నిర్ణయించారు. టాటా గ్రూపునకు చెందిన పెద్ద కంపెనీలు అయినా టాటా మోటార్స్, టాటా స్టీల్, ఇండియన్ హోటల్స్ నిర్వహణపై సైరస్ మిస్త్రీ ఈ మధ్య కాలంలో పలు ఆరోప ణలు చేశారు. వీటిని టాటా గ్రూపు కొట్టివేసింది. టాటా సన్స్‌లో మిస్త్రీ కుటుంబానికి 18.4 శాతం వాటా ఉంది. టాటా గ్రూపులో అతిపెద్ద సింగిల్ వాటాదారునిగా ఎప్పటి నుంచో కొనసాగుతోంది. అయితే మిస్త్రీ టాటా సన్స్‌కు ఛైర్మన్‌గా ఉన్నప్పుడు తమకెళ్లాంటి కొత్త ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టులు దక్కలేదని షాపూర్ పల్లోంజీ గ్రూప్ తాజాగా పేర్కొంది. 2012-13లో టాటా గ్రూపు నుంచి పల్లోంజి గ్రూపునకు రూ.1,125 కోట్ల ఆర్డర్ వచ్చింది. కాగా 2013-14లో ఈ ఆర్డర్లు ఏకంగా రూ.103 కోట్లకు పడిపో యాయి. 2016-17 అక్టోబర్ నాటికి టాటా గ్రూపు నుంచి తమ కంపెనీకి ఎలాంటి ఆర్డర్లు దక్కలేదని పల్లోంజీ గ్రూపు వెల్లడించింది.

మళ్లీ రూ.30 వేలకు బంగారం

న్యూఢిల్లీ : తగ్గినట్లే తగ్గిన బంగారం ధర మళ్లీ రూ.30,000కు చేరింది. మరోవైపు కిలో వెండి ధర రూ.40వేలకు ఎగిసింది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు దేశీయంగా డిమాండ్ నెలకొనడంతో ఈ లోహాల ధరల్లో పెరుగుదల చోటు చేసుకుందని బులియన్ వర్గాలు తెలిపాయి. గ్లోబల్‌గా సింగపూర్ మార్కెట్లో ఒక్క ఔన్స్‌పై ధర 0.43 శాతం పెరిగి 1,288.30 వద్ద నమోదయ్యింది. దేశీయంగా న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.300 పెరిగి వరుసగా రూ.30,050, రూ.29,900కు చేరింది. ఇంతక్రితం సెషన్‌లో పసిడిపై రూ.300 తగ్గింది. తాజాగా కిలో వెండిపై మరో రూ.900 ఎగిసి ఏకంగా రూ.40,200గా పలికింది. 100 వెండి నాణేలపై కూడా రూ.100 పెరిగి రూ.73,000గా నమోదయ్యింది.

400 బిలియన్లకు వ్యాశీ మారకం నిల్వలు..!

న్యూఢిల్లీ : ప్రస్తుత దిశలోనే డాలర్ విలువలో పెరుగుదల కొనసాగితే వచ్చే సెప్టెంబర్ మొదటి వారం కల్లా భారత విదేశీ మారకం నిల్వలు రికార్డు స్థాయిలో 400 బిలియన్ డాలర్లకు చేరనున్నాయని మోర్గన్ స్టాన్లే అంచనా వేసింది. 2017 ఆగస్టు 4తో ముగిసిన వారంలో 581.1 మిలియన్ డాలర్లు పెరిగి 393.448 బిలియన్ డాలర్లకు చేరాయి. దేశీయ స్టాక్ మార్కెట్లలో భారీగా విదేశీ మదుపర్లు పెట్టుబడులు పెట్టడం, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ విలువ పుంజుకోవడం మారకం నిల్వల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి.

నోకియా 8 ఆవిష్కరణ

లండన్ : వినియోగదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నోకియా 8 స్మార్ట్‌ఫోన్‌ను హెచ్ఎండి గ్లోబల్ ప్రపంచ మార్కెట్లోకి విడుదల చేసింది. 5.3 అంగుళాల డిస్‌ప్లేతో దీన్ని లండన్‌లో ఆవిష్కరించింది. భారత్‌లో దీని ధర దాదాపు రూ.45వేల వరకు ఉండొచ్చని అంచనా. వెనుక వైపున 13 మెగా ఫిక్సల్‌తో డ్యుయల్ కెమెరా ఈ ఫోన్ ప్రత్యేకతగా ఉంది. ముందు వైపు కూడా 13 మెగాఫిక్సల్‌తో సెల్ఫీ కెమెరాను అమర్చింది. ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్‌లో ఈ ఫోన్‌ను అందుబాటులోకి రానుందని హెచ్ఎండి గ్లోబల్ వర్గాలు పేర్కొన్నాయి. ఆండ్రాయిడ్ నోగట్ ఆపరేటింగ్ సిస్టమ్, 4జిబి ర్యామ్, 64జిబి ఇంటర్నల్ మెమొరీ, 3090 ఎంఎహెచ్ బ్యాటరీ సామర్థ్యం దీని ప్రత్యేక ఫీచర్లుగా ఉన్నాయి.

ఈక్విటీలపై మదుపర్ల ఆసక్తి

- మార్కెట్లలో పెట్టుబడులే మేలని భావన
- పసిడి, స్థిరాస్తిల వన్నె తగ్గడమూ కారణమే..
- మూడు నెలల్లో రూ.30వేల కోట్ల పెట్టుబడులు



ముంబయి : సంప్రదాయక పెట్టుబడి సాధనాలైన బంగారం, స్థిరాస్తి రంగాల్లో నెలకొన్న స్తబ్దత స్టాక్ మార్కెట్ల ర్యాలీకి బాగా కలిసివస్తోంది. పసిడి ధరలు తక్కువ స్థాయిల వద్ద తచ్చాడుతుండడం, స్థిరాస్తి రంగంలో నెలకొన్న స్తబ్దత నేపథ్యంలో మదుపరులకు వీటిపై ఆసక్తి తగ్గుతూ వస్తోంది. దీంతో వారు తిరిగి స్టాక్ మార్కెట్లలో వైపు దృష్టి సారిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మార్కెట్లు రికార్డు స్థాయిలకు చేరి పరుగులు పెడుతుండడం కూడా ఎక్కువ మందిని ఊరిస్తోందని దీంతో ఎక్కువ మంది ఈ దిశగా దృష్టి సారిస్తున్నట్టుగా మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల కాలంలో బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ దాదాపు 10 శాతం మేర పెరిగింది. ఇటీవలే రికార్డు స్థాయిలో 32,000 పాయింట్ల స్థాయిని కూడా తాకింది. ఈ అంశాలు మదుపరులు బాగా ప్రభావితం చేస్తూ వస్తున్నాయి.

పరుగులు పెడుతున్న ఫండ్స్..

ఈక్విటీలు రికార్డు స్థాయిల వద్ద నమోదవుతూ వస్తుండడంతో 'మ్యూచువల్ ఫండ్' (ఎంఎఫ్) మేనేజర్లు దేశీయ మార్కెట్లలోకి భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల కాలంలో (ఏప్రిల్-జులై మధ్య కాలంలో) ఎంఎఫ్‌లు దాదాపు రూ.30,264 కోట్ల మేర పెట్టుబడులు పెట్టినట్టుగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ వెల్లడించింది. వివిధ విభాగాల్లో విడివిడిగా పెట్టుబడులు పెట్టే విదేశీ ఎఫ్‌పీఐ మదుపరులను కూడా మించి వీరు మార్కె ట్లకు నిధులను తరలిస్తుండడం విశేషం. ఈ ఏడాది మొదటి మూడు నెలల కాలంలో ఎఫ్‌పీఐలు ఈక్విటీల్లో కేవలం రూ.21,000 కోట్ల పెట్టుబడులు మాత్రమే పెట్టినట్టుగా సమాచారం. ఏప్రిల్‌లో రూ.11,244 కోట్లుగా ఉన్న ఎంఎఫ్ పెట్టు బడులు మే నెలలో రూ.9,106 కోట్లుగాను, జూన్ నెలలో రూ.11,800 కోట్లుగాను నమోదు అయ్యాయి. దీంతో దేశీయంగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ పరి ధి రూ.20,00, 000 కోట్ల రికార్డు స్థాయికి చేరువైంది.

'ఇన్ఫీ' మద్ధతు

దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ శనివారం నిర్వహించనున్న బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో బైబ్యాక్ షేర్లకు ఆమోదం తెలుపనుందనే వార్తలు ఆ కంపెనీ సూచీ 4.5 శాతం ర్యాలీకి దోహదం చేశాయి. దీంతో గురువారం భారత మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఆటో, బ్యాంకింగ్, వైద్య, ఎఫ్ఎంసిజి సూచీలు ఒత్తిడికి గురి అయినప్పటికీ ఆ లోటును ఇన్ఫోసిస్ పూడ్చిందని బ్రోకర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే బిఎస్ఇ సెన్సెక్స్ 24.57 పాయింట్లు లేదా 0.08 శాతం పెరిగి 31,795.46 వద్ద ముగిసింది. ఉదయం 31,919 వద్ద ప్రారంభమైన సూచీ ఓ దశలో ఏకంగా 300 పాయింట్లు పైగా పెరిగి 31,938 గరిష్ట స్థాయికి చేరింది. కాగా చివరి గంటలో అమ్మకాల ఒత్తిడితో ఇంట్రా ట్రేడింగ్‌లో 31,714 కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 6.85 పాయింట్లు పెరిగి 9,904.15కి చేరింది.రంగాల వారిగా బిఎస్ఇలో ఐటి సూచీ అత్యధికంగా 1.84 శాతం పెరిగింది. ఇదే క్రమంలో టెక్ 1.79 శాతం, పిఎస్‌యు 0.88 శాతం, విద్యుత్ 0.85 శాతం చొప్పున రాణించాయి. మరోవైపు ఆటో సూచీ 0.72 శాతం, బ్యాంకింగ్ 0.71 శాతం, వైద్య సూచీ 0.51 శాతం, ఎఫ్ఎంసిజి 0.29 శాతం చొప్పున పడిపోయాయి. సెన్సెక్స్‌లో ఇన్ఫోసిస్ 4.54 శాతం, కోల్ ఇండియా 4.22 శాతం, ఎన్‌టిపిసి 3.97 శాతం, ఎన్‌టిపిసి 3.97 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 2.29 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 0.95 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు సిప్లా 2.85 శాతం, అదానీ పోర్ట్సు 1.81 శాతం, మారుతి సుజుకి 1.23 శాతం, కొటాక్ బ్యాంకు 1.17శాతం, హెచ్‌యుఎల్ 1.04 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

In India national income is estimated by?

బ్యాంకింగ్ అవేర్‌నెస్ (ఐబిపిఎస్-పిఓస్, క్లర్క్స్)

MODEL QUESTIONS



1.Who is the Chairman of NITI Aayog?
a) Arvind Panagariya
b) Dr. Vijay Kelkar
c) Sunil Kanoria
d) Anupam Srivastava
e) Narendra Modi
2. In Strategic alliance, the alliance partners?
a) Merge with each other
b) One partner acquires the other
c) Remain separate entities
d) One partner amalgamates with other
e) None of the above
3. The premium on accident insurance under PMJDY will be borne by?
a) National Payments Corporation of India
b) Life Insurance Corporation of India
c) General Insurance Corporation of India
d) Central Government
e) None of these
4. INFINET is set up in which of the following cities?
a) Mumbai b) New Delhi
c) Hyderabad d) Chennai
e) Kolkata
5. The essential characteristic of whatever serves as money is that it must:
a) Be issued by the State
b) Be generally acceptable
c) Cannot be wholly fiduciary
d) Have some intrinsic value
e) None of these
6. Digital India Programme is planned to be fully implemented by:
a) 2016 b) 2017
c) 2018 d) 2019
e) 2020
7. Under Pradhan Mantri Sneh Bandhan Yojana, an individual may invest an amount of:
a) Rs. 5000 b) Rs. 5001
c) Rs. 5005 d) Rs. 5010
e) Rs. 6001
8. What is the Credit guarantee corpus amount of MUDRA Bank?
a) Rs. 3000 crores b) Rs. 4000 crores
c) Rs. 2500 crores d) Rs. 2000 crores
e) Rs. 1500 crores
9. The principal liability of a Bank relates to ___:
a) it's investment abroad
b) it's investment at home
c) repayment of its customer's deposits
d) it's requirements to make special deposits when requested
e) None of these
10. Which of the following is not a function of the Commercial Bank?
a) Acting as a lender of last resort
b) Lending to the private and public sectors
c) The provision of a cheque system for setting debts
d) The provision of safe deposit facilities
e) None of these
11. Under Pradhan Mantri Jeevan Jyoti Bima Yojana, the life insurance cover is for how many years ?
a) 1 year b) 2 years
c) 3 years d) 4 years
e) 5 years
12. As per Pradhan Mantri Suraksha Bima Yojana (PMSBY), if the customer has taken a cover under multiple bank accounts then the amount of premium under this will be:
a) Forfeited b) Renewed
c) Double d) Same
e) None of the above
13. Digital India Programme is centered on 3 key vision areas. Which of the following is not included in these vision areas?
a) Digital Infrastructure as a core utility to every citizen
b) Governance and services on demand
c) To promote digital banking
d) Digital Empowerment of citizens
e) None of the above
14. A customer does not require a bank account to obtain ___:
a) a loan b) a cheque book
c) a banker's draft d) an overdraft
e) None of these
15. Atal Pension Yojana (APY) offers fixed amount of pension ranging between Rs. 1000 to ___ depending upon the contribution which will be based on the age of joining the APY:
a) Rs. 2000 b) Rs. 3000
c) Rs. 4000 d) Rs. 5000
e) Rs. 6000
16. Which of the following is not the function of RBI?
a) Issue of currency notes
b) Maintaining financial stability
c) Subsidies to people
d) Banker to Bank
e) Banker to Government
17. Which of the following documents are required for registration of Jeevan Pramaan?
a) Aadhar Number
b) PPO number
c) Bank Account Number
d) All of the above
e) None of the above
18. As per Sukanya Samriddhi Account, the tenure of deposit is for ___ years from the date of opening of the account:
a) 15 years b) 20 years
c) 21 years d) 24 years
e) 25 years
19. Under Sukanya Samriddhi Account (SSA), the bank account will be opened for a girl child upto the age of ___:
a) 5 years b) 8 years
c) 10 years d) 15 years
e) 12 years
20. What is the initial corpus of MUDRA Bank?
a) Rs. 20,000 crores
b) Rs. 30,000 crores
c) Rs. 35,000 crores
d) Rs. 40,000 crores
e) Rs. 25,000 crores
21. In India national income is estimated by?
a) Finance Commission
b) Central Statistical Organisation
c) Planning Commission
d) Finance Ministry
e) Reserve Bank of India
22. A scheme named ___ offers a long term subscription to Pradhan Mantri Suraksha Bima Yojana with attached Fixed Deposit.
a) Suraksha Deposit Scheme
b) Suraksha Insurance Cover
c) Jeevan Suraksha Yojana
d) Suraksha Cover
e) Suraksha Investment Scheme
23. What is/are the objective of Pradhan Mantri Kaushal Vikas Yojana (PMKVY)?
a) To impart skill training to youth
b) Focus on first time entrants to the labour market
c) Focus on class 10 and class 12 dropouts
d) All of these
e) None of the above
24. What is meant by "Underwriting", the term frequently used in financial sector?
a) Under valuation of the assets
b) The Act of taking on a risk
c) Giving a Guarantee that a loan will not become a bad loan
d) Assignment of Insurance Policy
e) Hypothecation of stocks
25. Misery Index' represents?
a) Sum of rate of inflation and rate of unemployment
b) Product of rate of inflation and rate of unemployment
c) Proportion of very poor to poor living below the poverty line
d) Inflation rate divided by unemployment rate
e) Both (b) and (c)
26. Which of the following statement is true for IMF?
a) It is not an agency of UNO
b) It can grant loan to any country of the world
c) It can grant loan to state Govt. of a country
d) It grants loan only to member nations
e) It can grant loan only to European Countries
27. Which pair is not correct?
a) EXIM Bank - Financing for export - import
b) RBI - Banker's bank
c) IDBI - Industrial finance
d) FCI - Financial Assistance to Commercial Banks
e) NABARD - Apex organization for assisting Agriculture & Rural Development
28. Statutory Liquidity Ratio (SLR) of commercial banks means:
a) The percentage of cash that banks keep with them, as per IBA Guidelines
b) A portion of Fixed Deposits to be maintained with RBI as per RBI Act - 1934
c) Every bank is required to maintain a proportion of their Net Demand and Time Liabilities as liquid assets in the form of cash, gold and un-encumbered approved securities
d) The rate at which central bank of the country (in India it is RBI) allows finance to commercial banks
e) None of the above
29. Which bank is created for the promotion of cross border trade and investment?
a) NABARD b) SIDBI
c) EXIM Bank d) IDBI
e) None of the above
30. "Closed Economy" is that economy in which?
a) Neither export nor import takes place in a country
b) Deficit financing takes place
c) Only export takes place
d) Only imports are allowed
e) None of the above
31. Apna Sahakari Bank Ltd is located at?
a) Bhopal, Madhya Pradesh
b) Kolkata, West Bengal
c) Lucknow, Uttar Pradesh
d) Mumbai, Maharashtra
e) Hyderabad, Telangana
32. On which of the following types of cheques alterations are not allowed by RBI?
a) Paper cheque b) CTS cheque
c) Electronic cheque
d) Cheque with account payee crossing
e) None of the above
33. What is the income criterion for sanctioning loan under Prime Minister Employment Generation Programme (PMEGP)?
a) Rs. 18,000 per head
b) Rs. 18,000 per family
c) Rs. 24,000 per family
d) Rs. 36,000 per family
e) No ceiling on Income
34. Under Negotiable Instruments Act-1881 Inchoate Instrument means:
a) Invalid instrument
b) Incomplete instrument
c) Restricts further endorsement
d) Illegal Instrument
e) None of the above
35. To apply the Garnishee Order, the Banker - Customer relationship should be:
a) Creditor - Debtor
b) Agent - Principal
c) Trustee - Beneficiary
d) Debtor - Creditor
e) None of the above
36. Under Pradhan Mantri Suraksha Bima Yojana (PMSBY) insurance cover for accidental death or permanent full disability is:
a) Rs. 2 lakhs b) Rs. 3 lakhs
c) Rs. 4 lakhs d) Rs. 5 lakhs
e) Rs. 1 lakh
37. In term deposits if the Principal and Interest is Rs. 20,000 or above it should not be paid in cash as per ___:
a) RBI Act
b) Negotiable Instruments Act
c) Banking Regulation Act
d) Income tax Act
e) None of the above
38. As per BCSBI - Banking Codes and Standard Board of India, duplicate DD should be issued within ___ from the date of request?
a) 7 days b) 14 days
c) 10 days d) 15 days
e) 3 days

★

KEY : 1) e, 2) c, 3) a, 4) c, 5) b, 6) d, 7) b, 8) a, 9) c, 10) a, 11) a, 12) a, 13) c, 14) c, 15) d, 16) c, 17) d, 18) c, 19) c, 20) a, 21) b, 22) a, 23) d, 24) b, 25) a, 26) d, 27) d, 28) c, 29) c, 30) a, 31) d, 32) b, 33) e, 34) b, 35) d, 36) a, 37) d, 38) b.

వంశధార నిర్వాసితులపై లాఠీఛార్జీ దుర్మార్గం

ఏపిరైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వంశధార ప్రాజెక్టు కింద భూములు కోల్పోయి 2013 చట్టం ప్రకారం నష్ట పరిహారం కోరుతూ ఆందోళన చేస్తున్న బాధితులపై లాఠీఛార్జి దుర్మార్గమైన చర్యని ఎపి రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నష్ట పరిహారం ఇవ్వకపోగా పనులు అడ్డుకున్నారనే సాకుతో లాఠీఛార్జి చేయడం టిడిపి ప్రభుత్వ నిరంకుశత్వ వైఖరిని బయట పెట్టిందని తెలిపారు. నిత్యం రైతులు గురించి మాట్లాడే చంద్రబాబు ప్రభుత్వం వంశధార, పురుషోత్తపట్నం, పోలవరం, గండికోట ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయకపోగా అనుచితంగా ప్రవర్తిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వంశధార నిర్వాసితులతో చర్చలు జరిపి 2013 చట్టం ప్రకారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

రెండో రోజూ ముఠా కార్మికుల సమ్మె

ప్రజాశక్తి- కొత్తవలస (విజయనగరం జిల్లా)

పెరిగిన ధరలకనుగుణంగా పీసు రేట్లు పెంచాలని కోరుతూ ముఠా కార్మికులు చేస్తున్న సమ్మె రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా గురువారం కొత్తవలస జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు కొత్తవలస డివిజన్ కార్యదర్శి దేగల అప్పలరాజు మాట్లాడుతూ.. సమస్యను సానుకూలంగా పరిష్కరించి ముఠా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్మికుల పొట్టగొట్టే విధంగా యాజమాన్యం లారీల్లోని బస్తాలను పోటీ కార్మికులతో అన్‌లోడింగ్ చేయిస్తుండటం అన్యాయమన్నారు. సమ్మె విచ్ఛిన్నానికి వర్తక సంఘం అనేక ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రోహిత్ వేముల కేసు పక్కదారి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల కేసును రూపన్‌వాల్ కమిటీ పక్కదారి పట్టించిందని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలిపారు. గురువారం కర్నూలు నగరంలోని సుందరయ్య భవన్‌లో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజశేఖర్, ఎండి.ఆనంద్‌బాబులతో కలిసి మాల్యాద్రి మాట్లాడారు. కేంద్రమంత్రులు దత్తాత్రేయ, స్మృతి ఇరానీలతోపాటు విసి అప్పారావును కాపాడే విధంగా విచారణ కమిటీ నివేదికలో పేర్కొందని తెలిపారు. రోహిత్ వేముల దళితుడే కాదని విచారణ కమిటీ నివేదించడం అన్యాయమని పేర్కొన్నారు. రోహిత్ వేముల వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నారంటూ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందన్నారు. గతంలో ఎస్సీ జాతీయ కమిషన్‌తోపాటు జిల్లా కలెక్టర్ విచారణలో రోహిత్ వేముల దళితుడని నిర్ధారిస్తే రూపన్‌వాల్ కమిటీ మళ్లీ దళితుడు కాదని తప్పుడు నివేదిక ఇచ్చిందని తెలిపారు. ఈ కమిటీ రోహిత్ వేముల చనిపోయిన అంశంతోపాటు యూనివర్సిటీలో కులవివక్ష ఉందా లేదా అన్నదానిపై విచారించకుండా తప్పుడు నివేదికను అందజేసి కేసును పక్కదారి పట్టించిందని తెలిపారు.

కబేళాకు అనుమతి నిరాకరణపై రాష్ట్రస్థాయి ఉద్యమం

ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా కేంద్రంలోని కబేళా కొనసాగింపునకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడం అన్యాయమని, దీనిపై రాష్ట్ర స్థాయి ఉద్యమం నిర్మిస్తామని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. మతప్రాతిపదికన పాలిస్తున్న బిజెపి బండారాన్ని బయటపెడతామని పేర్కొన్నారు. 'కబేళాను తెరిపించాలి-దళిత, ముస్లిం మైనార్టీల ఉపాధి పునరుద్ధరించాలి' అనే అంశంపై కెవిపిఎస్, ముస్లిం మైనార్టీ సంఘం ఆధ్వర్యాన విజయనగరంలోని ఎన్‌పిఆర్ భవన్‌లో గురువారం సదస్సు జరిగింది. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ.. కబేళా మూతబడటంతో దీనిపై ఆధారపడిన వెయ్యిమంది దళితులు, ముస్లిములు ఉపాధి కోల్పోయారన్నారు. దీనిపై సిఎంను కలుస్తామన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ 150 ఏళ్లగా లేని సమస్య ఇప్పుడు ఎందుకు? ఏ రూపంలో వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1. కోబాల్ట్- క్రోమియం
2. 154
3. టియు-142
4. 35ఏ
5. రోహిత్ శర్మ

కొనసాగుతున్న డాక్ సేవక్‌ల సమ్మె



తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగిలో పోస్టాఫీసు వద్ద ధర్నా నిర్వహిస్తున్న డాక్‌సేవక్‌లు

ప్రజాశక్తి యంత్రాంగం

గ్రామీణ డాక్ సేవక్ (జిడిఎస్)లు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. ఢిల్లీలో బుధవారం రాత్రి నిర్వహించిన చర్చలు విఫలమైన నేపథ్యంలో సమస్య పరిష్కారమయ్యే వరకూ ఆందోళన చేస్తామని డాక్ సేవక్ సంఘ నాయకులు స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో గురువారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. సమ్మెలో భాగంగా అమలాపురం, రాజవొమ్మంగి, పెద్దాపురం, జగ్గంపేట పోస్టాఫీసుల వద్ద ధర్నాలు చేశారు. జిడిఎస్‌లకు ఎనిమిది గంటలు పని దినాలు కల్పించాలని, రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, టార్గెట్ల పేరుతో వేధింపులు ఆపాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె పశ్చిమగోదావరి జిల్లాలో గురువారం రెండోరోజూ కొనసాగింది. ఆయా మండల కేంద్రాల్లో, సబ్ పోస్టాఫీసుల వద్ద ఉద్యోగులు ధర్నాలు చేశారు. ఆందోళనలకు సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపారు.

విజయవాడ తపాలా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ తపాలా పశ్చిమ డివిజన్ పరిధిలోని 700 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. కృష్ణాజిల్లాలోని గుడివాడ, నూజివీడు, బందరు, గుడివాడ, నందిగామ, తిరువూరు, పెడన, ఉయ్యూరు, అవనిగడ్డ, పామర్రుల్లో తపాలా ఉద్యోగులు సమ్మెను కొనసాగించారు. నూజివీడు, తిరువూరు, మచిలీపట్నంలో సిఐటియు నాయకులు సంఘీభావాన్ని తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె రెండో రోజుకు చేరింది. కార్యక్రమంలో అమృతలూరు, కొల్లిపర, వేమూరు, భట్టిప్రోలు, రేపల్లె, కూచినపూడి, చుండూరు, చేబ్రోలు, చెరుకుపల్లి ఉద్యోగులు పాల్గొన్నారు. కర్నూలులో తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె రెండోరోజుకు చేరుకుంది. తపాలా ఉద్యోగుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేసింది. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఉపాధ్యక్షులు కె.రాజగోపాల్ సమ్మె శిబిరాల దగ్గరకు వెళ్లి మద్దతు తెలియజేశారు.

అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబూరావు డిమాండ్

ప్రజాశక్తి-రంపచోడవరం (తూర్పుగోదావరి)

మన్యంలో గిరిజనుల పోడు భూములకు రక్షణగా ఉన్న అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబూరావు విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరంలో గిరిజన సంఘం డివిజన్ అధ్యక్షులు సింగిరెడ్డి అచ్చారావు అధ్యక్షతనగురువారం సమావేశం నిర్వహించారు. సమావేశ నిర్ణయాలను అచ్చారావు పత్రికలకు విడుదల చేశారు. అంతకుముందు సమావేశంలో డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ.. గిరిజనుల పోడు భూములకు రక్షణగా ఉన్న అటవీ హక్కుల చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములకు హక్కుపత్రాలు మూడేళ్లుగా మంజూరు చేయడంలేదన్నారు. మారేడుమిల్లి మండలం చట్లవాడ పంచాయతీ ఉక్కులూరు, కొత్తవీధి గ్రామాల్లో 2000 సంవత్సరానికి ముందు నుంచీ స్థానికంగా నివాసం ఉండి పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులతో ఫారెస్టు అధికారులు పలు రకాలుగా ఘర్షణ పడుతున్నారని తెలిపారు. ఈ విషయాలను ఉన్నతాధికారులు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. రెవెన్యూ అధికారులను గిరిజనులు ఆశ్రయిస్తే తమ పరిధి కాదంటూ తప్పించుకుంటున్నారని విమర్శించారు. సమావేశం ఈ దిగువ నిర్ణయాలు చేసింది. 2005 అటవీ హక్కుల చట్టం ప్రకారం సర్వే చేసి ఐటిడిఎ ద్వారా హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. మారేడుమిల్లి నుంచి పాత కోటగ్రామం వరకూ రోడ్డు నిర్మించి గిరిజనులకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కోరింది. కార్యక్రమంలో గిరిజన సంఘం డివిజన్ కార్యదర్శి కె.బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే సీమలో కరువు : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పాలకుల నిర్లక్ష్యంతోనే రాయలసీమలో కరువు కరాళనృత్యం చేస్తోందని సిపిఎం రాయలసీమ అభివృద్ధి సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు పేర్కొన్నారు. గురువారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో కరువు సమస్యలపై సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు రాయలసీమ అభివృద్ధి కమిటీ కన్వీనర్ జి.ఓబులు హాజరై మాట్లాడారు. రాయలసీమలో కరువు విలయతాండవం చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో 296 మండలాల్లో రాయలసీమలోనే 181 మండలాలు ఉన్నాయని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. కరువు నేపథ్యంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రతి రైతు కుటుంబానికి రూ.5 వేలు పింఛను ఇవ్వాలన్నారు. జిల్లాలో కరువు పరిస్థితులపై ఆగస్టు 16 నుంచి 31వ తేదీ వరకు ప్రచార కార్యక్రమాలు, సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు నిరుద్యోగుల సమస్యల పరిష్కారం, భృతి ఇచ్చేందుకు పోరాటాలు, 26, 29వ తేదీల్లో రైతులతో ఆందోళనలు, సెప్టెంబరు 31న మండల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ నాయకులు బిహెచ్.రాయుడు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి పచ్చికాపల్లం మహాభారతం

- అందరి ఆమోదంతో నిర్ణయం
- ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం



వెదురుకుప్పం మండల కార్యాలయంలో ఆర్‌డిఓ కోదండరామిరెడ్డి సమక్షంలో చర్చించి తేదీలను ప్రకటిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగాచర్చనీయాంశమైన పచ్చికాపల్లం మహాభారతం శాంతి కమిటీ ద్వారా ఓ కొలిక్కి వచ్చింది. కెవిపిఎస్, ప్రజాసంఘాల వత్తిడి మేరకు కలెక్టర్ ప్రద్యుమ్న, ఎస్‌పి రాజశేఖర్‌బాబు జోక్యం చేసుకున్నారు. మహాభారతం ఉత్సవాలను జరిపించాలని ఆదేశాలు జారీ చేయడంతో చిత్తూరు ఆర్‌డిఓ కోదండ రామిరెడ్డి సమక్షంలో సెప్టెంబర్ 1 నుంచి జరపాలని నిర్ణయించారు. 10న ద్రౌపది అగ్నిగుండం, 11న ధ్వజావరోహణంతో మహాభారతం ముగియనుంది. ఈ మేరకు ధర్మకర్తల మండలి నిర్వాహకులు మునిరత్నంరెడ్డి, గోవర్ధనరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, నాగరాజరెడ్డి, నరేష్‌రెడ్డి, గోవిందరెడ్డిలతో చర్చించి నిర్ణయించారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా అదనపు పోలీసు బలగాలను ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలను అమర్చాలని, మండలస్థాయి అధికారి పర్యవేక్షణలో ఉత్సవాలు జరపాలని తీర్మానించారు. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం మహాభారతంలో గత ఏడాది ఆగస్టు 31న బండికుంభాలను దళితులు కట్టరాదని, పొంగళ్లు పెట్టరాదని, అగ్నిగుండ ప్రవేశం చేయరాదని ఆంక్షలు విధించారు. మహాభారతంలో వివక్షను ప్రశ్నిస్తూ కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గత ఏడాదిగా ఆందోళన చేశారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం వచ్చే ఏడాది జరిగే మహాభారతం కలిసి జరిపేలా శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. దళితులతో కలిసి మహాభారతం జరిపేందుకు పెత్తందారులు అంగీకరించకుండా ఉత్సవాలను నిలిపేసేందుకు ప్రయత్నించారు. దళితుల వత్తిడి మేరకు కలెక్టర్ ప్రద్యుమ్న, ఎస్‌పి రాజశేఖర్‌బాబు స్పందిస్తూ శాంతి కమిటీ ద్వారా అంగీకారానికి వచ్చారు. దళితులతో కలిసే మహాభారతం జరపాలని నెలరోజుల క్రితం ఒప్పందం కుదిరింది.. మళ్లీ పెత్తందారులు తాత్సారం చేస్తూ తేదీలను ప్రకటించకపోవడంతో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, శాంతి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చిత్తూరు ఎస్‌పి రాజశేఖర్‌బాబును బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆర్‌డిఓ వెదురుకుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించి సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి జరపాలని నిర్ణయించారు. ఎస్‌పిని కలిసిన వారిలో ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులురెడ్డి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.సుబ్రమణ్యం, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌పిఐ రాష్ట్ర కార్యదర్శి అంజయ్య, డిహెచ్‌పిఎస్ నాయకులు పెంచులయ్య ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించండి

మున్సిపల్ కార్మికుల దీక్షలో సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తూ కార్మికవర్గానికి ద్రోహం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రతిఘటించాలని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. గురువారం విజయవాడ ధర్నా చౌక్‌లో మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలను ఆమె ప్రారంభించారు. ఈ దీక్షలో హేమలత మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతరం పౌర సేవల కోసం పాటుపడుతున్న మున్సిపల్ కార్మికుల ఉపాధికి ఎసరుపెట్టడం దుర్మార్గమన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ పెట్టుబడిదారీ వర్గానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయకుండా ప్రభుత్వాలు దగా చేస్తున్నాయన్నారు. 279 జిఒ రద్దు, ఉద్యోగ భద్రత కోసం సమైక్యంగా పోరాడుతున్న ఎపి మున్సిపల్ కార్మికులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, మున్సిపల్ జెఎసి నాయకులు కె.ఉమామహేశ్వరరావు, ఎ.రంగనాయకులు, ఎం.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


సహకార బ్యాంకుల విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సహకార బ్యాంకుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు గుంటూరులోని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 2014 జూన్ 2 నుంచి ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 60కి పెంచిందని, ఈ అవకాశాన్ని తమకూ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం నాయకులు పాటిబండ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ ఉద్యోగులందరినీ 58 ఏళ్లకే ఉద్యోగ విరమణ చేయించి ఈ ఏడాది జూన్‌లో తిరిగి ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 60 ఏళ్లకు పెంచారని పేర్కొన్నారు. అన్ని జాతీయ బ్యాంకుల్లో అటెండర్లకు ఉద్యోగ విరమణ వయో పరిమితి 60 ఏళ్ల వరకే ఉండగా సహకార బ్యాంకుల్లో 62 ఏళ్లకు పెంచారని తెలిపారు. తమ విజ్ఞాపనను పట్టించుకోకుండా మూడేళ్లపాటు కాలయాపన చేసి ఇప్పుడు వయో పరిమితిని పెంచారని, ఈ సదుపాయాలు గత మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేసిన వారికీ వర్తింపజేయాలని కోరారు.

కాపులపై ఎన్ని రోజులు కక్షసాధిస్తారు?

పాదయాత్రకు అనుమతించకపోతే నేటి నుంచి రోజంతా బైఠాయింపు



నల్లచొక్కాలతో నిరసన తెలుపుతున్న కాపు జెఎసి నాయకులు

ప్రజాశక్తి - కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)/కాకినాడ

కాపులకు రిజర్వేషన్లు కల్పించకుండా, పాదయాత్రకు అనుమతి ఇవ్వకుండా తమపై ఎన్నిరోజులు కక్షసాధిస్తారని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం పోలీసులను ప్రశ్నించారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో గురువారం తన అనుచరులతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రకు అనుమతిలేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. '23 రోజులుగా పాదయాత్రకు అనుమతి ఇవ్వకుండా, కనీసం మేము అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఇంట్లోనే బంధిస్తారా? ఇదేం రాక్షసపాలన' అంటూ ముద్రగడ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల కోసం పోరాడుతుంటే చంద్రబాబు కొంతమంది నాయకులతో సమావేశాలు పెట్టి విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. పాదయాత్రకు అనుమతివ్వకుంటే శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ గేటువద్దే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపడతామన్నారు. త్వరలో చంద్రబాబుకు బుద్ధి చెప్పడానికి కాపులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నల్లచొక్కాలతో కాపు నేతలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపుజెఎసి నేతలు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, ఆరేటి ప్రకాష్, గౌతు స్వామి, కిర్లంపూడి సర్పంచ్ పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ కాపులను మోసగిస్తున్నాడు : చిన్న రాజప్ప

ముద్రగడ పద్మనాభం కాపులను మోసగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఎన్.చినరాజప్ప అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులను బిసిల్లో చేరుస్తామని టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టామని, అందులో భాగంగానే మంజునాథ్ కమిషన్ వేశారని చెప్పారు. ఈ విషయంపై కేబినెట్‌లోనూ చర్చించామన్నారు. ఈ నివేదిక త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన కాపు సమావేశంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారని చెప్పారు. బిసిలకు ఇబ్బంది లేకుండా కాపులకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కిమిడి కళా వెంకట్రావు, జిల్లా అధ్యక్షులు నామన రాంబాబు, ఎంఎల్‌సిలు వివిఎస్ చౌదరి, చిక్కాల రామచంద్రరావు, ఎంఎల్‌ఎ పెందుర్తి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన సలహా మండలిని ఏర్పాటు చేయాలి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్మికులకు కనీస వేతన సలహా మండలిని ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలన్నీ సంయుక్తంగా డిమాండ్ చేశాయి. కార్మిక సమస్యల పరిష్కారం కోసం అన్ని సంఘాలతో ఐక్య ఉద్యమం చేపట్టాలని నిర్ణయించాయి. విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన ఈ సమావేశ నిర్ణయాలను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ ఒక ప్రకటనలో తెలిపారు. కనీస వేతనాల సలహా మండలిని ఏర్పాటు చేస్తామని జులై 10న సచివాలయంలో జరిగిన ఆల్ ట్రేడ్ యూనియన్స్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ నెల రోజులైనా ఆ ప్రకటన అమలు కాలేదని ఆయన విమర్శించారు. సలహా మండలిని ఏర్పాటు చేయడంలో తాత్సారం తగదని, తక్షణమే అన్ని కార్మిక సంఘాలతో సలహా మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆగస్టు 8న జరిగిన అఖిల భారత కార్మిక సంఘాలు, స్వతంత్ర కార్మిక ఫెడరేషన్ల సంయుక్త సమావేశం పిలుపు మేరకు కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి నాయకులు జి వరప్రసాద్, ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రామారావు, జి ఓబులేసు, సిఐటియు ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, టియుసిసి ప్రధాన కార్యదర్శి పివి సుందర రామరాజు, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పొలారి, వైఎస్‌ఆర్‌టియు అధ్యక్షులు పి గౌతం రెడ్డి, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి రామారావు, సిఐటియు రాష్ట్ర ఆఫీసు బేరర్లు పి అజయ్ కుమార్, ఎవి నాగేశ్వరరావు, కె ధనలక్ష్మి, కె ఉమామహేశ్వరరావు, కె సుబ్బరావమ్మ, ముజుఫర్ అహ్మద్‌లు పాల్గొన్నారు.

విష వాయువులు వెదజల్లే ఆక్వా పరిశ్రమలను మూసేయాలి

రైతు సంఘం, వ్య.కా.సం, కౌలురైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

విష వాయువులను వెదజల్లుతూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న ఆక్వా ప్రాసెసింగ్ పరిశ్రమలను తక్షణం మూసేయాలని రైతుసంఘం, వ్య.కా.సం, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక ప్రజలను, రైతులను సమీకరించి 24న ఆయా పరిశ్రమల పైపులను మూసేస్తామని హెచ్చరించారు. స్థానిక రామచంద్రారెడ్డి భవనంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సాయి ఆగ్రో మైరెన్ ఎక్స్‌పోర్ట్సు, స్టార్ ఆగ్రో, ఫైవ్‌స్టార్ ఆగ్రో, డిఎస్ టెక్నోపీట్ వంటి ఆక్వా పరిశ్రమలు విడుదల చేసే వ్యర్థాలు, విష వాయువులతో నేడు కాలుష్య కోరల్లో చిక్కుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని డేవిస్‌పేటతో పాటు పలు గ్రామాలను తాము పరిశీలించామన్నారు. ఆయా పరిశ్రమలను తక్షణం మూసేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము 24వ తేదీన పరిశ్రమలను ముట్టిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పులిగండ్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



బస్వరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సుబ్బారావు

బస్వరాజు ఆశయ బాటలో ముమ్ముందుకు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల పిలుపు

ప్రజాశక్తి-పెద్దాపురం (తూర్పుగోదావరి)

సమసమాజ స్థాపన కోసం పోరాడుతూ పోలీసుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన బొమ్మన బస్వరాజు ఆశయ బాటలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు కోరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఉద్యమ నేతలకు కొరియర్‌గా పనిచేసి పోలీసుల చిత్రహింసలకు బలైన బొమ్మన బస్వరాజు 67వ వర్ధంతి సందర్భంగా స్థానిక సినిమా హాలు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి దడాల గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ పెద్దాపురంలో చేనేత కార్మిక నేతగా అనేక పోరాటాలకు బస్వరాజు నాయకత్వం వహించారని తెలిపారు. చేనేత ఉద్యమాన్ని జిల్లావ్యాప్తంగా విస్తరింపచేశారన్నారు. తెలంగాణ పోరాట కాలంలో రహస్య జీవితంలో ఉన్న పోరాట నేతలకు కొరియర్‌గా పనిచేశారన్నారు. పోలీసుల చేతికి చిక్కి చిత్రహింసలకు గురై మృతి చెంది ఉద్యమవీరుడిగా ప్రజల్లో మిగిలిపోయారన్నారు. కార్యక్రమంలో పలువురు డివిజన్ నాయకులు పాల్గొన్నారు. బస్వరాజు త్యాగాలపై ప్రజానాట్య మండలి కళాకారులు ఉద్యమ గీతాలను ఆలపించారు.



విజయవాడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ధర్నా

'ఆది' వ్యాఖ్యలపై కొనసాగుతున్న నిరసనలు

విజయవాడలో ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి యంత్రాంగం

దళితులపై మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. గురువారం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్ మాట్లాడుతూ.. దళితులు చదువుకోరు, గలీజుగా ఉంటారని అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డిని రాష్ట్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీకీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకూ దళితులంటే అంటరాని వారిగా ఉన్నారన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యాన కాగితాలపై ఉన్న మంత్రి ఫొటోలను దహనం చేశారు. కృష్ణాజిల్లా పామర్రు సెంటరులో దళిత గిరిజన హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గుంటూరు జిల్లా కొల్లూరులో వైసిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. చెరుకుపల్లిలో దళిత రాజ్యం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెనాలి గాంధీచౌక్‌లో అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి ప్లెక్సీని దహనం చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. భట్టిప్రోలులో వైసిపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, దిష్టిబొమ్మను దహనం చేశారు. రేపల్లెలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ దళిత సంఘాల ఆధ్వర్యాన ఉక్కు ట్రైనింగ్ సెంటర్ వద్ద ధర్నా చేశారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం గడియార స్తంభం వద్ద, పి.గన్నవరం సెంటర్‌లో వైసిపి ఆధ్వర్యాన మంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఏలేశ్వరం బాలాజీచౌక్ సెంటర్‌లో రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా నిడమర్రులో అంబేద్కర్ సెంటర్ వద్ద కెవిపిఎస్, వ్యవసాయ సంఘం ఆధ్వర్యాన మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. నరసాపురంలో వివిధ దళిత సంఘాల ఆధ్వర్యాన మానవహారం నిర్వహించి, దిష్టిబొమ్మను తగులబెట్టారు. కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో వైసిపి ఆధ్వర్యాన ధర్నా చేశారు. వీరవాసరంలో నిరసన తెలిపారు. కర్నూలులో ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో మంత్రి డౌన్‌డౌన్ అంటూ బేతంచెర్ల పాతబస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహించారు.

ఆరెస్సెస్ చీఫ్‌పై చర్యలు

కేరళ అసెంబ్లీలో సిఎం పినరయి విజయన్

తిరువనంతపురం: కేరళ ప్రభుత్వ ఆదేశాలు ధిక్కరించి జెండా ఎగురవేసి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్‌పై చర్యలు తీసుకునేందుకు న్యాయ సలహా కోరతామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. కలెక్టర్, విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని శాసనసభలో గురువారం ఆయన ప్రకటించారు. పాలక్కడ్‌లోని ఓ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున మోహన్ భగవత్ జెండా ఎగురవేశారు. అయితే ఉపాధ్యాయులు లేదా ప్రజాప్రతినిధులు మాత్రమే జెండా ఎగురవేసేందుకు అర్హులని కేరళ ప్రభుత్వం ఆగస్టు 3న అన్ని పాఠశాలలకు మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తూ మోహన్ భగవత్ జాతీయ జెండాను ఎగురవేశారు. అంతేగాక జాతీయ గీతానికి బదులు వందేమాతరం ఆలపించినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

త్రిపుర సిఎం ప్రసంగంపై దూరదర్శన్ అబద్ధాలు

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలనుద్దేశించి త్రిపుర సిఎం మాణిక్ సర్కార్ చేసిన ప్రసంగంపై దూరదర్శన్ సెన్సార్‌షిప్ విధించిందంటూ వచ్చిన వార్తలపై ప్రసారభారతి బుధవారం అబద్ధాలు వల్లెవేసింది. సిఎం ప్రసంగాన్ని ఆగస్టు 15వ తేదీన రాత్రి ఏడు గంటలకు ప్రసారం చేసినట్లు తెలిపింది. ఆగస్టు 12న రికార్డు చేసిన మాణిక్ సర్కార్ ప్రసంగాన్ని యథాతథంగా ప్రసారం చేయలేమనీ, స్వల్పంగా మార్పులు చేస్తే ప్రసారం చేస్తామని దూరదర్శన్ చెప్పినట్లుగా త్రిపుర సిఎం పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే మాణిక్ సర్కార్ ప్రసంగంలో మార్పులకు నిరాకరించారు. దీంతో ఆ ప్రసంగాన్ని దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో(ఎఐఆర్)లు ప్రసారం చేయలేదు. అయితే ఇంతలోనే ఆ వివాదం రచ్చకెక్కడంతో సాయంత్రం ఏడు గంటలకు ఆ ప్రసంగాన్ని దూరదర్శన్ ప్రసారం చేసింది. ఈ వివాదంపై అగర్తలా దూరదర్శన్ కార్యాలయం చీఫ్ యుకె సాహూ వివరణ ఇస్తూ "12 నిమిషాల ప్రసంగాన్ని సాయంత్రం ఏడు గంటలకు ప్రసారం చేశాం. ఆగస్టు 15న ముఖ్యమంత్రి పాల్గొన్న అన్ని కార్యక్రమాలకు కవరేజ్ ఇచ్చాం" అని చెప్పుకొచ్చారు. మరోవైపు ప్రసారభారతి చెప్పినట్లుగా ఆ సమయంలో మాణిక్ సర్కార్ ప్రసంగం ప్రసారం కాలేదని త్రిపుర ప్రభుత్వం తెలిపింది. దూరదర్శన్ రికార్డు చేసిన మాణిక్ సర్కార్ ప్రసంగం ఆరు నిమిషాలే ఉందని, కానీ 12 నిమిషాల నిడివి ప్రసంగాన్ని ప్రసారం చేసినట్లు దూరదర్శన్ పేర్కొందని? అది ఎలా సాధ్యమని త్రిపుర ప్రభుత్వం ప్రసార భారతిని ప్రశ్నించింది.

ఎయిమ్స్ 'పేపర్ లీక్'పై కేసు నమోదు

ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన సిబిఐ

న్యూఢిల్లీ: ఎయిమ్స్‌లో ఎంబిబిఎస్ ప్రవేశాల కోసం ఈ ఏడాది నిర్వహించిన పరీక్షా పత్రాల లీక్ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఢిల్లీ హైకోర్టుకు సిబిఐ గురువారం తెలిపింది. ఈ ఏడాది మే 28న ఈ ప్రవేశ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ పరీక్షా కేంద్రంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. హెచ్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అనే పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెలువడిన స్క్రీన్‌షాట్స్‌లోని కొన్ని ప్రశ్నలు షిఫ్ట్-2లో వచ్చిన సెట్-3 పరీక్షా పత్రంలో ప్రత్యక్షమైనట్లు కొంతమంది విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ప్రత్యేకించి కొంతమంది విద్యార్థులకు ఒకే ప్రశ్నలు వచ్చినట్లుగా కూడా వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలయ్యాయి. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హైకోర్టు చీఫ్ జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ సి హరి శంకర్‌లతో కూడిన ధర్మాసనానికి సిబిఐ తెలిపింది.

జయలలిత మృతిపై న్యాయవిచారణ

ఆదేశించిన పళనిస్వామి ప్రభుత్వం

స్వాగతించిన పన్నీర్ సెల్వం

చెన్నయ్: తమిళనాడు మాజీ సిఎం జయలలిత మృతిపై న్యాయవిచారణకు పళనిస్వామి ప్రభుత్వం గురువారం ఆదేశించింది. పళనిస్వామి నిర్ణయాన్ని మాజీ సిఎం పన్నీర్ సెల్వం స్వాగతించారు. గతేడాది డిసెంబరులో చెన్నయ్‌లోని అపోలో అసుపత్రిలో ఆమె మరణించించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆమె మృతిపై మాజీ సిఎం పన్నీర్ సెల్వం సహా పలువురు నేతలు, ప్రముఖులు సందేహాలు వ్యక్తం చేశారు. అయితే ఇన్నాళ్లూ మౌనం వహించిన ప్రభుత్వం ఇప్పటికిప్పుడు దర్యాప్తునకు ఆదేశించడానికి రాజకీయ కారణాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అన్నా డిఎంకెలో చీలిక గ్రూపులు మళ్లీ కలవనున్నట్లు వార్తలొచ్చిన నేపథ్యంలోనే న్యాయవిచారణకు పళనిస్వామి ఆదేశించినట్లు తెలుస్తోంది. పన్నీర్ సెల్వం గ్రూపు డిమాండ్లలో జయలలిత మృతిపై దర్యాప్తు ప్రధానమైన అంశంకాగా, అన్నాడిఎంకె నుంచి బహిష్కరణకు గురైన దినకరన్ ఇటీవల 20 మంది పార్టీ ఎమ్మెల్యేలతో మధురైలో మద్దతుదారుల యాత్ర నిర్వహించడం మరో కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఏపి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు

ఏపి కాంగ్రెస్ మైనార్టీ సెల్ మాజీ కన్వీనర్ సయ్యద్ ఆరిఫుద్దీన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉన్నత విద్యనభ్యసించేందుకు మైనార్టీలకు నిధులు మంజూరు చేస్తామని ఏపి ప్రభుత్వం ప్రకటించినా సంబంధిత నిధులను ఇంకా విడుదల చేయలేదని రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ మాజీ కన్వీనర్ సయ్యద్ ఆరిఫుద్దీన్ పేర్కొన్నారు. గురువారం నాడు ఆయనిక్కడ జుమ్మా మసీద్ షాహి ఇమాం సయ్యద్ బుఖారీని కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాలోని పలు మైనార్టీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని ఆరిఫ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారిస్తామని ఆయన తెలిపినట్లు ఆరిఫ్ చెప్పారు. విద్యా రంగంలో ఏపి ప్రభుత్వం మైనార్టీలకు మంజూరు చేసిన నిధులు ఇంకా అందలేదని, ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లిన మైనార్టీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరిఫ్ తెలిపారు.

మాలేగావ్ కేసులో తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : 2008 నాటి మాలేగావ్ పేలుళ్ల కేసులో నిందితుడు లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్‌కు మధ్యంతర బెయిల్‌కు సంబంధించి తీర్పును సుప్రీం కోర్టు రిజర్వు చేసింది. ఆర్.కె. అగర్వాల్, ఎ ఎం సప్రేలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ కేసును విచారించింది. ఈ కేసులో పురోహిత్ తరపున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే హాజరయ్యారు. తొమ్మిదేళ్లుగా పురోహిత్ జైల్‌లో ఉన్నాడని అయితే ఆయనకు వ్యతిరేకంగా ఎలాంటి చార్జీలు నమోదు కాలేదనీ పురోహిత్‌కు వ్యతిరేకంగా నమోదైన మోకా (ఎంసిఒసిఎ) అభియోగాలు కూడా తొలగిపోయినట్లు కోర్టుకు వివరించారు. పురోహిత్ మధ్యంతర బెయిల్‌కు అర్హుడేనని వాదించాడు. ఇక జాతీయ దర్యాప్తు బృందం (ఎన్ఐఎ) తరపున అదనపు సొలిసిటర్ జనరల్ మనీందర్ సింగ్ కోర్టుకు వాదనలు వినిపించాడు. పురోహిత్‌కు వ్యతిరేకంగా ఆధారాలున్నాయనీ, బెయిల్‌ను నిరాకరించాలని కోరారు. ఈ కేసును కోర్టు అక్టోబరు 10కి వాయిదా వేసింది. బొంబె హైకోర్టు బెయిల్‌ను తిరస్కరించడంతో సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారు. 2008 సెప్టెంబరు 29న నాసిక్ జిల్లాలోని మాలేగావ్‌లో బాంబు పేలుడు ఘటనలో ఏడుగురు వ్యక్తులు మృతిచెందారు. దీంతో (మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజుడ్ క్రైం యాక్ట్) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఠాకూర్ పురోహిత్‌తోపాటు స్వామి దయానంద పాండే కూడా నిందితులుగా ఉన్నారు.

ఆర్మీకి హెలికాప్టర్‌లు

ఆరు ఆపాచ్ హెలికాప్టర్‌ల కొనుగోలుకు మార్గం సుగమం

న్యూఢిల్లీ: సైన్యానికి సేవలందించడానికి ఆరు అపాచి హెలికాప్టర్‌లు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2021 నాటికి ఇవి అందుబాటులోకి వస్తాయని కేంద్రం భావిస్తోంది. ఎయిర్ ఫోర్స్ విభాగంలో ఇతరులపై ఆధార పడాన్ని తగ్గించుకోవడానికి ఆర్మీ సిద్ధమౌతోంది. యుఎస్ నిర్మించిన ఆరు అపాచి హెలికాప్టర్‌లను కొనుగోలు చేయనుంది. వచ్చే ఆరు నెలలో రూ.4,170 కోట్లు కేటాయించడానికి సిద్ధమైంది. ఈ కొనుగోలుకు ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. తొలిసారిగా సొంతగా దాడి చేయగల సామర్థ్యాన్ని పెంపొందించుకుంటున్నది. 2015లో భారత్ 22 అపాచి 15 లిఫ్టు చినోక్ హెలికాప్టర్‌ను బోయింగ్ సంస్థ నుంచి కొనుగోలు చేసింది. అయితే ఈ కొత్త ఒప్పందంలో ఇతర సామాగ్రీ విడిభాగాలు, శిక్షణా ఆయుధాలు తదితరాలు కూడా ఉంటాయి.

భిన్నత్వంలో ఏకత్వమే భారతీయత

- సమ్మిళిత నాగరికతను కాపాడుకోవడమే మన బాధ్యత
- ప్రతిపక్షాల సమావేశంలో ఏచూరి



న్యూఢిల్లీ : సమ్మిళితమైన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. జెడియు తిరుగుబాటు నేత శరద్ యాదవ్ న్యూఢిల్లీలో గురువారం నిర్వహించిన ప్రతిపక్షాల నేతల సమావేశానికి 16 పార్టీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సిపిఎం నుంచి సీతారాం ఏచూరి, కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ హాజరయ్యారు. ఫేస్‌బుక్‌లోని తన పేజీలో ఏచూరి ఈ మేరకు ఒక పోస్టు షేర్ చేశారు. తమ సమావేశ ఉద్దేశం ఎన్నికల పోరాటం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రమాదంలో పడిన భిన్నత్వంతో కూడిన భారత సంస్కృతి, ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయాలను రక్షించుకోవడానికి తామంతా ఒకే వేదికపైకి వచ్చినట్లు ఆయన తెలిపారు. భారతదేశం విభిన్న సంస్కృతీ, సంప్రదాయాల సమ్మేళనమని, అదే ప్రపంచంలో భారతదేశాన్ని వైవిధ్యంగా నిలబెడుతోందని ఏచూరి పేర్కొన్నారు. మనం ఎవరిని ప్రారిస్తున్నా, ఏ రకమైన దుస్తులు ధరిస్తున్నా, మన జీవిత భాగస్వామి ఎవరైనా, మన కులమేదైనా, ఏ భాష మాట్లాడుతున్నా..ఇంకా ఏదైనా సరే భిన్నత్వమున్నా మనమంతా ఐక్యమత్యంతో ఉండటమే భారతీయతకు అసలైన నిర్వచనమని ఆయన అన్నారు. మనమంతా కూడా ఎంతో వైవిధ్యమైన, అరుదైన సంస్కృతి సాంప్రదాయాలు, నాగరికత కలిగియున్నవారిమేనని అదే ఇండియా అని అదే భారత్ అని ఏచూరి అన్నారు. స్వీయ ప్రయోజనాల కోసం సంకుచితత్వ అజెండాను బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్న శక్తుల దాడుల నుంచి ఈ సమ్మిళిత నాగరికతను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

ప్రజలకు నిజమైన భారత్ కావాలి

2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ గురువారం విమర్శించారు. ప్రధాని మోడీకి స్వచ్ఛభారత్ కావాలని, అయితే ప్రజలు మాత్రం నిజమైన భారతదేశం కావాలని కోరుకుంటున్నారని అన్నారు. మోడీ ఎక్కడకు వెళ్లినా అబద్ధాలనే ప్రచారం చేస్తున్నాడన్నారు. దేశంలో భిన్న సంస్కృతిని కాపాండేందుకు ఢిల్లీలో జనతాదళ్ నేత శరద్‌యాదవ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రతిపక్షాలు సమావేశంలో రాహుల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ కార్యదర్శి డి.రాజా, ఇతర కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజరయ్యారు. ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందనీ, అయితే దేశంలో లభించే వస్తువులు ఎక్కువగా చైనా, ఇతరదేశాల నుంచే వస్తున్నాయని రాహుల్ విమర్శించారు. నల్లధనాన్ని వెనక్కు తెప్పించడం, యువతకు ఉపాధి కల్పించడం వంటి హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాజ్యాంగంలోని మౌలిక అంశాలను మార్చడానికి ఆర్ఎస్ఎస్ కంకణం కట్టుకొందని విమర్శించారు. ' ఈ దేశం నాది అని ఒకరు చెబుతారు. నేను దేశానికి చెందిన వ్యక్తినని మరొకరు పేర్కొంటారు.' ఇదే ఆర్ఎస్ఎస్‌కు ఇతరులకు ఉన్న వ్యత్యాసమని రాహుల్ పేర్కొన్నారు.

దాడికి గురైన ఆధార్ డేటా

ఎన్ఐసి యాప్‌లో లోపాలు

న్యూఢిల్లీ : నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) 2015లో అభివృద్ధిపరిచిన ఇ-హాస్పిటల్ యాప్‌లో నెలకొన్న భద్రతాపరమైన లోపాలు, లొసుగులతో ఆధార్ డేటా దాడికి గురైందని అధికారులు తెలిపారు. వేలాదిమంది ఆధార్ నెంబర్లు, వ్యక్తిగత సమాచారం అంతా బయటకు పొక్కిందని చెప్పారు. ఈ యాప్‌ను విశ్లేషించిన భద్రతా నిపుణులు స్పందిస్తూ, ఎన్ఐసి సర్వర్లతో జరిగిన సంభాషణ లేదా సమాచారం ఎన్‌క్రిప్ట్ (కోడ్‌లోకి మారడం) అవడం లేదని కనుగొన్నట్లు తెలిపారు. అంటే ఎవరైనా పాస్‌వర్డ్‌ను కనుక్కొని, ఎన్ఐసి సర్వర్లను ఉపయోగించుకోవచ్చునని సాంకేతిక నిపుణుడు అన్విర్ అరవింద్ తెలిపారు. ఎన్ఐసి వారి ఇ-హాస్పిటల్ యాప్ నుండి వచ్చిన చట్టబద్ధమైన ఆధార్ డేటా అభ్యర్థనలకు, అనధికారమైన, ఫ్రీ ఆండ్రాయిడ్ యాప్ 'మై గవ్'కు మధ్య తేడాను యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) సర్వర్లు గుర్తించలేకపోవడంతో ఈ పొరపాటు జరిగింది. అభినవ్ శ్రీవాస్తవ అనే వ్యక్తి ఈ ఉచిత ఆండ్రాయిడ్ యాప్‌ను రూపొందించాడు. అయితే జులై 26న శ్రీవాస్తవను అరెస్టు చేసే సమయానికే ఆయన యాప్ 50వేల సార్లు డౌన్‌లోడ్ అయింది. ఇ-హాస్పిటల్ యాప్‌లో ఎక్కడైనా లోపం వుందని భావిస్తే వెంటనే వారు ఎన్ఐసికి ఫిర్యాదు చేయాలని, అప్పుడు ఇటువంటి పరిస్థితి తలెత్తడానికి అవకాశం వుండదని సంబంధిత అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. కాగా యుఐడిఎఐ మాత్రం దీనిపై వ్యాఖ్యానించలేదు. ఆధార్‌తో ముడిపడిన అనేక సంక్షేమ చర్యలకు, కార్యక్రమాలకు అవసరమైన సమాచారాన్ని ఎన్ఐసి అందచేస్తుంది.

స్పెయిన్‌లో 'ట్రక్కు' దాడి

ఇద్దరు మృతి



బార్సిలోనా: స్పెయిన్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. లండన్ బ్రిడ్జి దాడి తరహాలో బార్సిలోనాలో ప్రముఖ పర్యాటక ప్రాంతంమైన లా రాంబ్లాస్ ప్రాంతంలో ట్రక్కుతో విధ్వంసానికి పాల్పడ్డారు. ఓ వైపు పాదచారుల మీదకు ట్రక్కును పోనిస్తూ మరోవైపు కాల్పులతో వీరంగం సృష్టించారు. దీంతో ప్రజలు భయందోళనతో అటూ ఇటూ పరుగులు తీశారు. ట్రక్కు దాడిలో ఇద్దరు మరణించగా, చిన్నారులతో సహా 20 మంది గాయపడ్డారు. అయితే ఐసిస్ ఈ ఘటనకు పాల్పడి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్పెయిన్ మీడియా వెల్లడించింది. ప్రస్తుతం ఆయన్ని విచారిస్తున్నారని పేర్కొంది. అంతకుముందు ఘటనా స్థలానికి భద్రతా దళాలు చేరుకున్నలోపే ఆ ప్రాంతం నుంచి ఉగ్రవాదులు పరారయ్యారు. లా బకేరియా మార్కెట్‌కు సమీపంలోని ఓ రెస్టారెంట్‌లోకి వారు ప్రవేశించారని, అందులోవున్న వారిని బంధీలుగా తీసుకున్నారని భద్రతా దళాలు తెలిపాయి. దీంతో ఆ రెస్టారెంట్‌ను చుట్టుముట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లుగా అధికారులు వివరించారు. లా రాంబ్లాస్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో బస చేసిన ఇద్దరు వ్యక్తులు తెల్లని రంగులో ఉన్న ట్రక్కుతో మధ్యాహ్న సమయంలో దాడికి పాల్పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దాడి నేపథ్యంలో ప్రభుత్వ రవాణా సౌకర్యాలను వినియోగించొద్దని, బహిరంగ ప్రదేశాల్లో ఉండొద్దని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశాయి.

తీరు మారని యుపి సర్కారు

- సోమ, మంగళవారాల్లో మరో 34 మంది మృతి
- బాలల ప్రాణాలకు దమ్మిడి విలువ ఇవ్వని ప్రభుత్వం
- అత్యవసర సహాయ చర్యలు శూన్యం

గోరఖ్‌పూర్/న్యూఢిల్లీ : ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి 60 మంది చిన్నారులు మృత్యువాత పడిన వార్తలు ఇంకా కనుమరుగు కాక ముందే గడచిన సోమ, మంగళవారాల్లో మరో 34 మంది చిన్నారుల ఊపిరి ఆగిపోయినట్లు ఆస్పత్రి రికార్డులు చెబుతున్నాయి. ఇందులో సోమవారం ఒక్కరోజే 24 మంది చిన్నారులు తుది శ్వాస విడిచారని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పికె సింగ్ చెప్పారు. ఇందులో 15 మంది నియోనేటాల్ వార్డులోనూ, ఐదుగురు ఎన్‌సెఫలైటిస్ వార్డులోనూ, మరో నలుగురు ఇతర వార్డుల్లోనూ ప్రాణాలు కోల్పోయారని ఆయన వివరించారు. మరో పది మంది 10 మంగళవారం మరణించినట్లు ఆస్పత్రి రికార్డులు చెబుతున్నాయి. వీరిలో ఏడుగురు నియోనేటాల్ వార్డులోనూ, ముగ్గురు ఎన్‌సెఫలైటిస్ వార్డులోనూ మరణించారు. బుధవారం నాటి వివరాలు ఇంకా అందుబాటులోకి రాలేదు.

గోరఖ్‌పూర్ కేవలం ఉదాహరణ మాత్రమే..

యుపిలోని ప్రతిష్టాత్మక ఆస్పత్రుల్లో ఒకటైన బిఆర్‌డి ఆస్పత్రిలో గత వారం చోటు చేసుకున్న 70 మంది చిన్నారుల మృతి రాష్ట్రంలో శిశు ఆరోగ్య వ్యవస్థ దుస్థితిని స్పష్టం చేస్తోంది. యుపి తూర్పు ప్రాంతం కన్నా ఇతర ప్రాంతాలలో ఈ వ్యవస్థ మరింత అధ్వాన్న స్థితిలో వున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. యుపిలోని ఐదేళ్ల లోపు చిన్నారుల్లో దాదాపు సగం మంది పెరుగుదల నిలిచిపోయిన సంకేతాలు కన్పిస్తున్నాయి. కేవలం 50 శాతం మంది చిన్నారులకు మాత్రమే వ్యాధి నిరోధక టీకాలు అందాయి. దాదాపు 75 శాతం మంది తల్లులకు ప్రసవానంతర సేవలు అందుబాటులో లేవు. జాతీయ సగటుతో పోల్చుకుంటే పెరుగుదల నిలిచినపోయిన ఘటనలు 38.4 శాతం, చిన్నారుల వ్యాధి నిరోధక టీకాల పంపిణీ 62 శాతం మేర నమోదయింది. ఇవన్నీ యుపిలోని 71 జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వం 2015-16లో నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే -4లో వెల్లడయిన అంశాలే..



గోవా విమానాశ్రయ అధికారులపై హైకోర్టు ఆగ్రహం

- అమిత్ షా సమావేశానికి అనుమతిచ్చినందుకు చీవాట్లు



న్యూఢిల్లీ: గోవా విమానాశ్రయంలో బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్‌షా పార్టీ సమావేశానికి అనుమతించడంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జూలై 1న జరిగిన ఈ సమావేశానికి సంబంధించి డబోలిమ్ విమానాశ్రయంలో జరిగిన ఏర్పాట్లపై గోవా విమానాశ్రయ అధికారులకు కోర్టు చీవాట్లు పెట్టింది. భద్రతాపరంగా అత్యంత సున్నితమైన ప్రాంతంలో పార్టీ సమావేశాలు ఎలా జరుపుతారని నిర్వాహకులను పిటిషన్‌దారు ప్రశ్నించారు. ఈ సమావేశ నిర్వాహకులు దీనికి బాధ్యత వహించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. జస్టిస్ జిఎస్ పటేల్, నూతన సర్దేశాయ్‌లతో కూడిన ధర్మాసనం దీన్ని విచారించింది. ఇది అప్పటికప్పుడు జరిగిన సమావేశమంటూ అధికారులు ఇచ్చిన వివరణను తోసిపుచ్చింది. అంత అకస్మాత్తుగా పోడియం, రెడ్‌కార్పెట్లు, సోఫాలు, కుర్చీలు ఎక్కడ నుంచి తీసుకురాగలిగారని అధికారులను ధర్మాసనం ప్రశ్నించింది.

నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో సుప్రీం వేటు

- ఇద్దరు గుజరాత్ పోలీసు ఉన్నతాధికారుల రాజీనామా

న్యూఢిల్లీ : ఇష్రత్ జహన్, సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో సస్పెన్షన్ వేటుకు గురై ఇటీవల విధుల్లోకి చేరిన ఇద్దరు గుజరాత్ పోలీసు ఉన్నతాధికారులు ఎన్‌కె అమీన్, టిఎ బరోత్‌లపై మరోసారి వేటు పడింది. ఈ కేసులో వారి వాదనను విన్న సుప్రీంకోర్టు గురువారం వారి రాజీనామాకు ఆదేశించింది. "తక్షణమే విధుల నుంచి వైదొలగండి" అని ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహార్, జస్టిస్ డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దీంతో కీలక నిందితులు ఎన్‌కె అమీన్, టిఎ బరోత్‌లు బాధ్యతల నుంచి వైదొలిగారు. గతంలో వీరిద్దరూ ఈ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో ఎనిమిదేళ్లు సస్పెన్షన్ వేటుకు గురైన సంగతి తెలిసిందే. ఇటీవలే ప్రభుత్వం వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంది.

ఉనా ఘటన పునరావృతం

- దళితుని ఇంటిపై మూకుమ్మడి దాడి
- చనిపోయిన ఆవుని పారవేయడమే నేరం

ఆనంద్ (గుజరాత్) : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఉనా దళితులపై దాడి ఘటన గుజరాత్‌లోనే మరోసారి పునరావృతమైంది. అహ్మదాబాద్‌కు దాదాపు 70 కిలో మీటర్ల దూరంలోని ఆనంద్ జిల్లాలో ఒక దళిత యువకుడిని, అతడి తల్లిని అగ్రవర్ణాల వారు చితకబాదారు. ఆనంద్ జిల్లా సోజిత్ర తాలూక, కసోర్ గ్రామం ఈ దుర్మార్గానికి వేదికైంది. ఆ గ్రామానికి చెందిన శైలేష్ మునిభాయి రోహిత్ ఇంటిపై దర్బార్(క్షత్రియ) కులానికి చెందిన 100 మంది దాడి చేశారు. అయితే శైలేష్, ఆయన తల్లి మనిబెన్ మనిభాయిపై దాడి చేశారు. మహిళ అని కూడా చూడకుండా దారుణంగా హింసించారు. అయితే చనిపోయిన ఆవుని తీసుకెళ్లడమే దీనంతటికీ కారణమని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ ఘటనకు సంబంధించి ఏడుగురిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. భారతీయ శిక్షాస్మృతి, ఎస్‌సి/ఎస్‌టిలపై దాడుల నియంత్రణ చట్టం 323, 506/2 కింద నిందితులపై కేసు నమోదైంది. మరో 12 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. "బుధవారం 17 మందిని అరెస్టు చేశామనీ, వారిలో ఏడుగురిని బాధితులు గుర్తించారని ఆనంద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డిడి దామోదర్ చెప్పారు.

అసలేం జరిగింది?

దర్బార్ కులానికి చెందిన గౌతమ్‌భాయి భగత్ ఆగస్టు 11న దళితుడైన శైలేష్ మనిభాయికి ఫోన్ చేశారు. తమ ఆవు చనిపోయిందని, దాన్ని తొలగించాలని శైలేష్‌ను ఆదేశించారు. దీంతో ఆవు కళేబరాన్ని తీసుకుని, దాని చర్మం ఒలిచిన అనంతరం ఊరు చివర శ్మశానానికి దగ్గరలోనిఒక ప్రభుత్వ స్థలంలో దాన్ని పడేశాడు. వాడుకలలో లేని ఆ ప్రాంతానికి సమీపంలోనే అగ్రవర్ణాల శ్మశానం ఉంది. అయితే తమ శ్మశానానికి సమీపంలో ఆవు కళేబరాన్ని పడేయడంతో ఆగ్రహించిన అగ్రవర్ణాల వారు రోహిత్ ఇంటిపై దాడికి దిగారు.



ఇద్దరు ఉగ్రవాదుల హతం

న్యూఢిల్లీ: జమ్ముకాశ్మీర్‌లోని గురెజ్ సెక్టార్‌లో చొరబాటుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు గురువారం పోలీసులు ప్రకటించారు. గురెజ్ సెక్టార్‌లోని కుదల్వాన్ దుర్మట్ అటవీ ప్రాంతంలో భద్రతాదళాలు పెద్ద ఎత్తున గాలింపు చేపట్టి ఉగ్రవాదులను గుర్తించారనీ ఈ నేపథ్యంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని పేర్కొన్నారు. ఈ ఏడాది భద్రతాదళాలు 21 చొరబాట్లు అడ్డుకొగా, 41 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టారు.

బందిపోరాలో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్

గురెజ్‌లోని బందిపురా ప్రాంతంలో కూడా భద్రతాదళాలు, సైనికాధికారులకు మధ్య ఎదురు కాల్పులు జరుగుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ఉగ్రవాదులు ముందుగా కాల్పులకు దిగడంతో భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు.

బెంగళూరులో విషపు నురగలు కక్కుతున్న చెరువులు

స్థానికుల ఇబ్బందులు

బెంగళూరు : బెంగళూరులో ఆగస్టులో కురిసిన అధిక వర్షాలకు నగరంలోని రెండు అతిపెద్ద సరస్సులు విషపు నురగను వెళ్లగక్కుతున్నాయి. ఈ నురగల తాకిడికి తాము బుధవారం నుంచి ఇళ్లలోనే ఉన్నామని స్థానికులు పేర్కొంటున్నారు. దుర్గంధం వెదజల్లే రసాయనాలతో కూడిన నురగ చెరువుల నుంచి వెలువడుతున్నట్లు స్థానికులు తెలిపారు. వర్తూరు సరస్సులో 10 అడుగుల మేర నురగ మేట వేసి అటువైపుగా వచ్చే వాహనదారులపై వచ్చి పడుతోంది. నగరంలోని వైట్ ఫీల్డ్ రోడ్డులో వెయ్యెకరాల విస్తీర్ణంలో ఉన్న బెలందర్ సరస్సు నుంచి కూడా నురగ వస్తూ వాహనాలపై పడుతోంది.



ఆదర్శ వివాహం చేసుకున్న ఇరోం షర్మిల

కొడైకెనాల్ : మణిపూర్ మానవ హక్కుల ఉద్యమ నేత, ఉక్కు మహిళ ఇరోం షర్మిల, బ్రిటన్‌కు చెందిన సినీ నిర్మాత డెస్మండ్ కౌటిన్హా తమిళనాడులోని కొడైకెనాల్‌లో అత్యంత నిరాడంబరంగా ఆదర్శ వివాహం చేసుకున్నారు. హిల్ స్టేషన్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక వివాహ చట్టం-1954 కింద గురువారం ఉదయం 10.30 గంటలకు వీరి వివాహం జరిగింది. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఫోన్ ద్వారానే అమ్మ నుంచి ఆశీస్సులు తీసుకున్నట్లు వివాహనం అనంతరం ఇరోం షర్మిల తెలిపారు. పెళ్లికి బంధువులను ఎవ్వరినీ పిలువలేదు. షర్మిల స్నేహితురాలు, సామాజిక కార్యకర్త దివ్య భారతి, ఒక ఫొటో గ్రాఫర్ మాత్రమే హాజరయ్యారు.

25 వేల మంది ఐటి ఉద్యోగులపై వేటు..!

న్యూఢిల్లీ : ఐటి కంపెనీలు భారీ ఎత్తున ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నాయి. టెక్నాలజీ కంపెనీలో చూసిన ఉద్యోగాల తాజాగా మొబైల్ టెలికాం రంగాల్లోనూ ఉండబోతుంది. మొబైల్ టెలికాం ఎరిక్సన్ సంస్థ 25 వేల మంది ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధ పడుతోంది. సేవింగ్స్ ప్రోగాంలో భాగంగా స్వీడన్ బయట ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు స్వీడిష్ డైలీ ఒక పత్రికలో వెల్లడిచింది.

సైనిక దళాలకు ఆరు అపాచీ హెలికాప్టర్లు

రూ. 4168 కోట్లతో కొనుగోలుకు రక్షణ శాఖ ఆమోదం

న్యూఢిల్లీ: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అపాచీ యుద్ధ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ శాఖ గురువారం ఆమోదం తెలిపింది. దీంతో ఆరు అపాచీ హెలికాప్టర్‌లు భారత రక్షణ దళాల అమ్ముల పొదిలో చేరనున్నాయి. ఈ ఒప్పందం విలువ రూ.4168 కోట్లు అని డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్(డిఎసి) వెల్లడించింది. రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన సమావేశమైన డిఎసి మండలి హెలీకాప్టర్ల కొనుగోలుకు నిర్ణయం తీసుకుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన ఈ హెలికాప్టర్లను బోయింగ్ సంస్థ తయారుచేస్తోంది. ప్రస్తుతం అమెరికా, నెదర్లాండ్, ఇజ్రాయెల్‌లో వీటిని వినియోగిస్తున్నారు. సెన్సార్‌తో లక్ష్యాన్ని నిర్దేశించి దాడి చేసే సామర్థ్యం కలిగిన ఈ హెలికాప్టర్‌లో ఇద్దరు సైనికులకు చోటువుంటుంది. రాత్రి సమయాల్లో కూడా దాడి చేసే సామర్థ్యం వీటి ప్రత్యేకత. హెల్‌ఫైర్ క్షిపణిలు, హైడ్రా 70 రాకెట్ ప్యాడ్‌లను మోసుకుపోయే సత్తా వీటికి ఉంది.

బెంగాల్ స్థానిక సంస్థలో టిఎంసి విజయం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని ఏడు మున్సిపాలిటీలకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. గతేడాది రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన టిఎంసి మున్సిపాలిటీల్లోనూ విజ యం సాధించింది. కాగా బిజెపి మూడు మున్సి పాలిటీల్లో ఆరు స్థానాలు మాత్రమే గెలుచుకో గలిగింది. ఐదు మున్సిపాలిటీలు, ఒక నోటిఫై ఆథారిటీ, ఒక మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆది వారం ఎన్నికలు జరిగాయి. దూప్‌గురి మున్సిపా లిటీలో 16 కౌన్సిలర్ స్థానాలకు, 12 చోట్ల తృణముల్ విజయం సాధించింది. ఈ ఎన్నికలు పలుచోట్ల హింసాత్మక సంఘటనలు చెలరే గాయి. దుర్గాపూర్‌లో తృణముల్ కాంగ్రెస్ పార్టీ హింసను ప్రేరేపిస్తుందంటూ సిపిఎం, బిజెపిలు ఎన్నికలు రద్దు చేయాలని డిమాండ్ చేశాయి.

సుప్రీంలో ఎన్నికల ఫలితాన్ని సవాలు చేస్తా

కెన్యా ప్రతిపక్ష నేత



నైరోబి : గత వారం వెలువడిన అధ్యక్ష ఎన్నికల ఫలితాలను కోర్టులో సవాలు చేయనున్నట్లు కెన్యా ప్రతిపక్ష నేత రైలా ఓడింగా బుధవారం తెలిపారు. ఈ నెల 8వ తేదీన ఎన్నికలు జరిగినప్పటి నుండి ఇప్పటివరకు జరిగిన నిరసనలు, ఆందోళనల్లో 24మంది మరణించారు. వీరిలో చాలామంది పోలీసు కాల్పుల్లోనే మృతి చెందారు. రోజుల తరబడి నిరసనలు నిర్వహించిన అనంతరం తమ నేత భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తానని ప్రకటించిన నేపథ్యంలో ఓడింగా మద్దతుదారులందరూ ఆయన ఏం చెబుతారా అని ఎదురుచూస్తు న్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలను సుప్రీం కోర్టులో సవాలు చేయనున్నట్లు ఓడింగా మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎన్నికల ఫలితాలను ఆమోదించేది లేదని, తమ ఆందో ళనకు ఇది ప్రారంభం మాత్రమేనని ఆయన ప్రకటించారు. భారీ ఎత్తున రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తున్న ఓడింగా ఇంతవరకు వాటికి సంబం ధించిన రుజువులు, సాక్ష్యాలను మాత్రం ఎన్నికల కమిషన్‌కు అందచేయలేదు. ఎన్నికలు ప్రశాం తంగా, స్వేచ్ఛగా జరిగాయని, నిరసనలకు పాల్ప డవద్దని దేశీయ, అంతర్జాతీయ పరిశీలకులు, దౌత్యవేత్తలు విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో తన మద్దతుదారులతో ముమ్మరంగా చర్చలు జరిపిన ఓడింగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

వెనిజులా జైల్లో ఘర్షణలు

37మంది మృతి

కారకస్ : వెనిజులాలోని దక్షిణప్రాంత రాష్ట్రమైన అమజోనాస్‌లో జైల్లో చెలరేగిన ఘర్షణల్లో 37మంది మరణించారని అధికారులు తెలిపారు. ఈ ఘర్షణల్లో 14మంది అధికారులు కూడా గాయపడ్డారు. ఘర్షణలకు దారి తీసిన పరిస్థితులపై దర్యాప్తు ప్రారంభించినట్లు ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. జైల్లో ఘర్షణ జరిగిందని, ఇప్పటివరకు 35 మృతదేహాలను లెక్కించామని గవర్నర్ లిబోరియా గుయారుల్లా ట్వీట్ చేశారు. మంగళవారం ప్రారంభమైన ఈ ఘర్షణలు, హింసాకాండ బుధవారం తెల్లవారు జాము వరకు కొనసాగింది. జైల్లో పరిస్థితులను పర్యవేక్షించే గ్రూపులు 'ఎ విండో టు ఫ్రీడం', 'వెనిజులన్ ప్రిజన్స్ అబ్జర్వేటరీ'లు ఈ సంఘటనపై స్పందిస్తూ చనిపోయిన వారందరూ ఖైదీలేనని తెలిపాయి. ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చోటు చేసుకోలేదని, ఇది అత్యంత అధ్వాన్నమైన పరిస్థితని ఎ విండో టు ఫ్రీడమ్ ప్రతినిధి కార్లోస్ నీటో వ్యాఖ్యానించారు. ఘర్షణలు చెలరేగిన సమయంలో జైల్లో 105మంది ఖైదీలు వున్నారని చెప్పారు. కాగా, 2013లో జైల్లో పెద్ద ఎత్తున చెలరేగిన ఘర్షణల్లో 60మంది మరణించారు.

ట్రంప్ ప్రభుత్వంలో చార్లెట్స్‌విల్లె ప్రకంపనలు

- ట్రంప్‌కు దూరమవుతున్న వ్యాపారవేత్తలు, ఉన్నతాధికారులు
- వ్యాపార, సలహా కౌన్సిల్స్‌కు రాజీనామాలు
- ఏకాకి అవుతున్న అధ్యక్షుడు



న్యూయార్క్/వాషింగ్టన్ : అమెరికాలోని చార్లెట్స్‌విల్లేలో జరిగిన జాత్యహంకార హింసాకాండ ట్రంప్ ప్రభుత్వంలో పలు కుదుపులకు కారణమవుతోంది. ఆ సంఘటనపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు పలువురు విభేదిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రాజీనామా చేయగా మరికొంతమంది అదే బాటలో వెళ్లాలని భావిస్తున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. తాజాగా కొంతమంది వ్యాపారవేత్తలు ట్రంప్‌తో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నారు. చార్లెట్స్‌విల్లే హింసాకాండకు ఇరు పక్షాల బాధ్యత వుందని, ఏ ఒక్కరినీ నిందించలేమంటూ ట్రంప్ వ్యాఖ్యానించిన మరుసటి రోజే ఈ పరిణామం సంభవించింది. ట్రంప్ సహాయకుల్లో కూడా పలువురు ఈ వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. ఇంత జరిగిన తర్వాత కూడా ఇంకా ట్రంప్‌కే అంటిపెట్టుకుని వుంటే తమ పేరు ప్రతిష్టలకే మచ్చ పడుతుందని వారు భావిస్తున్నారు. వ్యాపార రంగంలో వుండగా ట్రంప్‌కు లేని రాజకీయానుభవం, నైపుణ్యాలను అందించడానికి అవకాశం వుంటుందనే భావనతో అనేకమంది ఈ ప్రభుత్వంలో చేరారని, ట్రంప్ బహిరంగంగా చేసే ప్రకటనల్లో కొంత సంయమనం వుండేలా చూసేందుకు వీలు వుంటుందని భావించామని సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రభుత్వం నుండి రాజీనామా చేయాలని ఆయన ఆలోచిస్తున్నారు. నిన్నటి ఘటనలతో ఇక అందుకు అస్కారం లేదని స్పష్టమై పోయిందన్నారు. ట్రంప్ వ్యాఖ్యలనంతరం వైట్‌హౌస్‌లో ఆయన సలహాదారుల మండళ్ళ నుండి పలువురు వైదొలగారు. దాంతో ట్రంప్ తర్వాత ఆ మండళ్ళను రద్దు చేశారు. ట్రంప్ ఆర్థిక సలహాదారు గేరీ కాన్ కూడా రాజీనామా చేస్తారని భావిస్తున్నారు. యూదుడైన కాన్ ట్రంప్ వ్యాఖ్యలతో కలత చెందారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అమెరికా వెటరన్స్ వ్యవహారాలు చూస్తే డేవిడ్ సుల్కిన్ స్పందిస్తూ, యూదు అమెరికన్‌గా తాను ఈ పరిణామాల పట్ల చాలా ఆగ్రహంతో వున్నానని బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు. ఇటువంటి వాటిని ఎంత మాత్రమూ సహించలేమన్నారు.

వ్యాపార మండళ్ళను రద్దు చేసిన ట్రంప్

చార్లెట్స్‌విల్లె సంఘటనపై ట్రంప్ వ్యాఖ్యలతో అగ్రహం చెందిన అనేకమంది చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు తమ సలహా, వ్యాపార మండళ్ళకు రాజీనామా చేయడంతో రెండు వ్యాపార మండళ్ళను ట్రంప్ రద్దు చేశారు. ఎనిమిదిమంది ఎగ్జిక్యూటివ్‌లు రాజీనామా చేయడంతో అమెరికన్ మాన్యుఫాక్చరింగ్ కౌన్సిల్‌ను, స్ట్రాటజిక్ అండ్ పాలసీ ఫోరమ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ నుండి విమర్శలు వెల్లువెత్తడమే కాక, మిత్రపక్షమైన బ్రిటన్ కూడా మందలింపు వ్యాఖ్యలు చేసింది. దీంతో ట్రంప్ ఏకాకిగా మారారు. వచ్చే మంగళవారం జరపతలపెట్టిన ప్రదర్శనను కూడా రద్దు చేసుకోవాలంటూ ఫోనిక్స్ మేయర్ ట్రంప్‌ను కోరారు.



సమాచార మార్పిడికి అమెరికా-చైనా ఒప్పందం

బీజింగ్/వాషింగ్టన్: సంక్షోభ సమయాల్లో సమాచారం ఇచ్చి పుచ్చుకునే లక్ష్యంతో సన్నిహిత సంబంధాల ఏర్పాటుకు సంబందించి అమెరికా-చైనా గురువారం ఇక్కడ ఒప్పందంపై సంతకాలుచేశాయి. ఈ ఒప్పందంపై పెంటగాన్‌కు చెదిన నౌకాదళాధిపతి మెరైన్ జనరల్ జోసెఫ్ ఎఫ్ డన్‌ఫోర్డ్, చైనా త్రివిధ దళాల సంయుక్త కమిటీ అధిపతి జనరల్ ఫాంగ్ ఫెంగ్‌షుయ్ సంతకాలు చేశారు. ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నత డన్‌ఫోర్డ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం చైనా అధికారులతో ముందుగా చైనా సైనిక ప్రధాన కార్యాలయంలో చర్చలుజరిపింది. అనంతరం కుదిరిన ఈ ఒప్పందం మేరకు డన్‌ఫోర్డ్ కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారి లెఫ్టినెంట్ జనరల్ రిచర్డ్ డి క్లార్క్ చైనా సైనికాధికారితో నిరంతర సంప్రదింపుల ప్రక్రియను కొనసాగిస్తారు.

జాతి వివక్షతో సమాజాలు విషతుల్యం

ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ ఆందోళన



న్యూయార్క్: జాతి వివక్ష, జెనోఫోబియా, ఇస్లామో ఫోబియా వంటి జాడ్యాలు సమాజాలను విషతుల్యం చేస్తు న్నాయని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలోని ఛార్లెట్స్ విల్లేలో శనివారం జరిగిన హింసాకాండకు ఇరువర్గాలను బాధ్యులనుచేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రజాగ్రహం వెల్లువెత్తిన నేపథ్యంలో గుటెరస్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బుధవారం ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తనపై ఎటువంటి వత్తిళ్లూ లేవని స్పష్టం చేశారు. వివిధ దేశాధ్యక్షులు చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనని, తాను కొన్ని మార్గదర్శక సూత్రాలకు కట్టుబడి విధులు నిర్వర్తిస్తానని అన్నారు. జాతి వివక్ష, జెనోఫోబియా, ఇస్లామో ఫోబియా వంటి అంశాలు మన సమాజాలను విషతుల్యం చేస్తున్నాయని, వీటికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడటం మనందరి కర్తవ్యమని అన్నారు.

కతార్ యాత్రికుల కోసం సరిహద్దులు తెరచిన సౌదీ అరేబియా

కైరో: ఈ ఏడాది హజ్ సీజన్‌కు సంబంధించి కతార్ నుండి మక్కా యాత్రకు వచ్చే హజ్ యాత్రికుల కోసం తమ సరిహద్దులను తెరిచి వుంచుతున్నట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. గత జూన్‌లో నాలుగు అరబ్ దేశాలు కతార్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో సౌదీ అరేబియా ఈ నిర్ణయం తీసుకోవటం విశేషం. కతార్ నుండి వచ్చే యాత్రికుల కోసం తమ దేశ సరిహద్దులు తెరచి వుంచుతున్నామని, ఇందుకు సంబంధించి ఎటువంటి ఎలక్ట్రానిక్ అనుమతులూ అవసరం లేదని సౌదీ అధికార వార్తా సంస్థ ఒక ప్రకటనలో వివరించింది. కతార్ యాత్రికులు సరిహద్దుల నుండి భూ మార్గంతో పాటు విమానాల ద్వారా కూడా రావచ్చని, వారిని సాదరంగా ఆహ్వానిస్తున్నామని ఈ ప్రకటన వివరించింది. అయితే ఈ నిర్ణయంపై కతార్ వెంటనే స్పందించకపోవటం విశేషం.


ఉగాండాలో 10లక్షల మంది దక్షిణ సూడాన్ శరణార్థులు

మరింతగా మానవతా సాయానికై ఐరాస విజ్ఞప్తి

కంపాలా : ఉగాండాలో ఆశ్రయం పొందుతున్న దక్షిణ సూడాన్ శరణార్థుల సంఖ్య పది లక్షలకు చేరిందని ఐక్య రాజ్య సమితి గురువారం పేర్కొంది. ప్రపంచంలో అత్యంత వేగంగా పెరుగుతున్న శరణార్థ సంక్షోభానికి ఇదొక ఉదాహరణ అని వ్యాఖ్యానిం చింది. దక్షిణ సూడాన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధం కారణంగా తమ దేశానికి వస్తున్న సూడాన్ జాతీయుల సంఖ్య పెరిగిపోతోందని ఉగాండా అధికారులు తెలిపారు. వారికి మరింత మాన వతా సాయం అందించాలని ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. గత 12 మాసాల నుండి సగటున రోజుకు 1800 మంది చొప్పున దక్షిణ సూడాన్ జాతీయులు ఉగాండా చేరుకుంటున్నారని యుఎన్‌హెచ్ సిఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. మరో 10లక్షల మంది దక్షిణ సూడాన్ జాతీయులు ఇథియోపియా, కెన్యా, కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ దేశాల్లో తల దాచుకుంటున్నారు. 2016 జులైలో దక్షిణ సూడాన్ రాజధాని జుబాలో భీకరమైన పోరు తలెత్తిన తర్వాత ఇతర ప్రాంతాలకు పారిపోతున్న వారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ఇళ్ళలో ప్రజలు వుంటుండగానే తగలబెట్టడం, కుటుంబ సభ్యుల ముందే హతమార్చడం, మహిళలపై అత్యాచారాలు, నిర్బంధ సైనిక శిక్షణ కోసం బాలురను కిడ్నాప్ చేయడం వంటి కారణాలతో ప్రజలు అక్కడ వుండలేక పారిపోతున్నారని ఆ ప్రకటన పేర్కొంది. వేల సంఖ్యలో శరణార్థులు పెరిగిపోతుండడంతో మానవతా సాయానికి తీవ్రంగా కొరత ఏర్పడుతోందని యుఎన్‌హెచ్‌సిఆర్ పేర్కొంది.

కొరియా ద్వీపకల్పంలో ఎటువంటి యుద్ధం వుండదు

ద.కొరియా అధ్యక్షుడు మూన్‌జే ఇన్ వెల్లడి



సియోల్: ప్రసుతం కొరియా ద్వీపకల్పంలో నెలకొన్న ఉద్రిక్తతలు ఎటువంటి యుద్ధానికీ దారితీయబోవని భావిస్తున్నట్లు ద.కొరియా అధ్యక్షుడు మూన్ జె ఇన్ చెప్పారు. ఉ.కొరియా అణు, క్షిపణి కార్యక్రమాలకు వ్యతిరేకంగా అమెరికా సైనిక చర్యను తాము వీటో చేయటం ద్వారా విజయవంతంగా అడ్డుకోగలిగామని ఆయన వివరించారు. ఉ.కొరియా ఇటీవల విజయవంతంగా నిర్వహించిన తొలి ఖండాంతర క్షిపణి ప్రయోగం నేపథ్యంలో కొరియన్ ద్వీపకల్పంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే.

నాఫ్తాపై ట్రంప్ కఠిన వైఖరి

మెక్సికోలో నిరసన ప్రదర్శనలు

వాషింగ్టన్/మెక్సికో సిటీ : ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (నాఫ్తా)పై బుధవారం చర్చలు ప్రారంభమైన నేపథ్యంలో అమెరికా ఈ ఒప్పందంపై కఠిన వైఖరి తీసుకుంది. మెక్సికో, కెనడాలతో గల వాణిజ్య లోటును కుదించుకునేందుకు గానూ పెద్ద ఎత్తున రాయితీలు కావాలని డిమాండ్ చేస్తోంది. వాషింగ్టన్‌లో చర్చలు ప్రారంభం కావడానికి ముందుగా ట్రంప్ వాణిజ్య సలహాదారు రాబర్ట్ లైట్జిర్ మాట్లాడుతూ, నాఫ్తా ప్రాథమికంగా విఫలమైందని తాము భావిస్తున్నట్లు చెప్పారు. ఇందులో పెద్ద ఎత్తున మార్పులు తీసుకురావాల్సి వుందన్నారు. నాఫ్తాలోని వాణిజ్య వివాదాల పరిష్కార వ్యవస్థలో మార్పులు కోసం కూడా పోరు జరపాల్సిన అవసరం వుందని ఆయన అభిప్రాయపడ్డారు. 1994లో ఈ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుండి 7లక్షల ఉద్యోగాలను అమెరికా నష్టపోయిందని ఆయన చెప్పారు. కాగా, ఒప్పందంలోని చాప్టర్ 19ను రద్దు చేయాలని అమెరికా పట్టుబడితే తాము ఈ ఒప్పందం నుండి బయటకు వెళ్ళిపోతామని కెనడా విదేశాంగ మంత్రి ఈ వారం ప్రారంభంలో సూచించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు సరిగా వున్నాయా లేదా అని నిర్ధారించడానికి వాణిజ్య మిగులును లేదా లోటును ప్రాథమిక కారణంగా కెనడా చూడలేదని పేర్కొన్నారు. కాగా మెక్సికో ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని కాపాడాలని ఒక పక్క భావిస్తుంటే మరోపక్క వేలాదిమంది మెక్సికన్లు నాఫ్తాను రద్దు చేయాలని నినదిస్తూ ప్రదర్శన నిర్వహించారు. అమెరికా, మెక్సికో అధ్యక్షుల ఫోటోలతో 'నో టు నాఫ్తా' అని రాసి వున్న ప్లకార్డులను ప్రదర్శించారు.

మొదటి పేజీ తరువాయి

హామీలు ఫుల్-నిధులు డల్

కావాల్సిన నిధులతో పోలిస్తే బడ్జెట్‌లో కేటాయింపులు పాతిక శాతం కూడా లేవు. ఐదు పథకాలకూ రూ. 26,696 కోట్లు అవసరమని ఆర్థిర శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో ఇంకా రూ. 20 వేల కోట్లకు పైగా నిధుల కొరత వేధించనుంది. ఒకవేళ వచ్చే బడ్జెట్‌లో కొంత కేటాయింపులు చేయాలని భావించినా, ప్రభుత్వానికి అదే చివరి బడ్జెట్ కావడంతో, ఒకేసారి రూ. 20 వేల కోట్లు కేటాయించడం, విడుదల చేయడం ఎంతవరకు సాధ్యమన్న ప్రశ్న కూడా అధికారులే వేసుకుంటున్నారు. ఈ పరిస్థితి ఆయా పథకాల లబ్దిదారులపై పడే ప్రమాదం ఉందన్న ఆందోళన కూడా లోలోన వ్యక్తమవుతోంది.రుణమాఫీకి సంబంధించి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 3600 కోట్లు కేటాయించారు. వాస్తవంగా ఇందుకు కావాల్సింది రూ.13,176 కోట్లుగా ఆర్థిక శాఖ గుర్తించింది. అంటే బడ్జెట్ కేటాయింపులకు అదనంగా మరో రూ. 9576 కోట్లు కావాల్సి ఉంటుందని లెక్క తేల్చారు. స్వయం సహాయక బృందాలకు ఇచ్చే నిధుల కోసం బడ్జెట్‌లో రూ. 1600 కోట్లు కేటాయించగా, వాస్తవానికి రూ. 3316 కోట్లు అవసరమని, పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ. 600 కోట్లు కేటాయించగా, మొత్తం రూ. 4200 కోట్లు కావాల్సి ఉంటుందని, వడ్డీ లేని రుణాలకు బడ్జెట్‌లో రూ. 110 కోట్లు కేటాయించగా, రూ. 3430 కోట్లు అవసరమని నిర్ధరించారు. చివరిగా విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం రూ. 574 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా, మొత్తం చెల్లింపులకు రూ. 2574 కోట్లు కావాల్సి ఉంటుందని గుర్తించారు. ఇలా ఐదు అంశాలకు జరిగిన మొత్తం కేటాయింపులను పరిశీలిస్తే ఇంకా అదనంగా రూ. 20,212 కోట్లు కావాల్సి ఉంటుందని లెక్క తేల్చారు. ఈ భారీ నిధులే ఇప్పుడు అధికారుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఈ హామీలు నెరవేర్చకపోతే 2019 ఎన్నికల్లో ఎలాగనే భావాన్ని కూడా వారు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ గణాంకాలతో కూడిన వివరాలను నేరుగా ముఖ్యమంత్రికే వారు సమర్పించడం విశేషం.

సిఎం డ్యాష్ బోర్డుకు తెలిసేలా ఉద్యమం

వ్యవహరిస్తున్నారని అన్నారు. పశ్చిమ రాయలసీమ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మాతృభాషను కాదని పరాయి భాషకు పట్టం కట్టడం ఆంధ్రప్రదేశ్‌లో మినహా ప్రపంచంలో మరెక్కడా లేదని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్రంలో మున్సిపల్ ఉపాధ్యాయులు పడుతున్న కష్టాలు సిఎం డ్యాష్ బోర్డుకు తెలిసేలా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నేడు ఉన్నత స్థానాల్లో ఉన్న అనేక మంది రాజకీయ నాయకులు, అధికారులు ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసిన వారేనని గుర్తు చేశారు. ఇంటర్మీడియట్ విద్య ఇప్పటికే కార్పొరేట్ శక్తుల చేతిలోకి వెళ్లిందని, పాఠశాల విద్యనూ కబళించడానికి కార్పొరేట్ వ్యవస్థ యత్నిస్తోందని చెప్పారు. అనంతరం డిఎంఎ కన్నబాబుతో చర్చించారు. కార్యక్రమంలో జెఎసి వైస్ చైర్మన్ ఐ.వెంకటేశ్వరరావు, ఫ్యాప్టో సెక్రెటరీ జనరల్ జి.హృదయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీహార్‌లో 1000 కోట్ల కుంభకోణం

పంపిణీ చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ కుంభకోణం భాగల్పూర్ పరిధి దాటి ఇతర జిల్లాలకు కూడా విస్తరించినట్లు తెలుస్తోంది. ఈ స్వచ్ఛంద సంస్థ 2007 నుండి 2014 వరకూ ఈమోసం కొనసాగించిందని, సంస్థ వ్యవస్థాపకురాలు మనోరమా దేవి ఈఏడాది ఫిబ్రవరిలో మరణించటంతో ఆ సంస్థ కార్యకలాపాలు నిలిచిపోయాయని సమాచారం. ప్రాథమిక ఆధారాల మేరకు ఆమె కుమారుడు అమిత్ కుమార్, కోడలు ప్రియాకుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కుంభకోణం మొత్తం విలువ రు.500 కోట్లు వుంటుందని కొన్ని మీడియా సంస్థలు చెబుతుండగా ఇది వెయ్యికోట్ల పైమాటేనని మరికొన్ని మీడియా సంస్థలు తమ కథనాలలో పేర్కొన్నాయి. ఈ కుంభకోణం జరిగిన సమయంలో అధికారంలో వున్న నితీష్ కేబినెట్‌లో సుశీల్ కుమార్ మోడీ ఆర్థిక మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఈ కుంభకోణం వెలుగు చూడటంతో దీనిపై సిబిఐ దర్యాప్తు జరిపించాలని మోడీ తన పదవికి రాజీనామా చేయాలని ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ డిమాండ్ చేస్తున్నారు. ఈ కుంభకోణంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది మణిభూషణ్ ప్రతాప్ సెంగన్ పాట్నా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ కుంభకోణంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌తో పాటు బిజెపి నేతలు సుశీల్ మోడీ, షానవాజ్ హుస్సేన్, గిరిరాజ్ కిషోర్, నిషికాంత్ దూబే, విపిన్ బిహారీ వంటి నేతలకు ప్రమేయం వుందని, ఈ కుంభకోణం విచారణ నుండి తనను తాను రక్షించుకునేందుకు నితీష్ బిజెపితో చేతులు కలిపారని లాలూ ఆరోపించారు.

ప్రయాణికులకు మెట్రో పాలసీ వాత

- వాల్యూ క్యాప్చరింగ్ ఫైనాన్సింగ్, బాండ్ల జారీతో నిధుల సేకరణ
- కేంద్ర సాయం పొందాలంటే విశాఖ మెట్రోకు పిపిపియే గతి



ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మెట్రో పాలసీతో విశాఖ మెట్రో ఆశలు చిగురిస్తున్నప్పటికీ ప్రయివేటుకు కట్టబెట్టేదిశగా నిర్ణయాలు వెలువడటంపై ప్రయాణికులకు భారంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ప్రయాణ ఛార్జీలు పెంచుకునే వెసులు బాటును రాష్ట్రాలు, ప్రయివేటు సంస్థలకు వదిలేయడం చూస్తుంటే ఒక రకంగా మెట్రో బాధ్యతల నుంచి కేంద్రం తప్పుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. విశాఖ మెట్రో డిపిఆర్‌ను రెండేళ్ల కిందటే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపించింది. అప్పటినుంచి పెండింగ్‌లో ఉన్న డిపిఆర్ ఈ కొత్త పాలసీతో ఆమోదం పొందే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. వాల్యూ క్యాప్చరింగ్ ఫైనాన్సింగ్ (విసిఎఫ్), బాండ్ల జారీ పద్ధతిలో నిధులు సేకరించుకోవాలని సూచించింది. కేంద్రం నుంచి ఆర్థిక సాయం పొందాలంటే రాష్ట్రాలు ప్రయివేటు సంస్థలతో జట్టుకట్టడం తప్పనిసరి చేస్తూ పాలసీని విడుదల చేశారు. చెరి పది శాతం నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించి మిగిలిన 80 శాతం నిధులు ప్రయివేటు సంస్థలు, ఇతరత్రా మార్గాల ద్వారా సమకూర్చుకోవాల్సివుంది.

విశాఖకు లైన్ క్లియర్.. విజయవాడకు రెడ్ సిగ్నల్..

విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రక్రియ ఆలస్యమైనా కేంద్రం తాజాగా పాలసీకి దగ్గరగా ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. 3 కారిడార్లు, 42.5 కిలోమీటర్ల దూరం, రూ.12,500 కోట్ల అంచనాతో డిపిఆర్ తయారైన విషయం తెలిసిందే. ఇది పిపిపిలోనే ఉంది. విశాఖ జనాభా దాదాపుగా 18 లక్షలుండటంతో కొంతమేర వయోబిలిటీ ఉండే అవకాశాలున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర పాలసీతో విజయవాడ మెట్రో ప్రాజెక్టు సందిగ్దంలో పడినట్లు తెలిసింది. ప్రస్తుత డిపిఆర్‌కు కొత్త పాలసీకి పొంతన లేదు. దీంతో మళ్లీ విజయవాడ మెట్రోకు డిపిఆర్ రూపొందించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఒక వేళ డిపిఆర్ తయారు చేసినా విశాఖతో పోలిస్తే విజయవాడ జనాభా దాదాపుగా సగం ఉంటుంది. ప్రయివేటు సంస్థలు విజయవాడ మెట్రోకు నిధులు సమకూర్చేందుకు ముందుకు రాకపోవచ్చన్న సందేహాలున్నాయి.

మెట్రో పాలసీ విధానం

నిధుల డిమాండ్‌ను తట్టుకునేందుకు పిపిపి తప్పనిసరి. మొత్తం ప్రాజెక్టులో లేదా అనుబంధ విభాగాలైన ఛార్జీల వసూలు, నిర్వహణలో ప్రయివేటు సంస్థ పాలు పంచుకోవాలి. ప్రయివేటు రంగంలోని వనరులు, నిపుణులు, ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. స్టేషన్‌లో వాణిజ్య ఆస్తుల అభివృద్ధి, స్థలాల లీజులు, వాణిజ్య ప్రకటనల ద్వారా లభించే ఆదాయానికి సంబంధించి తీసుకునే చర్యలను రాష్ట్రాలు తమ ప్రాజెక్టు రిపోర్టులో సవివరంగా తెలియజేయాలి. సమయానుగణంగా ఛార్జీలను సవరించేలా నిబంధనల మార్పునకు, ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకోవడానికి రాష్ట్రానికి అధికారం కల్పించాలి. గ్యాప్ ఫండ్, కేంద్ర గ్రాంట్లు(ప్రాజెక్టులో 10 శాతం వ్యయానికి సమానం) 50:50 నిష్పత్తిలో కేంద్రం, రాష్ట్రాల మధ్య ఈక్విటీ షేరింగ్, విద్యా సెస్ పేరిట సెకండరీ, ఉన్నత విద్య ద్వారా సమకూరే సెస్ నిధులతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది.

రైతు పిటిషన్‌పై క్రిడాకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఉండవల్లి గ్రామంలోని తమ భూమిని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సేకరిస్తోందని రైతు దంటు బాలాజీరెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన కేసులో న్యాయమూర్తి రామలింగేశ్వరరావు సిఆర్‌డిఎ కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. పిటిషనర్ భూమిని సేకరించాల్సిన అవసరం ఉందో లేదో చెప్పాలని సిఆర్‌డిఎను ఆదేశించారు. పిటిషనర్ వాదన నిజమే అయితే నోటిఫికేషన్‌పై తగిన ఉత్తర్వులు జారీ చేయాల్సి వస్తుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. విచారణ రెండు వారాలు వాయిదా పడింది.

మెడికల్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ నిలిపివేత

ప్రజాశక్తి - హైదరాబాద్

ఎపిలోని ఎన్టీఆర్ వైద్య, తెలంగాణలోని కాళోజీ విశ్వవిద్యాలయాల పరిధిలో ఎంసీహెచ్, డీఎం సూపర్‌స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీకి నిర్వహించబోయే కౌన్సెలింగ్ ఆపేయాలని హైకోర్టు న్యాయమూర్తులు రామసుబ్రమణియన్, రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. ఆ రెండు యూనివర్సిటీ పరిధిలో సీట్ల భర్తీ జాతీయ కౌన్సెలింగ్ విధానంలో చేపట్టాలని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలను వైద్యులు సవాల్ చేసిన కేసులో ఈ మధ్యంతర ఆదేశాలు వెలువడ్డాయి. ఈ అడ్మిషన్లపై సుప్రీంకోర్టు విధించిన గడువులోపే ఈ కేసును పరిష్కరిస్తామని బెంచ్ ప్రకటించింది. కేంద్రానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు విచారణను 23కి వాయిదా వేసింది.

పోరంకిలో నిర్మాణాలను కూల్చొద్దు...

ప్రజాశక్తి - హైదరాబాద్

కృష్ణా జిల్లా పోరంకిలోని జాతీయ రహదారి విస్తరణ పేరతో 72 మందికి చెందిన పిటిషనర్ల నిర్మాణాల్ని కూల్చవద్దని, వారిని భవనాల నుంచి ఖాళీ చేయించవద్దని హైకోర్టు న్యాయమూర్తి రామలింగేశ్వరరావు మధ్యంతర ఆదేశాలిచ్చారు. జాతీయ రహదారి 65 విస్తరణ పేరుతో తమకు కొత్త భూసేకరణ చట్టం కింద పరిహారం ఇవ్వడం లేదని పిటిషనర్ల వాదన. తదుపరి విచారణ సెప్టెంబర్ 4కి వాయిదా పడింది.

బాలయ్యా ఇదేం పనయ్యా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రచార పర్వంలో బాలకృష్ణ కొంతమదికి డబ్బులు పంచుతున్న ఫోటోలు వెలుగులోకి వచ్చాయి. ఎక్కడ, ఎప్పుడు జరిగిందన్న విషయం స్పష్టంగా తెలియకపోయినప్పటికీ వందరూపాయ నోట్లను పట్టుకుని, మరో చేత్తో ఒకొక్కటి పంచుతున్నట్లుగా ఫోటోలోఉంది. అయితే, ఎన్నికల ప్రచారమన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. గురువారం ఈ విషయం మీడియాలో చర్చనీయాంశం కావడంతో ఎన్నికల కమిషన్ సూమోటోగా కేసు నమోదు చేసింది. నోడల్ ఆఫీసర్‌ను విచారణ చేయాలని ఆదేశించింది.

తంటాలు పడుతున్న దేశం నేతలు

ప్రచార పర్వంలో బాలయ్య చేతలను సమర్ధించుకోవడానికి టిడిపి నేతలు తంటాలు పడుతున్నారు. సంఘటన తీవ్రతను తగ్గించి చూపడానికి ప్రయత్నిస్తున్నారు. 'బాలయ్య చెయ్యి తగలడమే అదృష్టం .. ఆయన చేత్తో ఇలా అన్నా... అలా అన్నా ఆ అభిమాని పులకించిపోతాడు' అని టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. డబ్బుల పంపిణీపై మాత్రం ఆయన పెదవి విప్పలేదు.

పదహారేళ్ల అమ్మాయికి 65 ఏళ్ల అరబ్ షేక్‌తో పెళ్ళి

(మొదటి పేజీ తరువాయి)

వృద్ధుడితో కలిసి విలాసవంతమైన జీవితం గడుపుతున్నట్లు వీడియోలు చూపించారని ఆమె చెప్పారు. తన కూతుర్ని బలవంతంగా పంపించారని, అక్కడ నుంచి తన బిడ్డను హైదరాబాద్‌కు రప్పించి నిందితులపై చర్యలు తీసుకోవాలని బాలిక తల్లి పోలీసులను కోరింది. కేసు నమోదు చేసుకొన్నామని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని డిసిపి సత్యన్నారాయణ తెలిపారు.

క్రీడా మంత్రి గోయెల్ భూ క్రీడ

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. 2014లో గోయెల్ రాజ్యసభకు ఎన్నికైన వెంటనే ఈ సంస్థ టాయ్‌బ్యాంక్ ఏర్పాటుకు తమకు స్థలం కేటాయించాలంటూ డిడిఎకు దరఖాస్తు చేసుకుంది. ఈ సంస్థకు గోయెల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా కుమారుడు సిద్ధాంత్, కుమార్తె విద్యున్ సభ్యులుగా వున్నట్లు డిడిఎ రికార్డుల ద్వారా తెలుస్తోంది. గత ఏడాది ఆగస్టు 8న లే అవుట్ ప్లాన్‌ను మార్చి ఈ ప్లాట్‌ను విఎఇఎస్ సంస్థకు కేటాయించినట్లు ఈ వార్త కథనం వెల్లడించింది.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు

(మొదటి పేజీ తరువాయి)

గంగుల ప్రతాపరెడ్డిని సిఎం చంద్రబాబు పార్టీ కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు.

సందర్శకుల తిప్పలు

ప్రదర్శనా ప్రాంగణ ప్రాంతంలో సందర్శకులు పలు ఇబ్బందులు పడ్డారు. ఉద్యాన శాఖ ప్రకటన ప్రకారం ఈనెల 15 నుంచి 18 వరకు జరిగే ప్రదర్శనలో సందర్శకులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన చూడవచ్చు. కాని ముఖ్యమంత్రి సందర్శనకు వస్తున్నారనే కారణంతో సాయంత్రం 5 గంటల తరువాత నుంచి సందర్శకులెవరినీ లోపలికి అనుమతించలేదు. అంతకు ముందే ప్రదర్శన చూసేందుకు లోపలికి వచ్చిన వారిని కూడా కొన్ని స్టాళ్లను చూసేందుకు మాత్రమే అనుమతి ఉందంటూ పోలీసులు అడ్డుకున్నారు. ఇక ప్రోటోకాల్ పేరుతో ఆ పరిసర ప్రాంగణంలో సాయంత్రం 5 తరువాత వాహనాలను అనుమతించకుండా రోడ్డు చివరనో, లేక ప్రాంగణానికి ఎదురుగా ఉన్న రోడ్డులోనో పార్కింగ్ చేసుకోవాలని పోలీసులు ఆంక్షలు విధించారు. దీనితో ఈ ప్రదర్శన చూసేందుకు వచ్చిన వారు ఇబ్బందిపడ్డారు. ఇక ముఖ్యమంత్రి షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవ్వాలి. కాని రెండున్నర గంటలు ఆలస్యమవడంతో చాలా మంది కార్యక్రమానికి వచ్చిన రైతులు తిరిగి వెళ్ళిపోయారు. దీంతో సభా వేదిక వద్ద కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

ఆయేషా కేసుపై కోర్టులో సిట్ పిటిషన్

ప్రజాశక్తి - మొగల్రాజపురం (విజయవాడ)

ఆయేషా మీరా కేసు పునర్విచారణకు ప్రభుత్వం నియమించిన సిట్ బృందం విజయవాడ సెషన్స్ కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసును పునర్విచారిస్తున్నట్లు కోర్టుకు తెలుపుతూ సిట్ సభ్యులు శ్రీకాంత్, హిమావతి, శ్రీలక్ష్మీతో కూడిన బృందం ఈ పిటిషన్‌లో పేర్కొంది. అనంతరం బృందం రాష్ట్ర డిజిపి ఎన్.సాంబశివరావును కలిసి కార్యాచరణపై చర్చించారు. ఈ బృందంతోపాటు విజయవాడ పాయకాపురం సిఐ సహేరాబేగం ఉన్నారు.

టాలీవుడ్ కంటే బాలీవుడ్ గొప్ప అని ఎవరు చెప్పారు?

– తాప్సి



"ఇంతకు ముందు ఏ సినిమా వచ్చినా చేసేదాన్ని. అప్పుడు పెద్దగా సక్సెస్ ఉండేది కాదు. అందుకే 2, 3 సంవత్సరాల నుండి నాకు నచ్చిన సినిమాలు, చేయాలనుకున్న సినిమాలు మాత్రమే చేస్తున్నాను. అందుకే సక్సెస్‌లు వస్తున్నాయి" అని తాప్సి పేర్కొంది. మహి వి రాఘవన్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఆనందో బ్రహ్మ'. ఈ శుక్రవారమే రిలీజ్ కానుంది. చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన తాప్సి గురువారం విలేకరులతో మాట్లాడారు.

హార్రర్ సినిమాలే ఎక్కువ చేస్తున్నారు?

హార్రర్ సినిమాలంటే అస్సలు ఇష్టం ఉండదు. ఎక్కువ చూడను కూడా. ఈ సినిమా ఎందుకు ఒప్పుకున్నానంటే ఇది హార్రర్ కామెడీ. ఇందులో సన్నివేశాలు నవ్వు తెప్పిస్తాయి. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని పాయింట్ ఇందులో ఉంది. అందుకే బాగుంటుందనిపించి చేశాను. నేనీ సినిమా చేస్తున్నానంటే నా సహ నటీనటులు కూడా నమ్మలేకపోయారు.

రాఘవన్ కథ చెప్పగానే ఏమనిపించింది?

మహి వి రాఘవన్ కథ చెప్పిన ఐదు నిముషాలకే ఒప్పేసుకున్నాను. ఎందుకంటే కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది. మామూలుగా దెయ్యాల్ని చూసి మనుషులు భయపడతారు కానీ ఇందులో మనుషుల్ని చూసి దెయ్యాలు భయపడతాయి. అందుకే కాన్సెప్ట్ చాలా బాగుంటుందనిపించింది.

స్క్రిప్ట్‌లో ఏమైనా సూచనలు ఇచ్చారా?

సాధారణంగా సౌత్ సినిమా స్క్రిప్ట్‌లో నేను పెద్దగా ఇన్వాల్వ్ అవ్వను. ఎందుకంటే నాకు భాష రాదు కాబట్టి. కానీ ఈ సినిమాలో మాత్రం డైరెక్టర్ మహి చాలా సీన్లు ఎలా తీస్తే బాగుంటుందో చెప్పమని నన్ను అడిగేవాడు. నేను చెప్పినవి బాగుంటే చేయడమో బాగోలేకుంటే తనకు నచ్చింది చేయడమో చేసేవాడు. అంటే దర్శకుడిని కాబట్టి అంతా నేనే అనే భావన అతనిలో ఉండేది కాదు.

ఇకపై ప్రతి తెలుగు సినిమాకూ ఇలాగే ప్రమోషన్స్ చేస్తారా?

ఇందులో పెద్ద హీరో లేడు. కాబట్టి సినిమాలోని డిఫరెంట్ కాన్సెప్ట్ నే బేస్ చేసుకుని ప్రమోషన్లు చేయాలని నిర్ణయించుకుని ఇలా చేస్తున్నాం. సినిమా జనాలకు చేరాలంటే ప్రమోషన్లు చేయాల్సిందే. ఇకపై కూడా నా సినిమాలకు ఇలానే చేస్తాను.

ఇకపై కమర్షియల్ సినిమాలు చేయరా?

నేను కమర్షియల్ సినిమాలు చూస్తూనే పెరిగాను. మంచివైతే గ్లామర్ రోల్స్, కమర్షియల్ మూవీస్ చేయడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు.

హిందీలో రెండు హిట్లు దక్కాయి కదా ఇప్పుడు మీకు స్టార్ హీరోయిన్ స్టేటస్ వచ్చిందని మీరు భావిస్తున్నారా?

నాకు నేను ఎప్పుడూ స్టార్ అని ఫీలవ్వను. ఎందుకంటే ప్రతి రోజూ కష్టపడాల్సిందే. కొత్త, మంచి స్క్రిప్ట్స్ వెతుక్కోవాలి. అవి చేయగలనని ఎదుటివాళ్లను నమ్మించాలి. జనాల్ని థియేటర్లకు వచ్చేలా చేయాలి. ఇన్ని పనుల మధ్య స్టార్ అనే భావనే నాకు రాదు.

మహి వి రాఘవన్ దర్శకత్వం ఎలా ఉంది?

క్లారిటీ ఉన్న దర్శకుడు. తనకేం కావాలో బాగా తెలుసు. కష్టపడతాడు. డైరెక్టర్ అనే భావన అస్సలు ఉండదు. తనని తానే విమర్శించుకుంటాడు. దాంతో బెస్ట్ ఔట్ పుట్ ఇవ్వగలడు.

ఇంకో మెట్టు ఎదగడం కోసమే బాలీవుడ్‌లోకి వెళ్ళారా?

అదేం లేదు. అయినా టాలీవుడ్ కన్నా బాలీవుడ్ గొప్పని ఎవరు చెప్పారు. వాస్తవంగా చూసుకుంటే హిందీ సినిమాల కన్నా తెలుగు సినిమాలే బాగా వసూళ్ళు చేస్తున్నాయి. టాలీవుడ్ మంచి లాభాల్లో ఉంది. ఈ సంవత్సరం చాలా బాలీవుడ్ సినిమాలు సరిగా ఆడలేదు.

బాలీవుడ్ స్టార్ హీరోలు ఎందుకు విఫలమవుతున్నారు?

వాళ్ళు భిన్నంగా ప్రయత్నిస్తున్నారు. కానీ ప్రేక్షకులకు ఏం కావాలో తెలుసుకోవడంలో ఫెయిల్ అవుతున్నారని నా అభిప్రాయం.

మీ డ్రీమ్ రోల్?

డ్రీమ్ రోల్ అంటూ ఏం లేదు. నాకు స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం. అందుకే స్పోర్ట్స్ బయోపిక్ చేయాలని ఉంది.

మీ కెరీర్లో మీ గోల్ ఏంటి?

నేను చేసిన సినిమాకు వెళితే కొన్న టికెట్‌కు న్యాయం జరుగుతుందని ఆడియన్స్ నమ్మేలా చేయాలి. అదే నా కెరీర్లో నా గోల్.

భ్రమల్లో బ్రతికే అమ్మాయి

మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై లక్ష్మి మంచు ప్రధాన పాత్రలో రూపొందనున్న సినిమా ప్రారంభమైంది. విజయ్ యలంకంటి దర్శకుడిగా పరిచయమవుతు నిర్మిస్తున్న చిత్రమిది. హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా షూటింగ్ ప్రారంభమైంది. పూజానంతరం మంచు మనోజ్, ప్రణతి దంపతులు, మంచు లక్ష్మి కూతురు విద్యా నిర్వాణ స్క్రిప్ట్‌ను నిర్మాత మంచు లక్ష్మి, డైరెక్టర్ విజయ్‌లకు అందించారు.

మంచు లక్ష్మి మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత మా బ్యానర్ నుంచి వస్తున్న సినిమా ఇది. నిజం కాని విషయాన్ని నిజమని భావించే ఓ యువతి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. ఈ సినిమా, మనిషి ఎమోషన్స్, రిలేషన్‌షిప్స్ చుట్టూనే కథంతా తిరుగుతుంది. విజయ్ ఇప్పటికే ఈగ, బాహుబలి–1 సినిమాలకు రాజమౌళి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. ఈ సినిమాతో కచ్చితంగా తన ప్రతిభను నిరూపించుకుంటాడు' అన్నారు.



మంచు లక్ష్మీ, విజయ్ యలంకంటి, మనోజ్, ప్రణతి తదితరులు



బాలకృష్ణ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'పైసా వసూల్'. పూరి జగన్నాథ్ దర్శకుడు. ఈ సినిమా ఆడియో విడుదల వేడుక ఖమ్మంలోని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ, బోయపాటి శ్రీను, దర్శకుడు క్రిష్, పూరీ జగన్నాథ్ తదితరులు హాజరయ్యారు.

నవ్వించడంలో 'మహానుభావుడు'



శర్వానంద్, మెహరీన్ జంటగా, మారుతి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రానికి 'మహానుభావుడు' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. యు.వి.క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ, ప్రమోద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాట మినహా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. గురువారం నుండి డబ్బింగ్ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇటలీ, ఆస్ట్రియా, క్రోయోషియా తదితర దేశాల్లో చిత్రీకరణ జరుపుకుంది. ఈనెల 24న ఈ చిత్రానికి సంబంధించి ఫస్ట్‌లుక్, టీజర్‌ని విడుదల చేస్తున్నారు. పక్కా ఫ్యామిలి ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కింది.

నిర్మాతలు మాట్లాడుతూ "రన్ రాజా రన్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' చిత్రాల తరువాత శర్వానంద్ హీరోగా చేస్తున్న మూడో చిత్రమిది. మారుతి చెప్పిన పాత్ర దాని నుండి వచ్చిన కామెడీ నచ్చి వెంటనే చిత్రాన్ని తెరకెక్కించాం. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. శర్వానంద్‌కి మా బ్యానర్‌లో మరో మంచి చిత్రంగా నిలుస్తుంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి విజయదశమికి విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నామ'ని అన్నారు.దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'భలే భలే మగాడివోయ్' చిత్రం తరువాత బాగా నచ్చిన పాత్ర చిత్రీరణతో చేస్తున్న సినిమా ఇది. అన్ని పక్కాగా అనుకున్న తరువాత సెట్ మీదకి వెళ్ళాం. శర్వానంద్ కెరీర్‌లో ఈ చిత్రం బెస్ట్ చిత్రంగా నిలుస్తుందని నమ్మకముంది. శర్వానంద్ చాలా బాగా చేశాడు. ఫుల్ కామెడీ ఉంటుంది. థమన్ ఆకట్టుకునే బాణీలు అందించాడు. మ్యూజికల్ లవ్ స్టోరీగా చిత్రం ఉంటుంద'ని తెలిపారు.

ఫైట్ మాస్టర్ విజయ్ తనయుని సినిమా

మూడు దశాబ్దాలుగా స్టార్ హీరోల సినిమాలకు ఫైట్ మాస్టర్‌గా పని చేశాడు విజయ్. ఇప్పుడు తన తనయుడు రాహుల్ విజయ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నాడు. రాహుల్ హీరోగా రూపొందనున్న చిత్రం గురువారం ప్రారంభమైంది. ఈ సినిమాకు రాము కొప్పుల దర్శకుడు. దివ్య విజయ్ నిర్మాత. వి.ఎస్.క్రియేటివ్ వర్క్స్ బేనర్‌పై రూపొందుతోంది. అన్నపూర్ణ స్టూడియోలో లాంఛనంగా మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి వి.వి.వినాయక్ క్లాప్ కొట్టగా, విజయన్ మాస్టర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. పూరి జగన్నాథ్ గౌరవ దర్శకత్వం వహించారు.

అనంతరం మాస్టర్ విజయ్ మాట్లాడుతూ 'ముప్పై ఏళ్లుగా ఇండస్ట్రీ నాకెంతో అండగా నిలబడింది. నేను ఇండస్ట్రీకి చాలా రుణపడిపోయాను. ఆ రుణం తీర్చుకోవడానికి నేను మా అబ్బాయి రాహుల్ విజయ్‌ను హీరోగా, దివ్య విజయ్‌ను నిర్మాతగా పరిచయం చేస్తున్నాను. దర్శకుడు రాము చెప్పిన కథ బాగా నచ్చింది. నన్ను ఆదరించిన తరహాలోనే మా అబ్బాయి, అమ్మాయిని ఆదరించాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

దర్శకుడు రాము కొప్పుల వెల్లడిస్తూ 'సుకుమార్ దర్శకత్వంలో పనిచేశాను. కథ నచ్చడంతో విజయ్ అవకాశం ఇచ్చారు. రాహుల్‌కి సరిపోయే కథ. స్క్రిప్ట్ బాగా వచ్చింది. ఈ నెల 21న రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తాం. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో జరిగే షెడ్యూల్స్‌తో సినిమా పూర్తవుతుంది" అని అన్నారు.



రాహుల్ విజయ్, వినాయక్

నిర్మాత దివ్య విజయ్ మాట్లాడుతూ 'మేఘానంద్, సత్యానంద్ వద్ద రాహుల్ శిక్షణ తీసుకున్నాడు. హీరోయిన్ ఎంపిక కావాలి. అనుభవం గల సీనియర్ సాంకేతిక సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు.

హీరో రాహుల్ విజయ్ మాట్లాడుతూ 'లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. లవ్ మెయిన్ ఎలిమెంట్‌గా మిగిలిన ఎలిమెంట్స్‌గా అన్ని దానికి లింక్ అయి ఉంటాయి" అని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 8న 'యుద్ధం శరణం'



నాగ చైతన్య హీరోగా 'యుద్ధం శరణం' తెరకెక్కుతోంది. మేకింగ్ చివరి దశకు చేరుకుంది. దాదాపు అన్ని పనుల్నీ ముగించిన చిత్ర యూనిట్ ప్రచార, విడుదల సన్నాహాలు చేస్తోంది. టీజర్‌తో పాజిటివ్ క్రేజ్‌ను సంపాదించుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ ఎనిమిదిన విడుదల చేయనున్నట్లు గురువారం చిత్ర నిర్మాతలు ప్రకటించారు.

తమిళ దర్శకుడు కృష్ణ ఆర్వి మరిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి హీరోయిన్. సీనియర్ నటుడు శ్రీకాంత్ పూర్తి స్థాయి విలన్‌గా కనిపించనున్నాడు. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి నిర్మిస్తున్నాడు. 'పెళ్లి చూపులు' ఫేమ్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ చేస్తున్నారు.



దీపికా పదుకొనే

ఆ లిస్ట్‌లో దీపికా లేదు

ఆసియా నుంచి ఏ ఒక్కరికీ ఫోర్బ్స్ జాబితాలో దక్కని స్థానం

ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా పారితోషికంగా తీసుకుంటున్న స్టార్స్ జాబితాను ప్రతి ఏటా ఫోర్బ్స్ విడుదల చేస్తూ ఉంటుంది. గత ఏడాది దీపికా పదుకొనే ఈ జాబితాలో పదో స్థానంలో నిలిచింది. అప్పుడే బాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కు వెళ్లడం ఈ లిస్ట్‌లో తన పేరు మెరవడం రెండూ ఒకేసారి కలిసొచ్చాయి. ఈ ఏడాది హాలీవుడ్‌లో ఆమె చేసిన 'ట్రిపులెక్స్ ది రిటర్న్ ఆఫ్ జెండర్ కేజ్' చిత్రం విడులైంది. ఇందులో దీపికా నటనకు మంచి మార్కులు కూడా పడ్డాయింది. ఈ సినిమాలో చేసినందుకు గానూ ఆమె ఏకంగా 10మిలియన్ డాలర్లను పారితోషికంగా పొందింది. దీని తర్వాతే రెమ్యునరేషన్ పెంచేసింది. ప్రస్తుతానికి హాలీవుడ్ చిత్రాలేమీ లేకపోయినా బాలీవుడ్‌లో 'పద్మావతి'లో మాత్రం చేస్తోంది. అయితే ఈ ఏడాది కూడా ఫోర్బ్స్ జాబితాలో దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రాల పేర్లు ఉంటాయని తమ అభిమానులంతా ఆశించారు. కానీ వీరి పేర్లే కాదు ఆసియా నుంచి ఏ ఒక్క స్టార్ పేరూ ఆ జాబితాలో లేకపోవడం గమనార్హం.

2017గాను అత్యధిక పారితోషికం తీసుకుంటున్న వారిలో మొదటి వ్యక్తిగా ఆస్కార్ విన్నర్ 'లా లా లాండ్' ఫేమ్ ఎమ్మాస్టోన్ నిలిచారు. ఈమె 26 మిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే అత్యధికంగా పారితోషికం పొందుతున్న నటిగా ఫోర్బ్స్ పేర్కొంది. జెన్నీఫర్ అనిస్టన్(25.5 మిలియన్ డాలర్లు), జెన్నీఫర్ లారెన్స్(24మిలియన్ డాలర్లు), మెలిస్సా మైెక్‌కార్తి(18 మిలియన్ డాలర్లు), మిలా కునిస్(15.5 మిలియన్ డాలర్లు), ఎమ్మా వాస్టన్(14), చార్లైజ్ థెరాన్ (14 మిలియన్ డాలర్లు)లు వరుసగా తర్వాత స్థానాల్లో ఉన్నారు.

వాటికి వ్యతిరేకిని

ఈ మధ్య ఎక్కువగా హీరోయిన్ ఓరియెంటెడ్ కథలు రావాడం లేదు. వచ్చినా అవి ప్రేక్షకాదరణ పొందడం లేదు. ఆ తరహాలో వచ్చిన 'ఫిదా' చిత్రం మాత్రం బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపిస్తోంది. అందులో సినిమా అంతా తానై నడిపించిన సాయి పల్లవి నటనతో ఆడియన్స్ ఫిదా అయిపోయారు. దీంతో పారితోషికం కూడా పెంచేసిందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ కథానాయిక నాని హీరోగా రూపొందుతోన్న 'మిడిల్ క్లాస్ అబ్బాయి(ఎంసీఏ)'లో చేస్తోంది. ఆమె ఇప్పటి వరకూ చేసిన సినిమాల్లో ఎక్కడ చూసిన అభ్యంతరకరమైన పాత్రలు కానీ, మాటలు కానీ కనిపించవు. ఎంతైనా నటనకే ప్రాధాన్యం. ఈ అమ్మాయి ఇప్పుడో షరత్తు కూడా విధించింది. గ్లామర్ షో క్యారెక్టర్స్ చేయనని అంతకంటే ముఖ్యంగా ముద్దు సన్నివేశాల్లో నటించేందుకు తాను పూర్తిగా వ్యతిరేకినని పేర్కొంది. అటువంటివి కథలో ఉంటే వాటిని తన ముందుకు తీసుకురావద్దని స్పష్టం చేసింది. 'ఏదో నాకు ఇష్టమైన డాన్స్ వల్ల సినిమాల్లో చేస్తున్నాను. డాక్టర్ కావాలన్న నా కలను నెరవేర్చుకోవాలని నా తల్లిదండ్రులు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే అది ఒత్తిడి కాదు నా బాధ్యతను గుర్తు చేస్తున్నట్టు. కాబట్టి నేను దాన్ని చేయాలి. అందుకే దానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఏదో సరదాగా సినిమాలు చేస్తున్నాను' అని చెప్పింది సాయి పల్లవి.



సాయి పల్లవి

పత్తిలో గులాబీ రంగు పురుగు

అతివృష్టి, అనావృష్టి, మొత్తంగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వివిధ పంటల్లో చీడపీడల నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. రాష్ట్రంలో ఈఏడాది ఖరీఫ్ పరిస్థితి దాగుడుమూతలాటలా ఉంది. ఒక్కోచోట భారీ వర్షాలు, రాయలసీమలో వర్షాభావం, కొన్నిచోట్ల అటూ ఇటూగాని పరిస్థితి ఉంది. ఇంతవరకు ఏ పంటలూ వేయని విస్తీర్ణాల్లో చిరుధాన్యాలు, కంది తదితర అపరాలకూ ఇంకా ఈనెలాఖరు వరకు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నేటికీ అక్కడక్కడా వరి నాట్లు ఆలస్యమైన ప్రాంతాలున్నాయి. ఇప్పటికే పలు పంటలు చేపట్టిన ప్రాంతాలూ 50 శాతానికి పైగానే ఉన్నాయి. ఈనేపథ్యంలో ఖరీఫ్‌లో ఇంతవరకు వేసిన పంటలకు సంబంధించి తాజా వాతావరణ పరిస్థితులను బట్టి, ఆయా పంటల వయసును బట్టి చీడపీడల నివారణకు ఈ వారంలో తీసుకోవాల్సిన చర్యల గురించి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కె.రాజారెడ్డి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆ వివరాలు...

రాయలసీమలోని అనంతపురం, కర్నూలు జిల్లాల్లో వేసిన పత్తిలో గులాబీ రంగు పురుగు ఆశిస్తున్నట్లు గుర్తించారు. ఆయా జిల్లాల్లోనూ, ఇటీవల పత్తి వేసిన మిగతా జిల్లాల్లోనూ ఈ పురుగు నివారణకు తగిన జాగ్రత్తలన్నీ పాటించాల్సిన అవసరముంది. గులాబీ రంగు పురుగు గుడ్లను గూడ, పువ్వు, రక్షక పత్రాల మధ్యలో, మొగ్గలు, కాయల మీదా పెడుతుంది.



- గుడ్లు పొదిగిన వెంటనే పురుగులు వెంటనే కాయలోకి ప్రవేశించేస్తాయి. అందువల్ల రసాయనిక మందుల పిచికారీ వల్ల ప్రయోజనం కనిపించదు. కానీ కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల వీటి ఉధృతిని బాగా తగ్గించుకునే వీలుంది.
- పంట విత్తిన 45 రోజుల నుంచి ఈ పురుగు ఉనికిని గుర్తించడానికి ఎకరాలకు 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. వీటిలో వరుసగా మూడు రోజుల పాటు 8 రెక్కల పురుగులు పడితే వెంటనే సస్య రక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.
- కింద రాలిపోయిన మొగ్గలు, పిందెలు, పగలకుండా ఉండిపోయిన గుడ్డికాయలను ఏరి నాశనం చేయాలి.
- ట్రైకోగామా పరాన్న జీవులను ఎకరానికి 60 వేల చొప్పున పూత పూర్తి స్థాయిలో ఉన్నప్పుడు విడుదల చేయాలి. ఇందువల్ల పురుగును గుడ్డు దశలో నివారించవచ్చు.
- గులాబీ రంగు పురుగు గుడ్లను గమనించడం కష్టం. అందువల్ల పురుగు గుడ్లను పొదగకుండా 5% వేప గింజల కషాయం లేదా 5 మి.లీ. వేపనూనెను ఒకలీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఆర్థిక నష్ట పరిమితి దాటితే క్లోరోఫైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వరినాట్లు ఆలస్యమైతే: వరినాట్లు ఆలస్యమైతే **ఉల్లికోడు** ఆశించే వీలుంది. నాటాక ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే 10–15 రోజుల మధ్య ఎకరానికి 10కిలోల కార్బొఫ్యూరాన్ 3జి లేదా ఫోరేట్ 10జి 5 కిలోలు వేసి నివారించాలి.

మొక్కజొన్న: పైరు విత్తిన 20–25 రోజుల దశలో ఎకరానికి 20 కిలోలు నత్రజని అందించాలి.

ఆకులు పసుపురంగులోకి లేదా లేత పైరు తెల్లమొగ్గగా మారినా జింకులోపం ఉన్నట్లు గుర్తించాలి. లీటరు నీటికి 2.0 గ్రా. చొప్పున జింక్ సల్ఫేట్‌ను వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసి ఈ లోపాన్ని నివారించుకోవచ్చు.

వేరుశనగ: రాయలసీమ, అలాగే కోస్తా జిల్లాల్లో మొదట విత్తిన వేరుశనగ పూత, పిందె దశల్లో ఉంది. ఈ దశలో తామర పురుగు, పచ్చదోమ, వేరుపురుగులను గమనించారు.
ఆకులోని రసం పీల్చే తామర పురుగు, పచ్చదోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్.ఎల్ 60 ఎం.ఎల్. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సజ్జ: విత్తిన 30 రోజుల తర్వాత దంతితో అంతర కృషి చేయాలి.
ఆతర్వాత భూమిలో తేమ ఉన్నప్పుడు ఎకరాకు 10కిలోల నత్రజనినిచ్చు ఎరువును పైపాటుగా వేయాలి. వెర్రికంకి తెగులు లేత మొక్కలపై ఆశిస్తే ఆకులు పసుపురంగులోకి మారతాయి. వాటి అడుగున తెల్లటి బూజు ఏర్పడుతుంది. దీని నివారణకు రిడోమిల్ 25 డబ్ల్యూ.పి. మందు 1గ్రా./లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

కంది: కంది పంటను ఆగస్టు ఆఖరు వరకు వేసుకోవచ్చు. విత్తుట ఆలస్యమైతే నేల తీరును బట్టి సాళ్ల మధ్య దూరం తగ్గించి. మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండేటట్లు విత్తుకోవాలి. కందిని ఒకే పంటగా కాకుండా కంది+కొర్ర 1:7 నిష్పత్తిలో వేసుకుంటే లాభదాయకంగా ఉంటుంది.



- డాక్టర్ కె.రాజారెడ్డి,
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్‌జి రంగా
వ్యవసాయ విశ్వవిద్యాలయం.



పొదుగు వాపు-జాగ్రత్తలు

పాడి పశువులకు పొదుగు వాపు వ్యాధి సోకితే పాల దిగుబడి, నాణ్యత గణనీయంగా పడిపోతాయి. ఒక్కోసారి సూక్ష్మజీవుల ప్రభావం ఎక్కువై ఆ పాలను వినియోగించడానికీ వీలుండదు. వ్యాధిగ్రస్థ పశువుల విలువ తగ్గిపోతుంది. రైతులు పాడి పశువుల సంరక్షణలో తగు జాగ్రత్తలు పాటిస్తే, రాకుండానే ఈ వ్యాధిని నివారించవచ్చు.

పొదుగుకు దెబ్బ తగిలి గాయాలు కావడం, అపరిశుభ్ర వాతావరణంలో పాలు పితకడం, సరిగ్గా పితక పోవడం, ఎలర్జీ, బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాలు, మైకో ప్లాస్మా ప్రమేయం ఇవన్నీ పొదుగు వాపు వ్యాధి కారకాలే. ఈ వ్యాధి సోకినప్పుడు పొదుగు, చనుకట్లు వాచి గట్టిగా తయారై నొప్పి కల్గిస్తాయి. పాల ఉత్పత్తి సరిగ్గా ఉండదు. పాలను పరీక్షిస్తే అందులో రక్తం గానీ, చీము గానీ కనిపిస్తుంది. పాలు దుర్వాసన వస్తాయి. పశువులు నొప్పితో సరిగ్గా నడవలేవు. జ్వరం అధికంగా ఉండి మేత మేయవు. శ్వాస కష్టంగా పీలుస్తాయి. సకాలంలో వైద్యం అందించకుంటే పొదుగు కణ జాలం గట్టిపడి పొదుగు సైజు కుదించుకుపోతుంది. ఒక నల్లని గుడ్డపై కొన్ని ధారల పాలును పితికి చూస్తే రక్తం, చీము కనిపిస్తాయి. ఆ వెంటనే చికిత్స చేయించాలి. విచక్షణ రహితంగా మందులు వాడినా, చికిత్స ఆలస్యం చేసినా వ్యాధి నయం కాకపోగా మరింత కష్టతరమవుతుంది. ఒక భాగం నుంచి మిగతా భాగాలకూ ఈ వ్యాధి వ్యాపిస్తుంది.

పాలను పరీక్ష చేయించాలి..

పాలలోని వ్యాధికారక సూక్ష్మజీవులను ప్రయోగశాలలో గుర్తించి వాటిపై ఏ మందులు పని చేస్తాయో సెన్సిటివిటీ పరీక్షల ద్వారా తెలుసుకోవాల్సి ఉంటుంది. ఆధునిక యాంటీబయోటిక్, యాంటీ హిస్టమిన్, కార్టిజోన్ ఇంజక్షన్లను అవసరాన్ని బట్టి వాడాలి.

విటమిన్ ఇ, సెలీనియం, ఖనిజ లవణాల వాడకంతో పొదుగు వాపు సమస్య వ్యాధి కాల వ్యవధి తగ్గుతుంది. జింక్, కాపర్ ఖనిజ లవణాల వాడకంతో పొదుగు వాపు సోకే అవకాశాలు తగ్గుతాయి. ఖనిజ లవణం, విటమిన్ల మిశ్రమాన్ని మేతలో భాగంగా అందించాలి.

యాంటీబయోటిక్స్ వాడితే 70 శాతం కేసులు నయమవుతున్నా, పాలల్లో వాటి అవశేషాలతో మనుషులకు చర్మవ్యాధులు, జీర్ణకోశ, ఎలర్జీ సమస్యలు వస్తాయి. ఈ పాలు తోడుకు పనికిరావు. వీటి ద్వారా తయారుచేసే చీజ్ వంటి ఉత్పత్తుల్లో నాణ్యత తగ్గుతుంది. పొదుగుకు గాయమైనా, చనుకట్లు పగిలినా, లేగ దూడలు వాటిని కొరికి గాయపరిచినా, పొదుగు సైజు ఎక్కువ, లేదా తక్కువైనా పాలు పితుకుతుండగా అకస్మాత్తుగా అవి వాచినా సకాలంలో చికిత్స అందించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు


- వ్యాధి సోకిన పశువును ఇతర పశువుల నుంచి వేరుగా ఉంచాలి. వ్యాధి సోకిన పశువుల పాలను పూర్తిగా పితికి పారబోయాలి.
- పాలు పూర్తిగా పితకకున్నా పొదుగు వాపు వచ్చే అవకాశాలుంటాయి. కాబట్టి పొదుగులోని పాలను వేగంగా సంపూర్ణంగా పితకాలి.
- వ్యాధిగ్రస్థ పశువుల పాలను లేగ దూడలు తాగకుండా చూడాలి.
- ముళ్ల పొదలు, కంచెల ద్వారా గాయాలు కాకుండా సంరక్షించాలి.
- పాకలో నేలపై మేకులు, ఇనుప వస్తువులు, గాజు పెంకులు లేకుండా చూడాలి.
- కొట్టాల్లో పేడ, మూత్రం, తేమ, బురద, దుమ్ముతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలి. ఉదయం, సాయంత్రం పశుల పాకలను శుభ్రం చేస్తుండాలి.
- పశువుల సంఖ్యకు అనుగుణంగా కొట్టాలను ఏర్పాటు చేసుకోవాలి. గాలి, వెలుతురు ప్రసరించేలా వాటిని నిర్మించుకోవాలి. అధిక, అల్ప ఉష్ణోగ్రతల నుంచి సంరక్షించే విధంగా అవి ఉండాలి.
- పాలు పితికే ముందు పొదుగును శుభ్రం చేయాలి. యాంటీసెప్టిక్ ద్రావణంతో చేతులను శుభ్రం చేసుకోవాలి. పాలు పితికిన తర్వాత పొదుగును మళ్లీ శుభ్రం చేయాలి. పొదుగు, చనుకట్లను ఆయోడోఫర్, క్లోరెక్సిడిన్ మందులతో కడగాలి.
- పాలు పితికిన తర్వాత అరగంట దాకా పశువు నిలబడి ఉండేలా చూడాలి. అందువల్ల చనుకట్ల రంధ్రాలు బిగుసుకుపోయి, సూక్ష్మజీవులు లోనికి ప్రవేశించకుండా ఉంటాయి.
- పొదుగు వాపు వ్యాధి ఎక్కువగా సంకర జాతి ఆవులు, ముర్రా జాతి గేదెలకు సోకుతుంది. వీలున్నప్పుడల్లా పాల నమూనాలను తీసి పరీక్షించుకోవాలి.
- పాడి పశువులను కొనే ముందు పొదుగు ఆరోగ్యంగా ఉందో లేదో పరిశీలించాలి. వాటి పాలను పరీక్షించిన తర్వాతే మందలో కలపాలి.
- గాలికుంటు, మసూచి, మెట్రైటిస్ లాంటి వ్యాధులు సోకినప్పుడు పొదుగుపై బొబ్బలు ఏర్పడి పొదుగు వాపునకు దారితీస్తాయి. అందువల్ల రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తతతో తగిన జాగ్రత్తలు తీసుకుంటుండాలి.

పరికరాలు వాడితే..

పాలు పితికేందుకు విద్యుత్ పరికరాలు వాడితే ఓల్టేజీలో తేడాతో పీడనం ఎక్కువై చనులు, పొదుగు వాపునకు గురవుతాయి. విద్యుత్ సరఫరాలో వ్యత్యాసం లేకుండా చూసుకోవాలి. పరిశుభ్ర పరిసరాల్లో, యాజమాన్య పద్ధతులు పాటిస్తే పొదుగు వాపు వ్యాధి నుంచి పాడి పశువులను సంరక్షించుకోవచ్చు.



- డాక్టర్ జి.రాంబాబు,
పశువైద్యాధికారి, కడప.



పొడుపు కథ

పోకంగ పొట్టి బావ..
కాగంత కడవ మోసాడు..?

సేకరణ : [illegible]

జోక్స్

బంటి : మా టీచర్‌కి దైవభక్తి ఎక్కువ తెలుసా...?
చింటు : ఎందుకు రా..?
బంటి : నేను ఏ సమాధానం చెప్పినా..
'ఓ మై గాడ్' అంటుంది..!
చింటు : ఆ..!



రాత్రిపూట చెట్ల కింద పడుకోవచ్చా?



పిల్లలూ...! మీకు తెలుసు కదా! మనం ప్రాణంతో ఉండటానికి ఆక్సిజన్ వాయువు అవసరం ఎంతో ఉంది. అందుకే ఆ వాయువును ప్రాణవాయువు అంటారు. వాతావరణంలోని గాలిలో ఉండే ఆక్సిజన్‌ను మనలాగా చెట్లు కూడా పీల్చుకుంటాయి. అలా పీల్చుకోవడమే కాకుండా పగటి పూట అవి ఆక్సిజన్‌ను వదిలి మనకు ప్రాణ వాయువును అందిస్తాయి. అవే చెట్లు రాత్రి వేళల్లో చెడు గాలిని వదులుతాయి. ఈ గాలిలో హానికరమైన కార్బన్ డై ఆక్సైడ్ ఉంటుంది. రాత్రివేళల్లో చెట్ల కింద పడుకుంటే, అవి ఆ సమయంలో ఎక్కువగా కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేయడం వల్ల మనకు అవసరమైన, కావల్సినంత ఆక్సిజన్ లభించదు. దాంతో మనకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందువల్లే రాత్రివేళల్లో చెట్లకింద పడుకోకూడదు. ఇదన్రా పిల్లలూ విషయం. ★

రంగులు వేయండి!



పిల్లలూ..! పైనున్న చిన్నారి బొమ్మకు ఆకర్షణీయమైన రంగులు వేయండి!



దంబుల్లా చేరుకున్న విరాట్ సేన

బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలెట్టిన ధోనీ

పల్లెకలె: శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌ల్లో తలపడేందుకు విరాట్‌సేన దంబుల్లాకు గురువారం చేరుకుంది. ఓ హోటల్‌లో క్రికెటర్లు విరాట్, ధోనీ, ఇతర సభ్యులకు ఘన స్వాగతం లభించింది. ఈ నెల 20న తొలి వన్డేలో శ్రీలంకతో భారత్ తలపడనున్న విషయం తెల్సిందే. 2019 ప్రపంచ కప్ జట్టులో స్థానం దక్కించుకోవాలంటే ఈ సిరీస్‌లో రాణించడమే లక్ష్యంగా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ దంబుల్లా చేరుకోగానే నెట్ ప్రాక్టీస్ పాల్గొన్నాడు. ధోనీ ప్రతిభ చూపకపోతే ప్రత్యామ్నాయం చూస్తామని సెలక్టర్లు హెచ్చరించిన నేపథ్యంలో 36 ఏళ్ల ధోనీ చివరి ప్రపంచకప్ జట్టులో స్థానం కోసం ఇప్పటి నుంచి మరింత కష్టపడాల్సి ఉంటుంది. నాలుగో బ్యాట్స్‌మెన్‌గా మిడిల్ ఆర్డర్‌లో భారీ పరుగులు చేయడంలో ఇటీవల ధోనీ విఫలమైయ్యాడు. దీంతో ధోనీ సరిగ్గా ఆడకపోతే రిటైర్‌మెంట్ కౌంట్‌డౌన్ మొదలయ్యినట్లే.

ఆస్ట్రియాపై భారత్ హాకీ విజయం

ముగిసిన యూరప్ టూర్



నెదర్లాండ్స్: యూరప్ టూర్‌లో భారత్ సీనియర్ హాకీ జట్టు అద్భుత విజయంతో ముగించింది. భారత డిఫెండర్లు రమణ్‌దీప్ సింగ్ (25,32 నిమిషాల్లో),చెంఘిలెన్స్‌న్ ఖాన్ (37,60) నిమిషాల్లో రెండేసి గోల్స్ చేయడంతో ఆస్ట్రియాపై 4-3తో టీమిండియా జయభేరి మోగించింది. ప్రపంచ ర్యాంక్‌ల్లో నాలుగో స్థానంలో ఉన్న భారత్ వరుసగా రెండు విజయాలతో సత్తా చాటింది. ఐదు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, రెండు ఓటములతో మెరుగైన ప్రదర్శనతో యూరప్ టూర్‌ను ముగించింది.

సిన్సినాటి క్వార్టర్స్‌కు సానియా

నాదల్ ముందుకు

ఒహియా(అమెరికా): సిన్సినాటి మాస్టర్స్‌లో టాప్ సీడ్, స్పెయిన్ రఫెల్ నాదల్ సునాయాసంగా మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. తొలి రౌండ్ బై లభించిన నాదల్ రెండో రౌండ్‌లో రిచర్డ్ గాస్కెట్‌పై 6-3, 6-4తో జయభేరి మోగించాడు. మూడో రౌండ్‌లో నాదల్ అల్బెర్టో రామోస్‌తో తలపడనున్నాడు. మహిళల డబుల్స్‌లో భారత్-చైనా ద్వయం సానియా మీర్జా- పెంగ్ షుయాయి జర్మనీ-ఉక్రెయిన్ జంట జులియా గార్జోశాండ్- ఓల్గా సావిచుక్‌పై 7-5,6-4తో జయకేతనం ఎగుర వేశారు. దీంతో క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. సెమీస్ బెర్త్ కోసం సానియా ద్వయం కామెలియా బెగు- రాలుకా ఓలారుతో తలపడనున్నారు.





ఎల్ఐసి క్రీడల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న శాప్ అసిస్టెంట్ డైరక్టర్ రమణ

ఉల్లాసంగా ఎల్ఐసి జోనల్ క్రీడాపోటీలు

ప్రజాశక్తి- స్పోర్ట్స్ డెస్క్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసి) జోనల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు విజయవాడలోని దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో ఉల్లాసంగా గురువారం ప్రారంభం అయ్యాయి. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తమ జెండాలతో మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. ఈ క్రీడలను శాప్ అసిస్టెంట్ డైరక్టర్ ఎస్‌వి రమణ ప్రారంభించి మాట్లాడారు. ఎల్ఐసి సంస్థ ఉద్యోగుల్లో క్రీడలను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న పోటీలు అభినందనీయమని ప్రశంసించారు. ఎల్ఐసి మచిలీపట్నం మార్కెటింగ్ మేనేజర్ డిఆర్‌కెఆర్ఎం శివరామ్, సౌత్ సెంట్రల్ జోన్ రీజనల్ మేనేజర్ కెవీపివి నర్సింహం పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఫలితాలు : పురుషుల విభాగంలో కె. కిషోర్ కుమార్(హైదరాబాద్) జి శ్రీనివాసరావు(మచిలీపట్నం)పై 21-11, 21-4తోను,ఎల్ సుధీర్ బాబు (విశాఖ) చంద్ర మౌళి (బెంగళూరు)పై విజయం సాధించి సెమీస్‌కు చేరారు.ఎ కామేష్ బాబు(హైదరాబాద్) కె రాజ్‌కుమార్(నెల్లూరు)పై 21-5, 21-11తోను, నాగ వినాయక్ (హైదరాబాద్) కె రాజ్‌కుమార్(నెల్లూరు)పై 21-11,21-8తో ఓడించి సెమీస్‌కు చేరారు. మహిళల విభాగంలో చంద్రప్రభ (ధార్వాడ్) అరుంధతి షెనాయ్(బెంగళూరు)ను21-17,21-12తో, అనుపమ (బెంగళూరు) మైథిలీ రామర్స్(హైదరాబాద్)ను ఓడించి సెమీస్‌కు చేరారు.

అండర్-19 ప్రపంచకప్‌కు కివీస్ ఆతిథ్యం

- జనవరి 13 నుంచి టోర్నీ ప్రారంభం
- షెడ్యూలు విడుదల చేసిన ఐసిసి

క్రైస్ట్‌చర్చ్: 2018 ఐసిసి అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్ ఖరారైంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు 22 రోజుల పాటు జరిగే ఈ టోర్నీకి న్యూజిలాండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఆ దేశంలోని క్రైస్ట్‌చర్చ్, క్వీన్స్‌టౌన్,తరుంగ, వాంఘైరి సిటిల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. 16 జట్లు నాలుగు గ్రూప్‌లుగా తలపడే ఈ టోర్నీలో ప్రతి గ్రూప్ నుంచి టాప్ రెండులో నిలిచిన మొత్తం 8 దేశాలు క్వార్టర్స్‌కు చేరతాయి. ఈ ఎనిమిది జట్లు తుదిపోరుకు సమాయత్తం అవుతాయి. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య కివిస్‌తో విండీస్ పోరు సలపనుంది. జనవరి 14న ఇండియా తన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతోను, ఆ తర్వాత 16న పపూ న్యూగినా, 19న జింబాబ్వేతో తలపడనుంది. జనవరి 8 నుంచి 11 వరకు జట్ల మధ్య సన్నాహక మ్యాచ్‌లు జరుగుతాయి. మొత్తం 44 మ్యాచ్‌ల్లో 20 మ్యాచ్‌లను ఐసిసి ప్రసారం చేయనున్నట్లు ప్రకటించింది.

International Cricket Council

తమిళ్ జట్టుకు ఢిల్లీ షాక్

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో దంబంగ్ ఢిల్లీ చేతిలో తమిళ్ తలైవాస్ జట్టు అనుహ్యంగా పరాజయం పాలైంది.నువ్వానేనా అన్న రీతిలో సాగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ తమిళ్ జట్టుపై 30-29 తేడాతో జయభేరి మోగించింది. ప్రత్యక్ష దాడులతో తలైవాస్‌పై 14-10 పాయింట్లతో ముందంజ వేసినా ఢిల్లీ టాకిల్, ఆలౌట్ పాయింట్లలో వెనుకపడిన ఎక్స్‌ట్రా పాయింట్లతోను తన సత్తాను చాటింది. మ్యాచ్ ముగిసే ఐదు నిమిషాల వరకు పాయింట్లతో ముందంజలో నిలిచిన తలైవాస్ ఆటగాళ్లు ఢిల్లీ రైడర్ల దూకుడుకు కుదేలయ్యారు. తొలి అర్ధభాగం ముగిసేటప్పటికీ ఇరుజట్లు 12-12తో సమానంగా నిలిచాయి. రెండో అర్ధభాగంలో తమిళ్ జట్టు పైచేయిగా నిలిచిన చివర్లో పట్టు వదిలేయడంతో మ్యాచ్ చేజారింది. దీంతో ఈ సీజన్‌లో ఢిల్లీ అదిరే విజయాన్ని సొంతం చేసుకుంది. ఢిల్లీ స్టార్ ఆటగాడు మీరాజ్ 9 పాయింట్లు , మొగసొదులు 11 పాయింట్లతో దుమ్ము రేపారు.

జెయింట్స్ దూకుడుకు కళ్లెం
మ్యాచ్‌ను డ్రా చేసిన వారియర్స్

సొంతగడ్డపై కొత్త జట్టుగా వరుసగా ఐదు విజయాలతో దూకుడు మీద ఉన్న గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్ ఎదురులేని విజయాలకు కళ్లెం పడింది. గురువారం నాటి రెండో మ్యాచ్‌లో గుజరాత్, బెంగాల్ జట్ల మధ్య సాగిన హోరాహోరీ మ్యాచ్ 26-26తో డ్రా ముగిసింది. చివరి నిమిషంలో దీపక్ నర్వాల్ అద్భుతంగా ఓ పాయింట్‌ను సాధించి మ్యాచ్‌డ్రాగా ముగించాడు. తొలి అర్ధబాగంలో వారియర్స్ జెయింట్స్‌పై 14-10 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచారు. చివరకు 26-26తో మ్యాచ్ టై అయ్యింది. గుజరాత్ 9 మ్యాచ్‌లతో ఇప్పటి వరకు ఆరు విజయాలు, ఒక్క ఓటమి , రెండు మ్యాచ్‌ల డ్రా చేసుకోవడం ద్వారా 36 పాయింట్లతో జోన్ ఎలో అగ్రస్థానంలో ఎవరికి అందనంత ఎత్తులో నిలిచింది.

PRO KABADDI

నేటి మ్యాచ్‌లు
రాత్రి 8 గంటలకు యూపి యోధ X యు ముంబా
రాత్రి 9 గంటలకు బెంగళూరు బుల్స్ X జైపూర్ పింక్ పాంథర్స్



తమిళ్ తలైవాస్, దబాంగ్ ఢిల్లీ మధ్య మ్యాచ్

లక్ష్య సేన్ సాధించెన్

- బల్గేరియా ఓపెన్ వశం
- అంతర్జాతీయ వేదికపై మెరిసిన టీనేజర్



సోఫియా: ప్రపంచ జూనియర్ నెం:1 షట్లర్ లక్ష్య సేన్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టైటిల్‌తో మెరిశాడు. ఇక్కడ సోఫియాలో హోరాహోరీగా సాగిన బల్గేరియా ఓపెన్ సిరీస్ ఫైనల్‌లో విజేతగా అవతరించాడు. క్రోయేషియా షట్లర్, రెండో సీడ్ వాన్‌మిర్ దురకిన్‌జక్‌పై 18-21,21-12,21-17తో విజయ దుందుభి మోగించాడు. అంతకు ముందు సెమీఫైనల్లో శ్రీలంక షట్లర్ దినుకా కరుణ రత్నేపై 21-19,21-14తో విజయం సాధించిన విషయం తెల్సిందే. బుధవారమే 16వ పుట్టిన రోజును ఈ ఉత్తరాఖండ్ షట్లర్ లక్ష్య జరుపుకున్నాడు. 2016లో ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్‌ను కైవసం చేసుకున్నాడు. ఆ తర్వాత థాయిలాండ్‌లో జరిగిన సిపిబి బ్యాడ్మింటన్‌లో కాంస్యంను సాధించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు చేరి సంచలనం సృష్టించాడు. ఫైనల్లో ప్రణయ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. ఆ తర్వాత పలు టోర్నీల్లో తన సత్తా చాటి కొద్ది నెలలు క్రితమే నెం:1 స్థానాన్ని అధిష్టించాడు. మాజీ ఆల్ ఇంగ్లాండ్ ఛాంప్ పీటర్ గదే వద్ద శిక్షణ పొందుతున్నాడు. పీటర్ ఫ్రెంచ్ జాతీయ జట్టుకు ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. బల్గేరియా తొలి రౌండ్‌లోనే టాప్ సీడ్ సామ్ పార్సన్‌ను ఓడించాడు.

శ్రీలంక ఘోర ఓటమిపై విచారణ

నివేదిక కోరిన క్రీడామంత్రి దయాసిరి

కొలంబో: మూడు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా చేతిలో 3-0తో వైట్‌వాష్‌కు గురైన శ్రీలంక జట్టుపై విమర్శలు పెరిగిన నేపథ్యంలో ఎందుకు ఓడిందోనన్న దానిపై శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ),సెలక్షన్ కమిటీపై గుర్రుగా ఉంది. జట్టు ఘోర వైఫల్యంపై ఓ నివేదిక సమర్పించాలని క్రీడాశాఖ మంత్రి దయాసిరి జయశేఖర బోర్డును ఆదేశించారు. అయితే ప్రస్తుత జట్టుపై తనకు ఎలాంటి సందేహాలు లేవని దయాసిరి చెప్పారు. ఎన్నడూ లేని విధంగా స్వదేశంలోనే సిరీస్ కోల్పోవడం లంక క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీయడం అభిమానుల్లో అలజడి రేగిన నేపథ్యంలో క్రికెట్ బోర్డు, సెలక్షన్ కమిటీ పని తీరుపై క్రీడా శాఖ కార్యరంగంలోకి దిగడం విశేషం. ఈ నిర్ణయం తీసుకుంది. 18 ఏళ్ల లంక క్రికెట్ ప్రస్థానంలో ఇంత ఘోరంగా భారత్ చేతిలో ఓడిపోవడంపై తీవ్ర విమర్శలు ఇప్పుడు శల్య పరీక్షకు దారితీసింది.

చర్చల్లో ఆమోదించిన మేరకు జీతాలు పెంచాలి

సర్వశిక్ష అభియాన్ జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సర్వశిక్ష అభియాన్ పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు గత చర్చల్లో ఆమోదించిన మేరకు జీతాలు పెంచాలని సర్వశిక్ష అభియాన్ జెఎసి డిమాండ్ చేసింది. మానవ వనరుల శాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శితో జరిగిన చర్చల్లో ఆమోదించిన దాని కంటే తక్కువగా జీతాలు పెంచడం ఉద్యోగులకు అన్యాయం చేయడమేనని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. సర్వశిక్ష అభియాన్‌లోని వివిధ విభాగాల్లో దాదాపు 25వేల మంది పనిచేస్తున్నారని, వీరిలో సిఆర్పీలు, మెసెంజర్లు, కెజిబివి పాఠశాలల బోధన, బోధనేతర సిబ్బంది, ఎస్ఒలు, ఎస్‌పిడి కార్యాలయం, జిల్లా పిఒ ఆఫీసు సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు, ఎఎన్ఎంలు అనేక మంది ఉన్నట్లు తెలిపింది. వీరందరికీ ఆగస్టు 1 నుంచి జీతాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల జెఎసి హర్షాన్ని వ్యక్తం చేసింది.

సాక్షి కథనాలపై చర్యలు తీసుకోండి

ఎన్నికల ప్రధానాధికారికి టిడిపి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికపై సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి టిడిపి రాష్ట్ర కార్యాలయ సమన్వయ కార్యదర్శి టిడి జనార్ధనరావు గురువారం లేఖ రాశారు. ఓటమి భయంతోనే నంద్యాలలో టిడిపి వందల కోట్లు ఖర్చు చేస్తోందని సాక్షిలో ప్రచురించారని, ఆ వివరాలు అవాస్తమని పేర్కొన్నారు. వైసిపి ఎన్నికల ప్రచార కరపత్రంలా ఉన్న కథనాల్ని పెయిడ్ ఆర్టికల్స్‌గా పరిగణలోకి తీసుకోవాలని, ఆ మొత్తాన్ని వైసిపి ఎన్నికల ఖర్చులో లెక్కించాలని కోరారు. ఇలాంటి పెయిడ్ ఆర్టికల్స్‌ను ప్రచురించకూడదని ఆ లేఖలో పేర్కొన్నారు.

నంద్యాల ఉప ఎన్నిక రద్దు చేయాలి

పిసిసి నేత రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార, ప్రధాన ప్రతిపక్షాలు రెండూ విచ్చల విడిగా డబ్బు ఖర్చు చేస్తున్నందున నంద్యాల ఉప ఎన్నికను వెంటనే రద్దు చేయాలని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం నంద్యాలలోనే మకాం వేసిందని, దీంతో రాష్ట్రంలో పాలన పడకేసిందని వ్యాఖ్యానించారు. వ్యవసాయ మంత్రి రెండు నెలలుగా అక్కడే ఉన్నారని, సిఎం ఇప్పటికే మూడుసార్లు నంద్యాలకు వెళ్లారని తెలిపారు. ప్రతిపక్ష నేత జగన్ గత పది రోజులుగా నంద్యాలలోనే మకాం వేశారన్నారు. తమని బలమైన పార్టీలని చెప్పుకునే వారికి ఎందుకింత భయమని ప్రశ్నించారు. అధికార, ప్రతిపక్ష నేతల చర్యలతో నంద్యాలలో ప్రజాస్వామ్యం మంటగలిసి పోయిందని రఘువీరా ఆవేదన వ్యక్తం చేశారు.

సిఎం కార్యక్రమానికే కరెంటు లేదు..



విజయవాడలో జరుగుతున్న హార్టికల్చర్ ఎగ్జిబిషన్ తిలకించేందుకు వచ్చిన సిఎం చంద్రబాబుకు అరుదైన అనుభవం ఎదురైంది. ఆయన హార్టికల్చర్ ఎగ్జిబిషన్‌కు రాగానే కరెంటు సరఫరా నిలిచిపోయింది. చేసేదేమిలేక టార్చ్‌లైట్ వెలుగులోనే సిఎం ఎగ్జిబిషన్ తిలకించారు.



ఆర్టీసి బస్సుల్లో నిఘానేత్రం

- ముందుగా ఎసి బస్సుల్లో సిసి కెమెరాలు
- సూచనప్రాయంగా నిర్ణయం
- నిధుల కోసం ప్రణాళిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి బస్సుల్లో నిఘా పెట్టేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోనుంది. సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్‌ఆర్టీసి) నిర్ణయించింది. బస్సుల్లో ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ప్రణాళికను రూపొందిస్తోంది. బస్సుల్లో సిసి కెమెరాల ఏర్పాటు అంశంపై విజయవాడలోని ఆర్టీసి హౌస్‌లో గురువారం ఉన్నతాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. సిసి కెమెరాల ఏర్పాటుతోనే ప్రయాణికులకు భద్రత కల్పించగలమన్న వాదన ఈ సమావేశంలో ముందుకొచ్చింది. ఢిల్లీలో చోటుచేసుకున్న నిర్భయ ఘటనతో పాటు ఇటీవల దేశంలోని పలు ప్రాంతాల్లో బస్సుల్లోనే ఆకతాయిలు చెలరేగిపోయిన నేపథ్యంలో ఎపిఎస్ ఆర్టీసి ఈ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఆ ఆలోచన త్వరలోనే కార్యరూపం దాల్చేలా ఆర్టీసి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోనున్నారు. రీజియన్ పరిధిలో ఎన్ని బస్సుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందో నివేదికలు పంపాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసిలో రాష్ట్ర వ్యాప్తంగా 11,785 బస్సులు నడుస్తుండగా, వాటిలో 7 వెన్నెల బస్సులు, 45 అమరావతి, 23 గరుడ ప్లస్, 59 గరుడ, 99 ఇంద్ర బస్సు సర్వీసులతో కలిపి మొత్తం 233 ఎసి బస్సులున్నాయి. మొదటి విడతలో ఎసి బస్సుల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, క్రమంగా సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సుల్లోనూ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్టీసి ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటు కోసం ఎంత మేర ఖర్చు చేయాల్సి ఉంటుందనే అంశంపై అంచనా వేస్తున్నారు. ప్రధాన ప్రాంతాలకు తిరిగే బస్సుల్లోనూ, ప్రధాన నగరాల్లో తిరిగే సిటీ బస్సుల్లోనూ సిసి కెమెరాల అవసరముంటుందని సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అయితే సిసి కెమెరాల ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నది కావడంతో మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు మరికొంత కాలం పడుతుందని ఆర్టీసి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆర్టీసి ఇప్పటికే నష్టాల్లో ఉండటంతో సిసి కెమెరాల ఏర్పాటుకయ్యే ఖర్చు విషయంలో ఆర్టీసి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారాన్ని కోరే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

టిడిపికి జ్యోతుల చంటిబాబు రాజీనామా

త్వరలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-జగ్గంపేట (తూర్పుగోదావరి)



జ్యోతుల చంటిబాబు

ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ జ్యోతుల చంటిబాబు ఆ పదవికీ, తెలుగుదేశం పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని తన స్వగృహంలో పార్టీ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల అభీష్టం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణను కుటుంబసభ్యులు, కార్యకర్తల నిర్ణయం మేరకు ప్రకటిస్తామని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పనిచేసిన వారిని మరచిపోయి దొడ్డిదారిన వచ్చినవారికి అధిష్టానం ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. జ్యోతుల నెహ్రూ 2008లో పార్టీని వీడి ప్రజారాజ్యంలో చేరితే పార్టీకి గడ్డుపరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి పార్టీ జెండాను భుజానవేసుకుని పార్టీని బలోపేతం చేశానన్నారు. వైసిపి నుంచి గెలిచిన నెహ్రూ తెలుగుదేశంలోకి వస్తే చంద్రబాబు ఆహ్వానించారని.. పార్టీకోసం పనిచేసిన తనను విస్మరించడం కలచివేసిందన్నారు.

వైసిపిలో చేరేందుకు సన్నాహాలు

జ్యోతుల చంటిబాబు త్వరలో వైసిపిలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు తనకు ఆహ్వానం లభించకపోవడంతో ఆయనతోపాటు అనుచరులు అసంతృప్తికి లోనయ్యారు. కాకినాడ పురపాలక ఎన్నికల సందర్భంగా ఈ నెల 22న వస్తున్న వైసిపి అధినేత జగన్‌ను కలసి ఆ పార్టీలో చేరికపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని అనుచరులు చెబుతున్నారు.

లాఠీఛార్జీపై నిరసనల వెల్లువ



శ్రీకాకుళంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

- వంశధార నిర్వాసితులకు మద్దతుగా సిపిఎం, సిపిఐ ఆందోళనలు
- శ్రీకాకుళంలో సిపిఐ నాయకులు అరెస్టు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ, టెక్కలి

ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన తమకు న్యాయం చేయాలని కోరుతున్న వంశధార నిర్వాసితులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడంపై నిరసనలు వెల్లువెత్తాయి. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన జిల్లాలో పలుచోట్ల గురువారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. శ్రీకాకుళం నగరంలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.గోవిందరావు, నగర కార్యదర్శి టి.తిరుపతిరావు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న నిర్వాసితులపై పోలీసులతో ప్రభుత్వం లాఠీఛార్జీ చేయించడం అమానుషమన్నారు. నిర్వాసితులకు చట్టప్రకారం అందించాల్సిన పరిహారం, ప్యాకేజీ, పునరావాసం కల్పించకుండా ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘించిందని విమర్శించారు. వంశధార నిర్వాసితులు చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని కోరడం నేరమా? అని ప్రశ్నించారు. ర్యాలీకి ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు ఐ.జయదేవ్ సంఘీభావం తెలిపారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం, మండల కేంద్రాలైన రణస్థలం, పలాసల్లో సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీలు జరిగాయి. టెక్కలిలో నిరసన ప్రదర్శన చేపట్టి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ శ్యామలాదేవికి వినతిపత్రం ఇచ్చారు.

సిపిఐ నాయకులు అరెస్టు

లాఠీఛార్జీలో గాయపడిన వంశధార నిర్వాసితు లను పరామర్శించడానికి బయలుదేరుతున్న సిపిఐ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని సిపిఐ కార్యాలయం వద్ద పోలీసులు మోహరించడంతో పరామర్శ కార్యక్రమాన్ని వాయిదా వేసుకొని శ్రీకాకుళం నగరంలో ర్యాలీ నిర్వహించ తలపెట్టారు. ర్యాలీ నిర్వహించేందుకు కార్యాలయం నుంచి బయటకొచ్చిన సిపిఐ నాయకులను పోలీసులు అడ్డగించారు. దీంతో పోలీసులు, సిపిఐ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులను తోసుకుంటూ సిపిఐ నాయకులు ముందుకెళ్లే ప్రయత్నం చేయగా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణతో పాటు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసి శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

28 మంది నిర్వాసితులకు రిమాండ్

నిర్వాసితులపై సెక్షన్ 307 కింద కేసులు పోలీసులు నమోదు చేశారు. బుధవారం అరెస్టు చేసిన హిరమండలంలోని పాడలి గ్రామానికి చెందిన 28 మంది వంశధార నిర్వాసితులను ప్రత్యేక వాహన ంలో టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టుకు గురువారం సాయంత్రం తీసుకొచ్చారు. అప్పటికే కోర్టు పనివే ళలు ముగియడంతో ఆమదాలవలస సిఐ నవీన్ కుమార్ నిర్వాసితులను మెజిస్ట్రేట్ ఇంటికి తీసుకెళ్లి హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో వారిని పాతపట్నం సబ్‌జైలుకు తరలించారు. నిర్వాసితులను తరలి స్తున్న వాహనం బురదలో కూరుకుపోవడంతో, క్రేన్ సాయంతో బయటకు తీశారు.

నిర్వాసిత గ్రామాల్లో సిపిఎం నాయకుల పర్యటన

వంశధార నిర్వాసిత గ్రామమైన పాడలిలో సిపిఎం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి గురువారం పర్యటించారు. ఆ గ్రామంలోని పలు కూడళ్లలో నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ఎదలు, వరి నారు మళ్లువేసిన పొలాలను అధికారులు మట్టి కోసం జెసిబిలతో ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు చట్టప్రకారం ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.పది లక్షల నుంచి రూ.11 లక్షల వరకూ ప్యాకేజీ రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం రూ.ఐదు లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. నిర్వాసితులందరూ ఐక్యంగా కదిలితే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68